జ్ఞాన సిద్ధాంతం
రూ॥200/-
పేజీలు:210



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

సంపుటి 29, సంచిక: 40 | బుధవారం | 29-07-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


### 17 నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు!

తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 17 నుంచి జరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు చేరుకున్న అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం. 'ఎన్నికల్లో పోటీకి కనీస వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించే ప్రతిపాదన'తో పాటు పలు కీలక బిల్లులపై చర్చించే అవకాశముంది.

## విద్యార్థులపై పాశవిక కృత్యాలకు
# జవాబుదారీతనమే ప్రధానం



- 7వ రోజూ స్తంభించిన పార్లమెంట్
- మధ్యాహ్నం నుంచి లీకేజీల నిరోధక బిల్లుపై చర్చ
- స్వతంత్ర దర్యాప్తు కమిటీ ఏర్పాటుపై సుప్రీంకోర్టు ఆలోచన

దేశమంతటా శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న విద్యార్థులపై పాశవికమైన దాడులకు జవాబుదారును నిర్ణయించటం తదుపరి ప్రధాన సమస్యగా మంగళవారం పార్లమెంటు ముందుకు వచ్చింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు 7వ రోజు (జులై 28) కూడా ఉభయ సభల కార్యక్రమాలకు అంతరాయం కలిగించాయి. ఇదిలా వుండగా, సుప్రీంకోర్టు పూర్తిగా స్వతంత్ర దర్యాప్తు అవసరాన్ని వక్కాణించింది. విద్యార్థుల ప్రదర్శన సందర్భంగా అతిశయించిన హింసపై ''పూర్తిగా స్వతంత్ర దర్యాప్తు అవసరం. అత్యాచారాలకు ఎవరు పాల్పడినప్పటికీ, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారో వారిపై చర్యలు తీసుకోవాలి. బాధ్యత స్థిరపరచకపోతే దర్యాప్తుకు అర్థం లేదు'' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ బెంచి వ్యాఖ్యానించింది. అవసరమైతే సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు కమిటీని నియమిస్తామంది. లోక్‌సభలో ప్రారంభ అలజడుల తదుపరి మధ్యాహ్నం 2 గంటలకు ''ప్రభుత్వ పరీక్షల (అక్రమ పద్ధతుల నిరోధం) సవరణ బిల్లు, 2026''పై చర్చ మొదలైంది.కాగా 11గంటలకు రాజ్యసభ ప్రారంభం కాగానే, విద్యార్థులపై పోలీసుల పాశవిక కృత్యాలపై ముందుగా చర్చ చేపట్టాలని ప్రతిపక్షాలు నినాదాలతో సభ మార్మోగింది. ఉపరాష్ట్రపతి, సభాధ్యక్షుడు సిపి రాధాకృష్ణన్ మధ్యాహ్నం 2 గంటలకు సభ వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తదుపరి ప్రతిపక్షాల నినాదాల కారణంగా రేపటికి వాయిదాపడింది. సుప్రీంకోర్టు ఐదు ఆదేశాలు జారీ చేసింది. 1. సిసి టివి, డ్రోన్, బాడీ కెమెరాల ఫుటేజీ మొత్తం, వైర్‌లెస్ కమ్యూనికేషన్ లాగ్స్, పిసిఆర్ సురక్షితంగా ఉంచాలి. 2. అధికారులు విద్యార్థి నిరసనకారుల వ్యక్తిగత సమాచారం, డిజిటల్ డేటా భద్రపరచాలి. వాటిని బహిరంగపరచరాదు. 3. నిరసనకారుల వ్యక్తిగత డేటా, లేదా వివరాలు ప్రచురించరాదు. 4. విద్యార్థి నిరసనకారులపై, క్రిమినల్ పూర్వచరిత్ర ఉంటే తప్ప హింసించే చర్యలు తీసుకోరాదు. 5. నిరసనల కుగాను అరెస్టుచేసిన / నిర్బంధించిన విద్యార్థులను, క్రిమినల్ పూర్వ చరిత్ర ఉంటే తప్ప, విడుదల చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం, అసోం, బిహార్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు కూడా జారీచేసింది.



## అదనపు వసూళ్లు చేస్తే చర్యలు తప్పవ్

- ట్యూషన్ ఫీజు కాకుండా ఇతర పేర్లతో రుసుములు వసూళ్లు చేయెద్దు
- ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ ఇంజినీరింగ్ కళాశాలలకు టిఎఎఫ్‌ఆర్‌సి హెచ్చరిక
- ప్రతి విద్యార్థికీ రూ.2 లక్షల చొప్పున జరిమానా విధిస్తామని స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ ఇంజినీరింగ్ కళాశాలలు ప్రభుత్వం నిర్దేశించిన ట్యూషన్ ఫీజు కాకుండా ఇతర పేర్ల తో అదనపు రుసుములను వసూళ్లు చేస్తే తీవ్ర చర్యలు తప్పవని తెలంగాణ రాష్ట్ర ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ (టిఎఎఫ్‌ఆర్‌సి) హెచ్చరించింది. కళాశాలలు వసూలు చేసే అదనపు ఫీజులకు ప్రతి విద్యార్థికీ రూ.2 లక్షల చొప్పున జరిమానాను విధిస్తామని స్పష్టం చేసింది. ఈమేరకు టిఎఎఫ్‌ఆర్‌సి మంగళవారం రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థల యాజమాన్యాలకు ఉత్తర్వులు జారీ చేసిం ది. అదనపు ఫీజులకు సంబంధించి ఏమైనా ఆధారాలు ఉంటే, లేదా రశీదులు ఉన్నా టిఎఎఫ్‌ఆర్‌సి కార్యాలయంలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు, వారి తల్లి దండ్రులకు సూచించింది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే ప్రైవేట్ కళాశాలలు అదనంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నుంచి తమకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందినట్టు టిఎఎఫ్‌ఆర్‌సి తెలిపింది. అడ్మిషన్ ఫీజు, ఎన్‌బిఎఫీజు, తరువాయి 12లో

## పోలీసు చర్యలపై వివరణకు
# ఉభయసభల్లో విపక్షాలు పట్టు

**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీకేజీపై ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యలకు సంబంధించి ప్రతిపక్ష ఎంపిలు ప్రభుత్వం నుంచి సమాధానానికి డిమాండ్ చేయడంతో మంగళవారం కూడా పార్లమెంట్ ఉభయసభలు స్తంభించాయి. ఉదయం ఉభయలు సభలు ప్రారంభమైన వెంటనే విద్యార్థులపై పోలీసుల అమానుష దాడి అంశాన్ని ప్రతిపక్ష ఎంపిలు లేవనెత్తారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్‌సభ, రాజ్యసభ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో సభలు ప్రారంభమైన వెంటనే ఉభయసభలను కూడా స్పీకర్, చైర్మన్ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తరువాత రాజ్యాసభ కాగా, పరిస్థితులో మార్పు లేకపోవడంతో సభను బుధవారానికి వాయిదా వేశారు. ఇక లోక్‌సభలో పరీక్షల లీకేజీ బిల్లుపై చర్చను ప్రారంభించారు. కాగా, రాజ్యసభలో తరువాయి 8లో


## సమూల సంస్కరణలు లేని
# సవరణలెందుకు?



- మళ్ళీ విఫలమవుతారు జాగ్రత్త : గౌరవ్ గొగోయ్ హెచ్చరిక
- పేపర్ లీకేజీ బిల్లుపై లోక్‌సభలో చర్చ : ప్రతిపక్షాల నిశిత విమర్శలు

విద్యావ్యవస్థలో సమూల సంస్కరణలు తీసుకురాకుండా,విఫలమైన పాత చట్టానికి సవరణలు ప్రతిపాదించడంవల్ల ప్రయోజనం ఏముందని లోక్‌సభలో ప్రతిపక్షాలు మోదీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశాయి.ప్రభుత్వ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ)సవరణ బిల్లు–2026పై మంగళవారం లోక్‌సభలో కాంగ్రెస్‌శాసన సభాపక్ష ఉపనాయకుడు గౌరవ్ గొగోయ్ ప్రతిపక్షాల తరపున మొదట చర్చ ప్రారంభించారు. 2024లో కేంద్రం తెచ్చిన చట్టం విఫలమైపోయిందని ఆచరణలో రుజువైందని, ఆ విఫలచట్టంలో శిక్షలు–జరిమానాలు పెంచుతూ తరువాయి 8లో

## 'నీట్' నిరసనలపై..
# నిష్పక్షపాత దర్యాప్తు



సుప్రీంకోర్టు వెల్లడి

**న్యూఢిల్లీ :** విద్యార్థులు ఇటీవల చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న నిరసనకారులపై ఎలాంటి బలవంతపు చర్యలూ తీసుకోవద్దని రాష్ట్రాలను సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. అలాగే, 18 సంవత్సరాలలోపు వారిలో ఎవరికీ ఎలాంటి నేరచరిత్ర ఉండకూడదనే షరతుపై వారిని విడుదల చేయాలని కూడా సర్వోన్నత న్యాయ స్థానం ఆదేశించింది. పరీక్షలలో అవకతవకలు, నీట్ పరీక్ష పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా జరిగిన ప్రదర్శనల సందర్భంగా పోలీసుల క్రూరత్వంపై దాఖలైన పిటిషన్ల బ్యాచ్ విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ విషయంపై నిష్పక్షపాతమైన తరువాయి 8లో

## కోచింగ్ సెంటర్లు
# పేపర్ లీక్‌కు వేదికలు

- ఈ విషయంలో జాతీయ స్థాయిలో ఒక విధానాన్ని నిర్వహించాలి
- పరీక్షలు ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయ్
- యూనివర్సిటీలపై ఆధిపత్యం చెలాయించాలనే యత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలి
- ప్రశ్నాపత్రాల నివారణకు కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై ఆలోచిస్తాం
- విద్య రాష్ట్ర పరిధిలో ఉంటేనే తప్పిదాలకు అవకాశాలు తక్కువ
- ఇక ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తాం
- ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



''కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన గొప్ప సంస్కరణ హైడ్రా. అత్యుత్తమ సంస్థల్లో హైడ్రా ఒకటి. హైడ్రా మంచి పనులు చేస్తోంది. ప్రభుత్వ పార్కులు, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా విధి. ఆ పనిని హైడ్రా పకడ్బందీగా చేస్తోంది. హైడ్రా కొనసాగిస్తున్న పనులను భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం''
– సిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రశ్నా పత్రాల లీకేజీలకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవని, ఆఫ్ లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయని సిఎం పేర్కొన్నారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతున్నాయని సిఎం విమర్శించారు. ఈ విషయంలో జాతీయస్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరమున్నదని సిఎం అభిప్రాయపడ్డారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్ రెడ్డి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. యూనివర్సిటీలపై ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సిఎం సూచించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందని, ఈ అంశంపై పార్లమెంట్ చర్చ జరగాల్సి ఉందన్నారు. సభలో చర్చ జరిగితే రాహుల్ గాంధీ అన్ని అంశాలపై మాట్లాడతారని సిఎం తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీల నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాన్ని చూసిన అనంతరం రాష్ట్రంలో ఏమి చేయాలనేది నిర్ణయం తీసుకుంటామని సిఎం ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. యూపిఎస్‌సి విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతోనే తాము పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని సిఎం తెలిపారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సిఎం చెప్పారు. గ్లోబరీనా వటి సంస్థలు నాడు అక్రమాలకు పాల్పడినా గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో వారు సిబిఎస్‌ఈ పరీక్షల వరకు విస్తరించి, వాటిని గందరగోళం చేశారని సిఎం విమర్శించారు. ఇలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సిఎం తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి కెసిఆర్ ప్రభుత్వం రూ.8వేల కోట్లను బకాయిలను తరువాయి 8లో

### పిఎంఎవై–జి కింద 11.56 లక్షల ఇండ్లను కేటాయించండి 12

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి



## విద్యార్థి ఉద్యమకారులపై
# వేధింపులు ఆపాలి

- వామపక్ష పార్టీలు పిలుపు
- విద్యార్థి, యువజన ఉద్యమ చరిత్రాత్మక విజయాన్ని స్వాగతించిన కమ్యూనిస్టు నేతలు
- జంతర్ మంతర్ నిరసన స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని అభిప్రాయం

**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన విద్యార్థి, యువజన ఉద్యమ చరిత్రాత్మక విజయాన్ని మూడు వామపక్ష పార్టీలు స్వాగతించాయి. విద్యార్థి ఉద్యమకారులపై జరుగుతున్న వేధింపులను ఆపాలని పిలుపునిచ్చాయి. విద్య, పరీక్షా విధానాలలో సమర్థవంతమైన సంస్కరణలను, అలాగే సురక్షితమైన, గౌరవప్రదమైన ఉపాధి హక్కులను సాధించడానికి జంతర్ మంతర్ నిరసన స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని అభిప్రాయం వ్యక్తం చేశాయి. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించేందుకు, వామపక్షాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసేందుకు సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జాతీయ నాయకులు న్యూఢిల్లీలోని సిపిఐ (ఎంఎల్) ప్ర ధాన కార్యాలయం 'చారు భవన్'లో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ పాండా, డాక్టర్ గిరీ శ్, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు అరుణ్ కుమార్, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆ పార్టీ నాయకులు రవి రాయ్, సంజయ్ శర్మ, సుచేతడే, శ్వేత రాజ్, ప్రభాత్ చౌదరి పాల్గొన్నారు.ప్రజల ప్రయోజనాలను కాపాడటం, తరువాయి 12లో

## ప్రధాని 'సెల్ఫీ వీడియో పోస్ట్' తొలగింపు...
# 'మెటా'కు కేంద్రం సమన్లు

వివరణపై అసంతృప్తి

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ భారత యువతను ఉద్దేశించి ప్రసంగిస్తూ, పేపర్ లీక్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన పోస్ట్‌ను అమెరికాకు చెందిన సోషల్ మీడియా సంస్థ తొలగించిన తర్వాత, ప్రభుత్వం 'మెటా' గ్లోబల్ హెడ్ ఆఫ్ పబ్లిక్ పాలసీకి సమన్లు జారీ చేసింది. ఈ విషయాన్ని మంగళవారం సంబంధిత వర్గాలు వెల్లడించాయి. తమ ఆటోమేటెడ్ కంటెంట్ ఫిల్టర్‌లలోని ఒక లోపం కారణంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫేస్ బుక్ పోస్ట్ తొలగించినట్లు 'మెటా' ఆ విషయాన్ని తెలియజేసిందని వర్గాలు తెలియజేశాయి. కాగా, 'మెటా' ఇచ్చిన వివరణ సహేతుకంగా లేదని , దీనిపై మరింత లోతైన చర్చలు అవసరమని వర్గాలు తెలిపాయి. ఈ విషయం ఇంకా కొలిక్కిరాలేదని కూడా వర్గాలు వెల్లడించాయి. ఆటోమేటెడ్ సిస్టమ్‌లోని సాంకేతిక లోపం వల్ల ఈ పొరపాటు జరిగితే మెటా తప్పనిసరిగా తన సాధనాలను మెరుగుపరుచుకోవాలని చెప్పినట్లు వారు తెలిపారు. ఈ విషయంపై 'మెటా' (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్) గ్లోబల్ హెడ్ ఆఫ్ పబ్లిక్ పాలసీని ఐటి మంత్రిత్వ శాఖ పిలిచిందని వర్గాలు తెలిపాయి. యువతను తరువాయి 12లో

## హోర్ముజ్ భద్రతపై ఒమన్–సౌదీలతో
# ఇరాన్ దౌత్య చర్చలు

- అమెరికాతో చర్చలకు తిరస్కరించి సొంత యత్నాలు
- స్వచ్ఛంద రుసుములతో జలసంధి నిర్వహణ : ఒమన్ ప్రతిపాదన

**టెహ్రాన్:** అమెరికా దురాక్రమణ నుండి హోర్ముజ్ జలసంధిని కాపాడేందుకు ఇరాన్ ముమ్మరంగా దౌత్య ప్రయత్నాలు చేస్తోంది. ఈ చర్యల్లో భాగంగా ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి మంగళవారం ఒమన్ విదేశాంగమంత్రి బదర్ అల్బుసైదీ, సౌదీ అరేబియా విదేశాంగమంత్రి ఫైజల్ బిన్ ఫర్హాన్‌లతో వేరు వేరుగా టెలిఫోన్ సంభాషణలు చేశారు. హోర్ముజ్ జలసంధి భద్రత, పశ్చిమాసియాలో స్థిరత్వం సాధించేందుకు, అమెరికా దురాక్రమణను తొలగించి, ఆ ప్రాంతంలో హోర్ముజ్‌పై సెంట్‌కామ్ ఆధిపత్యం లేకుండా చేసేందుకు అబ్బాస్ అరాఘ్చి తన దౌత్య చర్యలు వేగవంతం చేశారు. హోర్ముజ్ జలసంధి ఇప్పటికీ ఇంకా తమ అధీనంలోనే ఉందని, నౌకల రాకపోకలు స్తంభించిపోయాయని ఆయన చెప్పారు. పశ్చిమాసియాలో ప్రాంతీయ స్థిరత్వాన్ని నెలకొల్పేందుకు సహకారాన్ని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని, ఉమ్మడి దౌత్య ప్రయత్నాలను ముందుకు తీసుకువెళ్ళాలని ఆయన ఒమన్,సౌదీ విదేశాంగ మంత్రులతో మాటల సందర్భంగా ఉద్ఘాటించారు. ద్వైపాక్షిక,ప్రాంతీయ పరిణామాలపై వారితో అబ్బాస్ చర్చించారు. హోర్ముజ్ జలసంధిలో అమెరికా పెత్తనానికి ప్రయత్నం చేయడంవల్ల అస్థిరత్వం వచ్చిందని, తిరిగి తరువాయి 12లో



- సింగరేణిలో శంకర్ రావు 'సెట్టింగ్' సామ్రాజ్యం!
- కారుణ్య నియామకాలు, బదిలీలు, మెడికల్ అన్ ఫిట్ పేరిట పక్కా వ్యూహంతో వసూళ్లు
- బాధితుల వద్ద లభించిన చెక్కులు, ప్రామిసరీ నోట్లతో దొరికిపోయిన నేత

## కార్మికుడి కన్నీటితో
# రూ.కోట్ల దందా..!

ప్రజాపక్షం / మంచిర్యాల

నల్లబంగారు నేలలో కార్మికులు నిలువు దోపిడీ గురవుతున్నారు. రాత్రింబవళ్లు భూమి పొరల్లో ప్రాణాలను పణంగా పెట్టి, స్వేదం చిందించి రాష్ట్రానికి వెలుగులు పంచే కార్మిల కష్టార్జితం కొందరి వ్యక్తిగత స్వార్థానికి కామధేనువుగా మారుతోంది. బదిలీల కోసమో, అనారోగ్యంతో ఉన్న తండ్రి స్థానంలో కొడుకుకు కారుణ్య నియామకం తెచ్చుకోవడం కోసమో, మెడికల్ అన్ ఫిట్ చేయించుకోవడం కోసమో కార్మికుడు పడే తపనను, వారి బలహీనతను ఆసరాగా చేసుకుని కొన్ని శక్తులు కోట్ల రూపాయల 'సెట్టింగ్' దందాకు తెరలేపాయి. ప్రస్తుతం సింగరేణిలో ఉద్యోగం చేస్తూ ఐఎన్‌టియుసి నాయకుడిగా చెలామణి అవుతున్న జెట్టి శంకర్ రావు సాగించిన ఈ రాబందుల దందా ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. సంఘం నేతగా చెలామణి అవుతూ 'పని అయిపోతుంది' అనే ఒక్క మాటతో శంకర్ రావు పదుల సంఖ్యలో ఉన్న అమాయక కార్మికుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశాడు. 2021 నుంచి విడతల వారీగా బదిలీలు, కారుణ్య నియామకాల పేరిట డబ్బులు దండుకున్నట్లు వెల్లడైంది. ఎస్‌ఆర్‌పి 3 గనికి తరువాయి 8లో



09

## స్వర్ణంతో మెరిసిన షర్మిలా ధన్‌ఖడ్

పారా అథ్లెటిక్స్ మహిళల షాట్‌పుట్ ఎఫ్–57 విభాగంలో 40 ఏళ్ల షర్మిలా ధన్‌ఖడ్ అసాధారణ ప్రదర్శన కనబర్చింది. ఆమె 9.81 మీటర్ల దూరం షాట్‌పుట్ విసిరి ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. దీంతో కామన్వెల్త్ పారా అథ్లెటిక్స్ చరిత్రలో భారత్‌కు తొలి స్వర్ణ పతకాన్ని అందించిన అథ్లెట్‌గా నిలిచింది.

# సౌదీతో అణుఒప్పందం ట్రంప్ మతిమాలిన పని

ఇరాన్ అణ్వస్త్ర కార్యక్రమాన్ని ధ్వంసం చేయటానికి దానితో యుద్ధం చేస్తున్నామని ప్రచారాన్ని నమ్మించజూస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సౌదీ అరేబియాతో పౌర అణుశక్తి ఒప్పందం కుదుర్చుకోవటం మతిమాలిన చర్య అని ఇట్టే అర్థమవుతుంది. అణు ఇంధనాన్ని శుద్ధిచేసే ఆయుధ గ్రేడ్ ఇంధనాన్ని తయారు చేసే అవకాశాన్ని సైతం రియాద్‌కు కల్పించిన ఈ ఒప్పందంపై స్వదేశంలో తీవ్ర విమర్శలు రావటంతో దిద్దుబాటు చర్యగా, 'అబ్రహం ఒప్పందాలు (ఇజ్రాయెల్‌తో శాంతియుత సహజీవనం) సౌదీ అరేబియా అంగీకరిస్తేనే అణు ఒప్పందం అమలు జరుగుతుంది' అంటూ ట్రంప్ మరో తప్పు చేశారు. 'అటువంటిదేదీ సంతకాలు జరిగిన ఒప్పందంలో లేదే! అందులోలేని విషయాలకు విలువ ఉండదు' అని సౌదీ పాలకులు సున్నితంగా చురక అంటించారు. పశ్చిమాసియా ప్రాంతంలో ఏకైక అణ్వస్త్ర దేశంగా ఇజ్రాయెల్ పరిగణించబడుతున్నది. సౌదీతో అమెరికా ఒప్పందంపై నెతన్యాహూ ప్రభుత్వం గుంభనంగా ఉన్నా, రాజకీయ వర్గాలనుంచి అసాధారణ ఆందోళన వ్యక్తమైంది. ఇజ్రాయెల్ తలమీదుగా సౌదీతో ఒప్పందం తీవ్రమైన వ్యూహాత్మక వైఫల్యంగా మాజీ ప్రధాని నెఫ్తాలీ బెన్నెట్ వ్యాఖ్యానించారు. సౌదీ గడ్డపై అణు ఇంధనం శుద్ధి ఈ ప్రాంతాన్ని అణ్వాయుధ పరుగుపందెంలో పెడుతుందని, అది ప్రమాదకరంగా అదుపు తప్పుతుందని ఆయన హెచ్చరించారు.

అమెరికా అణుశక్తి వ్యాప్తి నిరోధక విధానాన్ని గుణాత్మకంగా మార్పు చేసే ఈ ఒప్పందం అమెరికా అణుశక్తి చట్టంలోని సెక్షన్ 123 కింద అధికారికంగా కుదుర్చుకోబడింది. అమెరికా ఎనర్జీ కార్యదర్శి క్రిస్ రైట్, సౌదీ అరేబియా ఇంధనమంత్రి ప్రిన్స్ అబ్దుల్ అజీజ్ బిన్ సల్మాన్ సంతకాలు చేసిన ఈ పౌర అణుశక్తి ఒప్పందం సౌదీ అరేబియాలో పౌర అణుశక్తి కార్యక్రమాన్ని (అణు విద్యుచ్ఛక్తి ఉత్పత్తి) నిర్మించేందుకు అమెరికన్ కంపెనీలకు చట్టబద్ధ అనుమతి ఇస్తున్నది. డాక్టర్ మన్మోహన్ సింగ్ యుపిఎ తొలి ప్రభుత్వంలో 2008లో అమెరికాతో కుదుర్చుకున్న పౌర అణుశక్తి ఒప్పందం ఈ చట్టం కిందనే జరిగింది. అయితే అమెరికన్ కంపెనీలు సరఫరా చేసే అణు విద్యుత్ రియాక్టర్లలో లోపాలవల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఆ కంపెనీలే పూర్తి పరిహారం చెల్లించాలన్న భారత్ చట్టం (లయబిలిటీ యాక్ట్) కారణంగా ఆ ఒప్పందం ఇంతవరకు అమలులోకి రాలేదు. పరిహార మొత్తాన్ని నిర్దిష్ట పరుస్తూ ఇరుదేశాల మధ్య అంగీకారం కుదిరినట్లు కొద్దినెలల క్రితం వార్తలొచ్చాయి. సౌదీతో ''పెక్కు బిలియన్ డాలర్ల'' అణు ఒప్పందం కొన్ని దశాబ్దాలు (30ఏళ్లు) అమలులో ఉంటుందని, అమెరికన్‌లకు ఉద్యోగాలు కల్పిస్తుందని, సౌదీ రాజ్యంతో సంబంధాలు పటిష్టం చేస్తుందనే వాదనను అమెరికా ఇంధనశాఖ ఈ ఒప్పందానికి సమర్థనగా వినిపిస్తున్నది. యురేనియం శుద్ధి, వినియోగించిన ఇంధన రీప్రాసెసింగ్ చేయకుండా రియాద్‌పై నిషేధం విధించలేదు. యుఎఇ తమ బరాఖ్ అణు విద్యుత్కేంద్రం నిర్మించేటపుడు ఆ షరతుకు అంగీకరించింది.

గల్ఫ్ రాజ్యాల్లో ఆర్థికంగా అత్యంత శక్తిమంతమైన సౌదీ అరేబియా క్రూడ్ ఆయిలు ఎగుమతిలో ప్రపంచంలోనే మిన్న. అయితే అంతర్గతంగా విద్యుచ్ఛక్తి, నీటినుంచి ఉప్పు తొలగించే కర్మాగారాలకు ప్రతిరోజూ ముఖ్యంగా వేసవిలో 10లక్షల బ్యారల్స్‌కు పైగా ఆయిలు వినియోగిస్తున్నట్లు అంచనా. అందువల్ల అణువిద్యుచ్ఛక్తి కేంద్రాల స్థాపన ద్వారా తమ అవసరాలు నెరవేర్చుకుంటూ ఆయిలు ఎగుమతిద్వారా ఆదాయార్జన పెంచుకోవాలని యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ 2030 ప్రణాళిక. ఇరాన్ గనుక ఎప్పుడైనా అణ్వాయుధం నిర్మిస్తే సౌదీ అరేబియా దానితో పోటీపడుతుందని యువరాజు చాలాసార్లు చెప్పారు. జోయ్ బైడన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడే సౌదీతో పౌర అణు ఒప్పందం ప్రతిపాదన తెచ్చారు. సౌదీ–ఇజ్రాయెల్ మధ్య సంబంధాల స్థాపనకు ప్రలోభంగా వచ్చిన ఆ ప్రతిపాదన – గాజాపై ఇజ్రాయెల్ దురాక్రమణ యుద్ధంతో నిలిచిపోయింది. ఇప్పుడు ట్రంప్ ఒప్పందం, ఇజ్రాయెల్‌తో మైత్రి షరతు లేకుండానే సౌదీకి అణుశక్తి సమకూర్చుకునే అవకాశం కల్పించింది. ఇరాన్‌కు వ్యతిరేకంగా సౌదీని శక్తిమంతంగా నిలబెట్టటమే ట్రంప్ ఆలోచన అయి ఉండవచ్చు. ఇరాన్ యురేనియం ఇంధనాన్ని ఆయుధ గ్రేడ్‌కు శుద్ధి చేసిందనే ఆరోపణతో ట్రంప్, నెతన్యాహుతో కలిసి గత ఏడాది జూన్‌లో ఇరాన్ అణు వసతులపై 12రోజులు బాంబులు వేయించినా ఫలితం బహుపాక్షికమే. మళ్లీ ఈ సంవత్సరం జూన్‌లో ఏకంగా యుద్ధానికే దిగాడు. పరువుగా బయట పడేందుకు ట్రంప్ యుద్ధోన్మాదాన్ని ఆశ్రయించాడు. హార్ముజ్ జలసంధిలో స్వేచ్ఛా నౌకాయానం సాధించటంలో విఫలమైనాడు. ఇరాన్‌కు అణ్వాయుధం లేకుండా చేయటమే లక్ష్యమంటూ బాంబుదాడులు సమర్థించుకుంటున్నాడు.

సౌదీకి ఇచ్చే అణుశక్తి శాంతియుత ప్రయోజనాలకే కావచ్చు కాని అది దానికి ఇప్పటివరకు లేని సాంకేతిక పునాదిని ఏర్పరుస్తుంది. ఇరాన్ అణుశక్తి ధ్వంసం లక్ష్యంగా బాంబులువేస్తూ, సౌదీకి అదే టెక్నాలజీ అమెరికన్ నిపుణుల పర్యవేక్షణలో అయినప్పటికీ ఇవ్వటం ఇరాన్‌కు భవిష్యత్ చర్చల్లో బలమైన వాదనను అందిస్తుంది. సౌదీ అరేబియా అణ్వాయుధ శక్తిని సంతరించుకున్నాక యుఎఇ, టర్కీ, ఈజిప్టు సమాన ఏర్పాటు కోసం ఒత్తిడి చేస్తాయి. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకందారులైన దేశాలు అణుశక్తి కార్యక్రమం చేపట్టరాదని (కొద్ది మినహాయింపులతో) 1970 నుంచి అమెరికా అనుసరిస్తున్న విధానాన్ని ఇప్పుడు ట్రంప్ వెనక్కు మరలించాడు. సౌదీ అరేబియా గత సంవత్సరం పాకిస్థాన్‌తో పరస్పర సహకార రక్షణ ఒప్పందం కుదుర్చుకుంది. అవసరమొస్తే తమ అణుకార్యక్రమాన్ని రియాద్‌కు విస్తరిస్తామని అప్పుడు పాక్ రక్షణమంత్రి చెప్పారు.

ఇన్ని ప్రమాదాలతో కూడిన అమెరికా–సౌదీ అరేబియా అణు ఒప్పందం ఇప్పుడు కాంగ్రెస్ ఆమోదానికి వెళుతుంది. దాని సమీక్షకు 90రోజుల వ్యవధి ఉంది. కాంగ్రెస్ దాన్ని తిరస్కరించాలంటే ఉభయసభల్లో 2/3 మెజారిటీ లభించాలి. దుర్లభం.



## విద్యాశాఖ మంత్రిగా రేపిస్టుల రక్షకుడా?

నూతన విద్యాశాఖ మంత్రిగా ప్రధాని నియమించిన ప్రహ్లాద్‌జోషి 'రేపిస్టుల రక్షకుడు', ఒక 'నీచమైన వ్యక్తి'. అలాంటి వ్యక్తిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ భారతదేశ విద్యాశాఖ మంత్రిగా నియమిస్తారా? ప్రధానమంత్రి తన మంత్రివర్గంలో వేరొకరిని ఎంచుకుని ఉండవచ్చు కానీ అత్యాచారాలకు పాల్పడే వారిని రక్షించే వ్యక్తిని విద్యాశాఖ మంత్రిగా ఎంచుకోవడం వింతగా ఉంది.'విద్యా వ్యవస్థపై నిరసనలు వ్యక్తం చేస్తూ లాఠీలతో తీవ్రస్థాయిలో దెబ్బలుతిన్నటువంటి నవయువకులు, యువతులు పోరాటం చేసిన తర్వాత అత్యాచార నిందితుల రక్షకుడిని, ఒక నీచమైన వ్యక్తిని భారత విద్యా శాఖ మంత్రిగా బిజెపి ఒక వ్యక్తిని నియమించింది. అత్యాచారాలకు పాల్పడే వారికి రక్షణ అవసరమని చెప్పే అలాంటి నీచమైన మనిషి కంటే మరొకరు ఉండరు.

– కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ

## పిఎం, సిఎం తొలగింపు బిల్లు.. ప్రజాస్వామ్యానికి కొత్త ప్రమాణాలా?

30రోజుల నుంచి 50 రోజుల ప్రతిపాదన వరకు మారిన చర్చ.. జస్టిస్ బి.వి. నాగరత్న సూచనలతో ప్రత్యేక కోర్టులు, వేగవంతమైన విచారణపై దేశవ్యాప్తంగా చర్చ

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా మంత్రులు తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో నిర్దిష్టకాలం వరుసగా న్యాయ నిర్బంధంలో ఉంటే పదవి నుంచి తప్పుకోవాలనే ప్రతిపాదన దేశవ్యాప్తంగా రాజ్యాంగ, రాజకీయ, న్యాయ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. ప్రారంభంలో 30రోజుల న్యాయ నిర్బంధం తర్వాత పదవి కోల్పోవాలనే ప్రతిపాదన వినిపించగా, అనంతరం దానిని 50 రోజులకు పెంచాలనే సూచనలు కూడా వెలువడ్డాయి. అయితే ఇవి ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలు కావు; పరిశీలనలో ఉన్న ప్రతిపాదనలు మాత్రమే.

ఈ నేపథ్యంలో ప్రతిపాదిత రాజ్యాంగ (130వ సవరణ) బిల్లుపై జరుగుతున్న చర్చకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ప్రజా పదవుల గౌరవం, ప్రజల విశ్వాసం, రాజ్యాంగ నైతికతను బలోపేతం చేయడానికి స్పష్టమైన నిబంధనలు అవసరమా అనే ప్రశ్నకు సమాధానం వెతికే ప్రయత్నంగానే ఈ చర్చను పలువురు నిపుణులు విశ్లేషిస్తున్నారు. తుది నిర్ణయం మాత్రం పార్లమెంట్ చర్చలు, రాజ్యాంగ నిపుణుల సూచనలు, శాసన ప్రక్రియ పూర్తయిన తర్వాతే వెలువడుతుంది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న ప్రజాప్రతినిధులపై నమోదైన క్రిమినల్ కేసులు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉండటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొంటూ, దేశవ్యాప్తంగా ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి వేగవంతమైన విచారణ చేపట్టాలని సూచించారు. నిర్దోషులకు త్వరగా న్యాయం జరగడం, దోషులపై చట్టపరమైన తుది నిర్ణయం ఆలస్యం కాకపోవడం ప్రజాస్వామ్య బలోపేతానికి అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. భారత రాజకీయ చరిత్రలో జె. జయలలిత, లాలూ ప్రసాద్ యాదవ్, అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ వంటి నాయకులకు సంబంధించిన పరిణామాలు ప్రజా పదవులు, న్యాయ నిర్బంధం, రాజ్యాంగ నిబంధనలపై అనేక ప్రశ్నలు లేవనెత్తాయి. ఒకే తరహా పరిస్థితుల్లో వేర్వేరు రాజకీయ నిర్ణయాలు తీసుకోవడం వల్ల దేశవ్యాప్తంగా ఒకే రాజ్యాంగ ప్రమాణం అవసరమనే అభిప్రాయం బలపడింది. అందుకే ప్రజా పదవులకు సంబంధించి స్పష్టమైన చట్టపరమైన మార్గదర్శకాలు ఉండాలనే వాదనకు ఊతం లభిస్తోంది.

అయితే కేవలం ఆరోపణలు లేదా అరెస్టు ఆధారంగా ప్రజాప్రతినిధులను పదవి నుంచి తొలగించడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కోర్టు తుది తీర్పు వెలువడే వరకు ప్రతి వ్యక్తి నిర్దోషిగానే పరిగణించబడతాడనే మౌలిక సూత్రాన్ని కాపాడాల్సిందేనని వారు గుర్తుచేస్తున్నారు. అదే సమయంలో విచారణలు పదేళ్లు, పదిహేనేళ్లు కొనసాగితే ప్రజల్లో అనుమానాలు పెరిగి ప్రజాస్వామ్యంపై విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులపై నమోదయ్యే తీవ్రమైన కేసులకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడం, వీలైనంత వరకు రెండేళ్లలోపు విచారణ పూర్తయ్యే విధానాన్ని రూపొందించడం, ఎన్నికల పిటిషన్లను కాలపరిమితిలో పరిష్కరించడం, న్యాయస్థానాల మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, దర్యాప్తు సంస్థల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసే రక్షణ నిబంధనలు తీసుకురావడం వంటి సంస్కరణలను పార్లమెంట్ పరిశీలించాల్సిన అవసరం ఉందని రాజ్యాంగ నిపుణులు సూచిస్తున్నారు. ఈ రోజు అధికారంలో ఎవరున్నా, రేపు ఎవరొచ్చినా ఒకే రాజ్యాంగ ప్రమాణం అమలయ్యే వ్యవస్థను నిర్మించడమే దీని ప్రధాన ఉద్దేశం. వేగవంతమైన న్యాయం, సమాన చట్టాలు, ప్రజా విశ్వాసం, పారదర్శక పాలన అనే నాలుగు సూత్రాలపై భారత ప్రజాస్వామ్యం మరింత బలోపేతం కావాలంటే పార్లమెంట్, న్యాయవ్యవస్థ, రాజకీయ పార్టీలు, పౌర సమాజం సమతుల్య సంస్కరణల దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్య బలం ఎన్నికల్లో మాత్రమే కాదు... చట్టం ముందు అందరికీ సమానమైన ప్రమాణాలు అమలయ్యే వ్యవస్థలోనూ ఉంటుంది.

శ్రీశైలం దూడం, 9133947176

# సిజెపితో ఇండి కూటమి సమన్వయం అవసరం



నిత్యా చక్రవర్తి

మూడు నెలల కంటే తక్కువ వయసున్న బొద్దింక జనతా పార్టీ (సిజెపి) నేతృత్వంలోని యువ, విద్యార్థి నిరసనకారులు నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వంతో పోరాడి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, పరీక్షల సంస్కరణలకు సంబంధించిన ఇతర డిమాండ్ల విషయంలో విజయం సాధించారు. నిరసనకారుల డిమాండ్లలో చాలా వాటికి ప్రభుత్వం అంగీకరించడంతో సిజెపి శనివారం నాడు నిరసనలను నిలిపివేసి, కేంద్రం ఇచ్చిన హామీల అమలును ఒక నెల తర్వాత పరిశీలిస్తామని ప్రకటించింది. ప్రస్తుతానికి నిరసనకారులే విజేతలు, సర్వశక్తిమంతుడైన ప్రధాని తలవంచారు.

సిజెపి విజయాన్ని ప్రజాస్వామ్యానికి, విద్యార్థి నిరసనకారులకు దక్కిన విజయంగా ప్రతిపక్ష పార్టీలు సరిగ్గానే అభివర్ణించాయి. ఉద్యమం తొలినాళ్లలో కాంగ్రెస్ పార్టీ జంతర్ మంతర్ నిరసనలకు దూరంగా ఉన్నప్పటికీ, రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండి కూటమి బ్లాక్ జంతర్ మంతర్ వద్ద నిరసనకారులకు పూర్తి మద్దతునిస్తూ ఏకమైంది. కానీ, చివరి దశలో ఆ కూటమి నిరసనకారులతో పూర్తిగా కలిసిపోవడంతో, ఈ విజయంలో ప్రతిపక్షం కూడా ఒక చిన్న వాటాను పంచుకోగలిగిం ది. కానీ, ప్రధానంగా బిజెపి, ప్రధాని నరేంద్ర మోదీ ఆధిపత్యం చెలాయిస్తున్న దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో ప్రతిపక్షానికి తదుపరి కర్తవ్యం ఏమిటి?

గతవారం ప్రారంభంలో ప్రధాని, ఆయన సలహాదారులు కొన్ని కుటిలమైన మార్గాల ద్వారా నిరసనల తీవ్రతను తగ్గించాలనే ఆలోచనతో ఆడుకున్నారని స్పష్టమవుతోంది. శుక్రవారం రాత్రి కూడా తన యువ మిత్రులను ఉద్దేశించి చేసిన ఇన్‌స్టాగ్రామ్ ప్రసంగం లో ప్రధాని ఆత్మవిశ్వాసంతో కనిపించారు. ప్రధాని చేసిన ఈ సయోధ్య ప్రసంగం, ప్రశ్నపత్రాల లీకేజీ దోషులను శిక్షించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామన్న ప్రకటన నిరసనకారుల మనోభావాలను శాంతింపజేస్తుందని పిఎంఒ భావించింది. అయితే, దీంతోపాటుగా, విద్యార్థులు, యువత చేస్తు న్న ఆన్‌లైన్ నిరసనలపై బిజెపి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత చర్యలకు దిగాయి. ఆన్‌లైన్ మీమ్స్ చాలా వరకు ప్రధానిని లక్ష్యంగా చేసుకున్నవే.

ప్రధాని ప్రసంగం శాంతపరిచే ప్రభావాన్ని చూపడానికి బదులుగా, యువతలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఫలితంగా, శనివారం ఉదయం యువతతో పాటు వేలాదిమంది జంతర్ మంతర్ వైపు దూసుకెళ్లారు. చాలామంది అనుభవజ్ఞులైన అధికారులు సంయమనం పాటించాలని, అవసరమైతే ప్రస్తుతానికి ఒక అడుగు వెనక్కి వేయాలని సలహా ఇచ్చారు. మెట్రోలను మూసివేశారు, సరిహద్దుల్లో రాష్ట్ర పోలీసులు తనిఖీలను ముమ్మరం చేసినప్పటికీ, శనివారం ఉదయం ప్రజల ప్రవాహం ఆగకుండా కొనసాగింది.

మరోవైపు, చర్చల కోసం ప్రధాని నియమించిన ఇద్దరు మంత్రులకు సిజెపి యువ బృందం చాలా కఠినంగా అనిపించింది. వారు తమ డిమాండ్ లన్నింటినీ, ముఖ్యంగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను పట్టుబట్టారు. మోదీ ప్రభుత్వానికి మరోమార్గం లేకుండా పోయింది. అదే విధంగా, నిరసనకారులపై చర్యలు తీసుకున్నందుకు, హోం మంత్రి అమిత్ షా ప్రత్యక్ష నియంత్రణలో ఉన్న ఢిల్లీ పోలీసులపై కూడా శుక్ర, గురువారాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. 2024 జులై/ఆగస్టు నాటి ఢాకా మాదిరిగానే ఢిల్లీ కూడా పయనిస్తోందని, ఎంత మూల్యం చెల్లించాల్సి వచ్చినా నిరసనలను ముగించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందేనని ప్రభుత్వ శ్రేయోభిలాషులు కొందరు హెచ్చరించారు. అప్పుడే, చర్చలు ప్రారంభించి వారి డిమాండ్లకు అంగీకరించమని ప్రధాని నరేంద్ర మోదీ తన మంత్రుల బృందానికి పచ్చజెండా ఊపారు. నరేంద్ర మోదీ గత పన్నెండేళ్ల పాలనలో, ఈ శనివా రం నాటి నిర్ణయం ప్రస్తుత నిరంకుశ ప్రభుత్వం తీసుకున్న ఒక నిజమైన వెనుకంజ.

> *జంతర్ మంతర్ నిరసనల సమయంలో, మూడు వామపక్ష పార్టీలైన సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్)- లిబరేషన్ తమ విద్యార్థి సంఘాల శిబిరాలను ఏర్పాటు చేసి అవిశ్రాంతంగా పనిచేశాయి. వామపక్ష కార్యకర్తలు నిరసనకారులతో మమేకమై వారితో అభిప్రాయాలను పంచుకున్నారు. నిరసనకారులు కూడా ప్రస్తావిస్తున్న ప్రధాన సమస్యల ఆధారంగా, వారు విస్తృత బిజెపి వ్యతిరేక ఉద్యమంలో భాగం కావచ్చు. వామపక్ష పార్టీలు, జెన్ జీ మధ్య ఈ సహకారాన్ని విస్తరించేందుకు మంచి అవకాశం ఉంది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి యువ నాయకుడిగా ఆకర్షణ ఉంది. ఈ బృందంతో దీర్ఘకాలిక సహకారాన్ని నిర్మించుకోవడానికి ఆయన దానిని సద్వినియోగం చేసుకోవచ్చు. దీనికి సహనం, పట్టువిడవని శ్రమ అవసరం.*

జంతర్ మంతర్ నిరసనల నుండి మనం నేర్చుకోవాల్సిన పాఠాలు ఏమిటి? మొదటిగా, ఈ నిరసనలు కేవలం నీట్ పరీక్షా పత్రాల లీకేజీపై ఆగ్రహం మాత్రమే కాదు, ప్రజల ఈ ఆవేశం మొత్తం దేశ రాజకీయ వాతావరణానికి సంబంధించినది. విద్యావంతులకు ఉద్యోగ అవకాశాలు తక్కువగా ఉండటం, మైనారిటీలను ద్వితీయ శ్రేణి పౌరులు గా చూడటం, ఎన్నికల్లో గెలవడానికి అధికార పార్టీ అన్ని వ్యవస్థలను వినియోగించుకోవడం వంటివి దీనికి కారణాలు. రాజకీయ అవినీతి ఏ స్థాయికి చేరిందంటే, ప్రతిపక్ష పార్టీలు చీల్చబడుతున్నాయి, ఫిరాయింపుదారులు బహిరంగంగానే ఆర్థిక లావాదేవీల గురించి మాట్లాడుతున్నారు. ఇది 'ఎలక్టోరల్ ఆటోక్రసీ' (ఎన్నికల ద్వారా నడిచే నిరంకుశ పాలన) తప్ప మరొకటి కాదు.

అయినప్పటికీ, ప్రధానమంత్రి నియంత్రణ కోల్పోయారని దీని అర్థం కాదు. ఆయన పూర్తి నియంత్రణ కలిగి ఉన్నారు. గత సంఘటనలు నిరూపించినట్లుగా, సరిదిద్దే చర్యలు తీసుకుని మరింత బలంగా నిలబడే అసాధారణ సామర్థ్యం ప్రధాని నరేంద్ర మోదీకి ఉంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఎదుర్కొన్న ఘోర పరాజయం తర్వాత ఆయన ఇదే చేసి చూపించారు. బిజెపి మరింత పతనం అవుతుందని అందరూ భావిస్తున్న తరుణంలో, ప్రధాని, ఆయన బృందం ఆర్‌ఎస్ఎస్ నాయకత్వ సహకారంతో ఆ తర్వాత జరిగిన అన్ని రాష్ట్ర శాసనసభల ఎన్నికల్లోనూ విజయం సాధించారు. ముఖ్యంగా బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మమతా బెనర్జీని ఓడించి 207 సీట్లు గెలుచుకోవడం ద్వారా చరిత్ర సృష్టించారు. నిజమే, అనేక ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి. కానీ ఆ సీట్లను పక్కన పెట్టినప్పటికీ బిజెపి గెలిచే అవకాశం ఉంది. బెంగాల్‌లో స్థానిక స్థాయిలో బిజెపి బృందం, ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలు చేసిన నిరంతర కృషి ఫలితమే ఆ విజయ ం.

పరీక్షా విధానంలో సంస్కరణ ల కోసం నందన్ నీలేకని నేతృత్వం లో ఒక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం ద్వారా ప్రధాని ఇప్పటికే సరిదిద్దే చర్యలు చేపట్టారు. కేంద్రం అంగీకరించిన డిమాండ్ల అమలు తీరును తెలియజేయడానికి సిజెపి బృందంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని పిఎంఒ నిర్ణయించింది. పరిస్థితిని సమీక్షించడానికి ఇరు పక్షాలు నెల తర్వాత సమావేశం కానున్నాయి. ప్రధాని పర్యవేక్షణలో పిఎంఒ ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తోంది. విద్యార్థులు, యువతలో ఉన్న అసంతృప్తిని తొలగించడానికి మోదీ ప్రభుత్వం ఇప్పుడు అన్ని చర్యలు తీసుకుంటోంది. రాబోయే నెల రోజుల్లో సిజెపి కొత్తగా ఎలాంటి నిరసనలు చేపట్టకపోవచ్చు.

ఇక ప్రతిపక్షాల విషయానికొస్తే, రాబోయే రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో, చివరిగా 2029 లోక్‌సభ ఎన్నిక ల్లో బిజెపిని ఎదుర్కోవడానికి జంతర్ మంతర్ ఉద్యమం నుండి అవి ఏ విధంగా రాజకీయ ప్రయోజనాన్ని పొందగలవు? నిరసనలో పాల్గొన్న యువత ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తే బాగుంటుందని సిజెపి ప్రధాన నాయకుడు సౌరవ్ దాస్ శనివారం లండన్‌కు చెందిన 'ది గార్డియన్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 'ప్రస్తుతం రాజకీయాలు మా తరాన్ని అర్థం చేసుకోని అంకుల్‌లు, ఆంటీల ఆధిపత్యంలో ఉన్నాయి. కాబట్టి, మరింతమంది యువత రాజకీయాల్లోకి రావాలని మేము కోరుకుంటున్నాము' అని ఆయన అన్నారు. దీనికి సమాధానం రాజకీయంగానే ఉండాలని ఆయన అంగీకరించారు.





అదే ప్రధాన సమస్య. సిజెపి సభ్యులు, నిరసనకారులకు, ఇండి కూటమి భాగస్వామ్య పార్టీలకు మధ్య సంపూర్ణ సమన్వయం ఉండేలా ఆ బ్లాక్ చూడాలి. వారిలో చాలామంది బిజెపి వ్యతిరేక ఉద్యమం నుంచి వచ్చినవారే. జంతర్ మంతర్ నిరసనల సమయంలో, మూడు వామపక్ష పార్టీలైన సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ తమ విద్యార్థి సంఘాల శిబిరాలను ఏర్పాటు చేసి అవిశ్రాంతంగా పనిచేశాయి. వామపక్ష కార్యకర్తలు నిరసనకారులతో మమేకమై వారితో అభిప్రాయాలను పంచుకున్నారు. నిరసనకారులు కూడా ప్రస్తావిస్తున్న ప్రధాన సమస్యల ఆధారంగా, వారు విస్తృత బిజెపి వ్యతిరేక ఉద్యమంలో భాగం కావచ్చు. వామపక్ష పార్టీలు, జెన్ జీ మధ్య ఈ సహకారాన్ని విస్తరించేందుకు మంచి అవకాశం ఉంది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి యువ నాయకుడిగా ఆకర్షణ ఉంది. ఈ బృందంతో దీర్ఘకాలిక సహకారాన్ని నిర్మించుకోవడానికి ఆయన దానిని సద్వినియోగం చేసుకోవచ్చు. దీనికి సహనం, పట్టువిడవని శ్రమ అవసరం.

భాగస్వామ్య పార్టీలలో చీలికలతో దెబ్బతిన్న ఇండియా బ్లాక్, జెన్ జీ, పౌర సమాజాలలో కొత్త మిత్రుల కోసం వెతకాలి. వారు దాని కోసం దీర్ఘకాలిక ప్రాతిపదికన కృషి చేయాలి. అప్పుడే, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రస్తుతం అప్రతిహతశక్తిగా ఉన్న బిజెపిని ఎదుర్కోవడం సాధ్యమవుతుంది.

# నిర్విరామ పోరాటాలకు నాంది ఈ విజయం

ప్రజాస్వామ్య భారతదేశంలో గడిచిన కొన్నేళ్లుగా ఒక ప్రత్యేక పరిస్థితి నెలకొన్నది. ప్రజాస్వామ్య వ్యవస్థ గాడి తప్పిన, ప్రజల హక్కులు హరించబడిన, హింసాత్మక ఘటనలు చెలరేగిన, ప్రశ్నించడం నేరంగా పరిగణించబడుతుంది. అంతేకాదు ప్రశ్నించిన వారిని దేశ ద్రోహులుఅనో, పాకిస్థానీ అనుకూలురనో, సంఘవ్యతిరేక శక్తులనో చిత్రీకరించి ఈ సమాజం ముందు దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో కొంతమేర సఫలీకృతులయ్యారు. దేశంలో తమకు ఎదురెలేదన్న భావన పాలకుల్లో పెరిగిపోయింది. ఈ నేపథ్యంలోనే నీట్ పేపర్ లీక్ కావడం, భారత అత్యున్నత న్యాయస్థానానికి చెందిన ప్రధాన న్యాయమూర్తి 'కాక్రోచ్' వ్యాఖ్యలు ఒక కొత్త శకానికి తెరతీశాయి. న్యాయమూర్తి మాటల నేపథ్యంలో దేశంలో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) పురుడుపోసుకుంది. యువత ఉద్యమాలు వరి గడ్డి మంట లాంటివని అవి ఎంతోకాలం నిలబడవని ఓ ప్రచారం వాడుకలో ఉండేది. కానీ జంతర్ మంతర్ వద్ద జూన్ 20న మొదలైన ఉద్యమం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇది రెండు రకాలుగా ఈ దేశ ప్రజలను ఆలోచింపజేస్తున్నది. ఒకటి 12 ఏళ్లుగా ఈ దేశాన్ని పాలిస్తున్న మోడీ సానుకూల పరిణామాల నేపథ్యంలో ప్రశ్నించే వారిని అణిచివేయడం, తాను అనుకున్నది అనుకున్నట్లుగా జరిపించడానికి అలవాటుపడిపోయారు. అవి వామపక్ష తీవ్రవాదమైనా, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు పరం చేయడమైనా, చట్టాలను మార్చడమైనా అనుకున్నది అనుకున్నట్లుగానే జరిపించారు. ఈ క్రమంలోనే ఇప్పుడు జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే చారిత్రికం పేరుతో కొన్ని బిల్లులను ప్రవేశపెట్టి తమ అధికారాన్ని అప్రతిహతం చేయాలనుకున్నారు. కానీ యువత ఒక్కసారిగా జూలు విదిలించింది. దానికి బలమైన ప్రధానిగా 12 ఏళ్లలో పక్కకు జరగాల్సిన పని లేకుం డా పనిచేసిన మోడీ కూడా తలవంచక తప్పని స్థితి ఏర్పడింది. ఇటీవల కాలంలో మనం చాలా ఆందోళనలు చూసి ఉంటాం. పోలీసులు లాఠీలు ఎత్తగానే పరుగులు పెట్టడం అందరికీ తెలిసిన విషయమే. కానీ పోలీసులు కొడుతుంటే ఇంకా కొట్టండి ఇంకా కొట్టండి అంటూ ఎదురు నిలిచి భవిష్యత్తు పోరాటాలకు సమర నినాదాన్ని ఇచ్చారు విద్యార్థులు. జంతర్ మంతర్ ఆందోళన, పోలీసుల హింసా చర్యల తీరును పరిశీలిస్తే పలు విషయాలు అవగతమవుతున్నాయి. మొదటిది యువత నిర్భయంగా తాము అనుకున్న లక్ష్యం వైపు పయనించడం, రెండు లక్ష్యాన్ని సాధించేంత వరకు విశ్రమించకపోవడం. ఈ రెండు రేపటి పోరాటాలకు నాంది కానున్నాయి.



12 ఏళ్ల మోడీ పాలనలో ఈ దేశ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాలనకు సంబంధించి ప్రజల దృష్టితో కాకుండా కార్పొరేట్ దృష్టితో చూసి అనేక చట్టాలను తీసుకువచ్చారు. అనేక చట్టాలను మార్చారు. మోడీ, షాల బృందం మనం ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందనుకున్న తరుణంలో జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళన ఒక షాక్ ఇచ్చింది. కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అసలు రాజీనామా చేయాల్సిన పని లేదన్నారు. సిజెపి వెనక పర దేశాలకు చెందిన ఉగ్రవాద సంస్థలు ఉన్నాయని అవే ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాయని ప్రచారం చేశారు. ఈ దేశ యువతకు న్యాయం చేయండి, 21 మంది మరణానికి కారణమైన వారిని శిక్షించి న్యాయం చేయండి అని నినదించిన లక్షలాదిమంది దేశ యువతను దేశ ద్రోహులుగా చూపే దుర్మార్గపు ప్రయత్నం చేశా రు. అంతటితో ఆగలేదు. సోషల్ మీడియా ద్వారా భారతదేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు సాగుతున్న కుట్రగా ప్రచారం చేశారు. చినుకు చినుకు ధారగా మారి కొన్ని ధారలు ప్రవాహాలై చివరకు మహా ప్రవాహం రూపుదిద్దుకున్నట్లుగా ఒక్కొక్కరిగా మొదలై పదులుగా, వందలుగా, వేలుగా, లక్షలుగా ఆందోళనకారులు దేశ వ్యాప్తంగా నిరసనలను వ్యక్తం చేస్తుంటే ద గ్రేట్ మోడీ తప్పని పరిస్థితిలో అయిష్టంగానే తన సహచర మంత్రి చేత రాజీనామా చేయించక తప్పలేదు. పోరాటం న్యాయబద్ధమైనప్పుడు చిత్తశుద్ధితో పోరాటాన్ని కొనసాగిస్తున్నప్పుడు విజయం లభిస్తుందనడానికి ఈ కాక్రోచ్ ఉద్యమం ఒక ఉదాహరణ. లాఠీలతోనో, తూటాలతోనో ప్రజా వ్యతిరేకతను అణిచివేయలేమన్న వాస్తవాన్ని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం గ్రహించాల్సి ఉంది. ఒక ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఈ ఆందోళనలు ఆగకపోవచ్చు. ఓ పోరాటం విజయం సాధించినప్పుడు అనేక పోరాటాలు పుట్టుకొస్తాయి. ఇది చారిత్రిక సత్యం. ఈ దేశంలో నాలుగేళ్ల క్రితం రైతాంగ పోరాటం నడిచింది. కానీ అనేక హామీలతో ఆ పోరాటాన్ని విరమింపజేసిన ప్రధాని ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి కూరుకుపోతున్నది. వాణిజ్య ఒప్పందాలు మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా వ్యవసాయ రంగాన్ని మరింత కుదేలు చేయనున్నాయి. పెరుగుతున్న నిరుద్యోగం, వట్టిపోతున్న ఉపాధి రంగాలు, కనుమరుగవుతున్న దేశీయ వ్యాపారాలు, పెరుగుతున్న కార్పొరేటీకరణ, హరించబడుతున్న హక్కుల నేపథ్యంలో ఈ దేశ ప్రజలు జంతర్ మంతర్ పోరాట విజయం తర్వాత మరిన్ని పోరాటాల వైపు మరలే అవకాశం ఉంది. అగ్గి పుట్టించిన చెరబండరాజు 'యువతరమా నవతరమా ఇదే అదును కదలిరమ్మ ఈ దేశానికి కళ్లు నీవే కాళ్లు నీవే' అని చెప్పినట్లుగా ఈ దేశ యువతరం ప్రజా పోరాటాలకు కొత్తబాట చూపింది.

ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం

# రైతు చెంతకు నూతన సాంకేతికత

## శాస్త్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే 'రైతు నేస్తం' ప్రధాన లక్ష్యం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతు చెంతకు నూతన సాంకేతికతను చేరవేసి శాస్త్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే 'రైతు నేస్తం' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన 'రైతునేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి జూపల్లి కృష్ణారావు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ బి. గోపి, హార్టికల్చర్ ఎండి యాస్మిన్ బాషా, సహకార శాఖ కమిషనర్ రాహుల్ రాజ్, వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు జానయ్య, రాజిరెడ్డి, వివిధ జిల్లాల ఆదర్శ రైతులు, అధికారులు సచివాలయం నుంచి పాల్గొనగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1600 రైతువేదికల ద్వారా లక్షలాది మంది రైతులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 2024 మార్చి 6న ప్రారంభమైన రైతునేస్తం కార్యక్రమం నేటితో 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకోవడం రైతుల విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటివరకు 24.85 లక్షల మంది రైతులు ప్రత్యక్షంగా పాల్గొనగా, వారిలో 5.26 లక్షల మంది మహిళా రైతులు ఉన్నారని తెలిపారు. రెండేళ్లలో 2.43 లక్షల మంది అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా, మొత్తం 27.30 లక్షలకు పైగా రైతులు ప్రయోజనం పొందినట్లు వెల్లడించారు.ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులకు అవసరమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంలో రైతునేస్తం కీలక పాత్ర పోషిస్తోందని తుమ్మల పేర్కొన్నారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రైతు, శాస్త్రవేత్త, అధికారుల మధ్య ప్రత్యక్ష అనుసంధానం కల్పించే దేశంలోనే తొలి డిజిటల్ వేదికగా రైతునేస్తం నిలిచిందని ప్రశంసించారు.

**సీడ్ రైతుల బకాయిలు చెల్లింపుకు తక్షణమే చర్యలు తీసుకోవాలి : మంత్రి తుమ్మల**

సీడ్ రైతులకు, ఆర్గనైజర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీడ్ కంపెనీలను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సీడ్ కంపెనీల ప్రతినిధులు, సీడ్ కంపెనీ అసోసియేషన్ సభ్యులు, పత్తి విత్తనోత్పత్తి ఆర్గనైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీడ్ రైతులకు ఆర్గనైజర్ల ద్వారా జరగాల్సిన చెల్లింపులు, అలాగే ఆర్గనైజర్లకు సీడ్ కంపెనీలు చెల్లించాల్సిన బకాయిల అంశంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీడ్ కంపెనీలు లేదా ఆర్గనైజర్ల నిర్లక్ష్యం వల్ల రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు పడకూడదన్నారు. పెండింగ్ బకాయిల చెల్లింపులను వెంటనే ప్రారంభించి రైతులకు సకాలంలో అందేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే సంబంధిత కంపెనీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోదని స్పష్టం చేశారు. సీడ్ కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ గత ఏడాదికి సంబంధించిన బకాయిలన్నింటినీ ఈ ఏడాది ఆగస్టు నెలలోగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది విత్తన నిల్వలు అధికంగా ఉండటంతో ఆర్థిక ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ, అవసరమైతే బ్యాంకుల నుంచి మార్ట్‌గేజ్ రుణాలు తీసుకొని అయినా రైతులు, ఆర్గనైజర్లకు చెల్లింపులు చేస్తామని తెలిపారు. ఈ సీజన్‌కు సంబంధించిన బకాయిల చెల్లింపులను ఆగస్టు నుంచి ప్రారంభించి డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేస్తామని వెల్లడించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సీడ్ కంపెనీలు లాభాలకే పరిమితం కాకుండా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్గనైజర్ల ద్వారా రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ బి.గోపి, సీడ్ కంపెనీ అసోసియేషన్ ప్రతినిధులు, పత్తి విత్తనోత్పత్తి కంపెనీల ప్రతినిధులు, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుంటే

# సిఎం ఇంటిని ముట్టడిస్తాం

### తెలంగాణ రాష్ట్ర ఆటో, మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) హెచ్చరిక




ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆటో డ్రైవర్ల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తామని తెలంగాణ రాష్ట్ర ఆటో, మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. వెంకటేశం హెచ్చరించారు. జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసం పరిసర ప్రధాన రహదారులను వేలాది ఆటోలతో దిగ్బంధిస్తామని ప్రకటించారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కమిషనర్ కార్యాలయం ముందు తెలంగాణ రాష్ట్ర ఆటో, మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వందలాది మంది ఆటో డ్రైవర్లు భారీ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బి. వెంకటేశం మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పూర్తిగా విస్మరించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం, పెరిగిన ఇంధన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీల సవరణ, రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆటో యాప్ ప్రారంభం, జిఒ నెం.263 ప్రకారం పెండింగ్ ఆటో పర్మిట్ల జారీ, ఓలా, ఉబెర్, రాపిడో సేవల నిషేధం వంటి డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు.ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలపై వెంటనే స్పందించకుంటే సిఎం ఇంటి ముట్టడితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ ధర్నాలో యూనియన్ నాయకులు ఎండి ఒమర్ ఖాన్, ఎ. బిక్షపతి యాదవ్, బైరగోని రాజుగౌడ్, కె. చందు యాదవ్, కొంరెల్లి బాబు, మున్నూరు కృష్ణ, ఎస్.కె. అతీఫ్, ఎం.డి.జాకిర్, ఎం. శ్రీనివాస్, పి. రాములు, మురళి, ఎం. నరసింహ, జి. మల్లేష్ పాల్గొన్నారు.

## రాష్ట్రంలో వారం రోజులు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా రాబోయే వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. మంగళ, బుధవారం ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30–40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందన్నారు. బుధ, గురువారాల్లో ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గురువారం నుంచి మంగళవారం వరకు ఐదు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని, మొదటి మూడు రోజులు అన్ని జిల్లాల్లో బలమైన ఉపరితల గాలులు (30–40 కి.మీ. వేగం) వీయవచ్చని, ఆగస్టు 2 నుంచి 4వ తేదీ వరకు ఎలాంటి ప్రత్యేక హెచ్చరికలు లేవన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తం

### అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలి : సిఎస్



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో రాబోయే రెండు, మూడు రోజుల్లో విస్తారంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరించిన నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగమంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి మంగళవారం జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్‌పిలతో సిఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ ప్రత్యామ్నాయ ప్రణాళిక, వనమహోత్సవం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు, ఆరు జిల్లాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైందని, మిగిలిన 26 జిల్లాల్లో లోటు వర్షపాతం నెలకొందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రత్యామ్నాయ ప్రణాళికలో భాగంగా జిల్లాల్లో విత్తన మేళాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రానున్న రెండు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో వర్షాలు కురుస్తాయన్న ఐఎండి తాజా సూచనల నేపథ్యంలో అన్ని జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సిఎస్ కలెక్టర్‌లను ఆదేశించారు. వివిధ శాఖలతో సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. భద్రాచలం, ములుగు, నిర్మల్ జిల్లాల్లో ఇప్పటికే ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, కార్యదర్శులు దాసరి హరిచందన, సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## తాడిచర్ల, ఆర్‌కెపి బొగ్గు గనులకు పర్యావరణ అనుమతులు వేగవంతం

### కేంద్ర మంత్రిని కోరిన మంత్రి వివేక్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి కీలకంగా భావిస్తున్న తాడిచర్ల బ్లాక్2 బొగ్గు గని, ఆర్కేపీ మైన్స్ ప్రాజెక్టులకు సంబంధించిన పర్యావరణ అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని రాష్ట్ర శక్తి (కార్మిక, శిక్షణ, ఉపాధి, ఫ్యాక్టరీలు) గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కోరారు. ఈ రెండు ప్రాజెక్టులకు అనుమతులు లభిస్తే తెలంగాణ పారిశ్రామిక రంగానికి మరింత ఊతం  భించడంతో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని ఆయన వివరించారు. న్యూఢిల్లీలో పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ, జహీరాబాద్ ఎంపి సురేష్ శెట్కార్‌తో కలిసి కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి వివేక్ వెంకటస్వామి, రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్యమైన గనుల ప్రాజెక్టులపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తాడిచర్ల బ్లాక్2 బొగ్గు గనికి పర్యావరణ అనుమతులు మంజూరైతే వెయ్యికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడటంతో పాటు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి గణనీయమైన ఊతం లభిస్తుందని కేంద్ర మంత్రికి వివరించారు. అదేవిధంగా రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్యమైన ఆర్కేపీ మైన్స్ ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతులను కూడా త్వరితగతిన మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రం ఐటి, రైల్వే ప్రాజెక్టుల అంశాలను

# కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లాం

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని ఐటీ రంగంతో పాటు రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. కాజీపేట రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే పునర్విభజన నేపథ్యంలో కాజీపేట కేంద్రంగా ఒక కొత్త రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్టు వివరించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం2014 ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో లోక్‌సభ స్థానాలు పెంచాలని ఆ చట్టంలో ఉన్నప్పటికీ, 12 ఏళ్లుగా అమలుకు నోచుకోలేదని, పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్నే అమలు చేయని కేంద్ర ప్రభుత్వం, కొత్తగా ఇచ్చే ప్రస్తుత హామీలను ప్రజలు ఎలా నమ్ముతారని కెటిఆర్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలోని రైల్వే పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను న్యూఢిల్లీలో కెటిఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ బృందం మంగళవారం కలిసింది. అనంతరం కెటిఆర్ ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడారు. తాము ప్రతిపాదిస్తున్న రైల్వే డివిజన్‌లో కాజీపేట–బల్లార్షా, పెద్దపల్లి –నిజామాబాద్, కాజీపేట–ఎర్రుపాలెం, డోర్నకల్ –మణుగూరు, మోతమర్రి–విష్ణుపురం, కాజీపేట–వంగపల్లి సెక్షన్లు ఉండాలని సూచించామని, ఈ ప్రతిపాదిత కాజీపేట రైల్వే డివిజన్‌కు సుమారు 2వేల ట్రాక్ కిలోమీటర్ల పరిధి ఉండే అవకాశం ఉందని వివరించారు. కొత్తగూడెం రైల్వే డివిజన్ ఏర్పాటును కూడా పరిశీలించాలని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ చొరవ వల్లనే మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు సుమారు 76 కిలోమీటర్ల రైల్వే లైన్ పూర్తయిందని, అక్టోబర్ 3, 2023న ఆ రైల్వే లైన్ కార్యకలాపాలు కూడా ప్రారంభమయ్యాయని, మిగిలిన సిద్దిపేట నుంచి సిరిసిల్ల, వేములవాడ, కొత్తపల్లి వరకు 75 కిలోమీటర్ల మేర నిర్మాణ పనులు పూర్తిగా మందగించాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.511 కోట్ల నిధులను విడుదల చేయకపోవడంతోనే పనులు ఆగినట్టు కేంద్ర మంత్రి తమతో చెప్పారన్నారు. ధవళేశ్వరం మాదిరిగా మిడ్ మానేరు రిజర్వాయర్ పైన 'రైల్వే కమ్ రోడ్ బ్రిడ్జ్' నిర్మాణానికి ఆమోదించాలని కోరారు. దక్షిణ మధ్య రైల్వేతో పాటు తెలంగాణ ప్రభుత్వంతో ఒక ప్రత్యేక హైలెవెల్ బృందాన్ని ఏర్పాటు చేసి నిరంతరం పనులను సమీక్షించాని కోరారు. తెలంగాణలోని 'టయర్ 2' ఐటి రంగాన్ని పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం, మెయిట్ వై సహకారాన్ని కోరామని, వరంగల్‌లో ఒక ఇండియా ఎఐ సెంటర్ / డేటా ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కేంద్ర మంత్రిని కోరారు.

**ఎన్‌డిఎ హయాంలో ఐదు సార్లు పేపర్ లీక్**

ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో ఐదుసార్లు పేపర్ లీక్‌లు జరిగితే, ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో మూడుసార్లు జరిగాయని కెటిఆర్ ఆరోపించారు. మంచి ఉద్దేశంతో పరీక్షల సంస్కరణల బిల్లును ప్రవేశపెడితే బిఆర్ఎస్ స్వాగతిస్తుందని, మద్దతునిస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పటికే పార్లమెంట్ ఆమోదించిందని, దీనిని డీలిమిటేషన్‌తో ముడిపెట్టి రాజకీయ గందరగోళం సృష్టించారని ఆరోపించారు. డీలిమిటేషన్‌పైన ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టలేదన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి, ఎంపి వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు.

# జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

### 'స్ఫూర్తి స్థల్' వద్ద పలువురు ప్రముఖుల ఘన నివాళి





ప్రజాపక్షం/హైదరాబాద్ : మాజీ కేంద్ర మంత్రి ఎస్. జైపాల్ రెడ్డి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని స్పీకర్ గడ్డం ప్రసాద్, కుమార్, పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు , ప్రముఖులు, రాజకీయ నాయకులు కొనియాడారు.జైపాల్ రెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా మంగళవారం నెక్లెస్ రోడ్‌లోని స్ఫూర్తి స్థల్‌లోని ఆయన ఘాట్ వద్ద స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు కోమిటి రెడ్డి వెంకట్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు, సుదర్శన్ రెడ్డి, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, నారాయణరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, మాజీ స్పీకర్ సురేష్ రెడ్డి, మాజీ శాసనమండలి చైర్మన్ నేతి విద్యాసాగర్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కరరావు, జూలకంటి రంగారావు, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, ప్రముఖులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పుష్పగుచ్చాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ సాధనలో విశిష్టమైన పాత్ర పోషించిన గొప్ప దార్శనికుడు జైపాల్ రెడ్డి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో జైపాల్ రెడ్డి చేసిన కృషి ఎనలేనిదని, రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ఆయన విశేష సేవలందించారని కొనియాడారు. మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ జైపాల్ రెడ్డి అజాతశత్రువని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధిలో ఆయన పాత్ర చిరస్మరణీయమని అన్నారు. దక్షిణ భారతదేశం నుంచి ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు అందుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జైపాల్ రెడ్డి ప్రజాసేవకు నిలువెత్తు నిదర్శనమని, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర కీలకమని అన్నారు. విద్యార్థి నాయకుడిగా, పార్లమెంటేరియన్‌గా, కేంద్ర మంత్రిగా దేశానికి, తెలంగాణకు విశేష సేవలందించారని కొనియాడారు. విలువలకు కట్టుబడి రాజకీయాలు చేసిన నాయకుడిగా ఆయన అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు.

**రాజకీయ నైతికతకు ప్రతీక జైపాల్ రెడ్డి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

రాజకీయాల్లో నైతికతకు ప్రతీక కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డి అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కొనియాడారు. కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డి వర్ధంతిని పురస్కరించేకుని ఢిల్లీలోని సిఎం అధికార నివాసంలో సిఎం రేవంత్ రెడ్డి జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థి నాయకునిగా ప్రస్థానం ప్రారంభించిన జైపాల్ రెడ్డి తన తుది శ్వాస వరకు విలువలు, సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారని సిఎం పేర్కొన్నారు. తన విషయ పరిజ్ఞానం, వాగ్ధాటితో అటు ప్రజలు, ఇటు పార్లమెంట్‌లో తనదైన ముద్ర వేసిన ఘనత జైపాల్ రెడ్డిదని సిఎం కొనియాడారు. జైపాల్ రెడ్డి ఆశయాలను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తుందని సిఎం తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర నేతలు రోహిణ్ రెడ్డి, తుమ్మల యుగంధర్ పాల్గొన్నారు.



## పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ మాజీ చైర్మన్ పెద్ది సుదర్శన్ రెడ్డి సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని మంత్రి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం చికిత్స అందిస్తున్న వైద్యులతో మాట్లాడి, ఆయనకు జరుగుతున్న చికిత్స వివరాలు, ఆరోగ్య పురోగతిపై సమగ్ర సమాచారం తీసుకున్నారు. అనంతరం మంత్రి పొంగులేటి, పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. ఆసుపత్రిలో ఆయనకు అత్యుత్తమ వైద్య సేవలు అందుతున్నాయని, ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ఏ సమయంలోనైనా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.

## హైడ్రా కమిషనర్‌ను ఆడిస్తుందే సిఎం

### ఎమ్మెల్సీ దాసోజుశ్రవణ్



ప్రజాపక్షం/హైదరాబాద్: హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఒక తోలుబొమ్మ అని, ఆయనను ఆడిస్తున్నదే సిఎం రేవంత్ రెడ్డి అని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. భూ కబ్జా కోరులకు పోలీసులు అండగా నిలుస్తున్నారని, పైసలు ఇస్తేనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ,బిఆర్ఎస్ నాయకులు ఉపేంద్ర చారి,బొమ్మెర రామ్మూర్తితో కలిసి దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ పేదల ఇళ్లు కూల్చిన హైడ్రా, ఎఫ్‌టిఎల్‌లో ఉన్న అక్బరుద్దీన్ కళాశాలను ఎందుకు కూల్చలేదని, మూసి నది మధ్యలో ఆదిత్యా కన్‌స్ట్రక్షన్ నిర్మాణం జరుగుతుంటే ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇల్లు కూల్చేవాడు పాలకుడు కాదని, ఇల్లు నిర్మించేవాడే పాలకుడని అన్నారు. హైడ్రా భయంతో కూకట్ పల్లి నియోజకవర్గంలో బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకుందన్నారు. మూడు సింహాలు పెట్టుకున్న ఐపిఎస్ అధికారికి చట్టంపైన గౌరవం లేకపోతే, ఇక సామాన్యులకు ఎలా ఉంటుందన్నారు. కోర్టు ఆదేశాలను సిఎం రేవంత్ రెడ్డి పాటించిన దాఖలాలు లేవన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు మేరకే రంగనాథ్ విధ్వంసం చేశారని మండిపడ్డారు. రంగనాథ్ తాజా వ్యాఖ్యలు కోర్టు ధిక్కరణ కిందకు రాదా?అని దాసోజు అన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం
పి.ఐ.యు డివిజన్, మహబూబ్‌నగర్ జిల్లా
Lr.No. TO/41-58/2026-27 టెండర్ ప్రకటన తేది: 27.07.2026
మహబూబ్‌నగర్ జిల్లాలో పనుల సంఖ్య (18), మహబూబ్‌నగర్ మండలం (07), హన్వాడ మండలం (04), గండీడ్ మండలం (01), దేవరకద్ర మండలం (01), జడ్చర్ల మండలం (03), సిసి కుంట మండలం (02). ఇసివి మొత్తం: రూ. 153.00 లక్షలు, టెండర్ నోటీసు ప్రారంభ తేదీ: 27.07.2026 నుండి 06.08.2026 వరకు, తెరచు తేదీ: 07.08.2026.
సం/- జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్, PIU డివిజన్, మహబూబ్‌నగర్.
DIPR R.O. No. : 6876-PP/CL/ADVT/2026-27, Date: 28-07-2026

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : కుత్బుల్లాపూర్ జోన్

| NIT No. | పనుల సంఖ్య | అంచనా విలువ (రూ.లక్షలలో) | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది & సమయం / బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
| --- | --- | --- | --- | --- |
| NIT No.15/SE/QBZ/ CMC/2026-27, Date: 27.07.2026 | 14 | 1118.70 | 29.07.2026 @ 01:00 PM 05.08.2026 @ 01:00 PM | సూపరింటెండింగ్ ఇంజనీర్, కుత్బుల్లాపూర్ జోన్. 7995009077 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, కుత్బుల్లాపూర్ జోన్, సిఎంసి.
DIPR R.O. No. : 6925-PP/CL/ADVT/2026-27, Date: 28-07-2026

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
పటాన్‌చెరు సర్కిల్-46, శేరిలింగంపల్లి జోన్
షార్ట్ టెండర్ నోటీసు నెం. Engg-13/CMC/PTC-C-46/2026-27, Date: 27.07.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ /ECV | డౌన్‌లోడ్ ప్రారంభ తేది | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | ఇ.ఇ. అధికారి పేరు & చిరునామా |
| --- | --- | --- | --- | --- | --- |
| షార్ట్ టెండర్ నోటీసు నెం. Engg-13/ CMC/PTC-C-46 /2026-27, తేది: 27.07.2026 | 1 నెం. వర్షపు నీటి కాలువ, 1 నెం. JCB వినియోగం, 1 నెం. జెట్టింగ్ మెషీన్ వినియోగం. | రూ. 51.40 లక్షలు | 29.07.2026 10:30 AM | 01.08.2026 12:00 PM | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46. ఫోన్ నెం. 7331189492 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.telangana.gov.in, పటాన్‌చెరు సర్కిల్-46 లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46, ఎస్‌ఎల్‌పి జోన్, సిఎంసి.
DIPR R.O. No. : 6904-PP/CL/ADVT/2026-27, Date: 28-07-2026

04
ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
బుధవారం
29-07-2026
www.prajapaksham.in
మహానగరి
GREATER HYDERABAD

## ట్రాఫిక్ కష్టాలను నియంత్రించేందుకే రోడ్డు విస్తరణ పనులు

ప్రజాపక్షం/షాద్‌నగర్: ట్రాఫిక్ కష్టాలను నియంత్రించేందుకే రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి తెలిపారు. మంగళవారం షాద్‌నగర్ ముఖ్యకూడలి నుండి హైద్రాబాద్ వైపు ఉన్న అక్రమ నిర్మాణాల తొలగింపును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ సునీతారెడ్డి మాట్లాడుతూ షాద్‌నగర్ పట్టణం క్రమక్రమంగా విస్తరిస్తుందని, దాంతోపాటు ట్రాఫిక్ సమస్య ఎక్కువగా పెరిగిపోయిందని, అందువల్లనే విస్తరణ పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. చౌరస్తా విస్తరణ పనులు చేపట్టాలంటే ముందుకు ఇరువైపుల ఉన్న రోడ్లను విస్తరించాల్సి ఉంటుందని, అందుకోసం అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు శ్రీకారం చుట్టామని వివరించారు. రోడ్డు విస్తరణ పనులు చేస్తే ట్రాఫిక్ సమస్యను నియంత్రించడంతోపాటు ప్రమాదాలను అరికట్టేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పని చేస్తున్నామని, ఇందుకు ప్రజలందరు సహకరించాలని కోరారు.

## ఓటర్ సవరణ ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: సర్ ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బిజెపి రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బిఎన్‌రెడ్డి డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పార్టీ ఆదేశాల మేరకు బిఎన్‌రెడ్డి నగర్, సాహెబ్ నగర్ డివిజన్‌లో ఉన్న బూత్‌ల్లో నిర్వహిస్తున్న (ఎస్‌ఐఆర్) ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్‌ను వారు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్ రావు, శ్రీధర్ రావు, మధుసూదన్‌రెడ్డి, గంగం ప్రేమ్‌నాథ్, సురేష్ కుమార్, శ్రీనివాస్ శర్మ, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, నరసింహారెడ్డి, గోపి, రమేష్, విజయ్ కుమార్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## అరుతడి పంట సాగు చేసుకోవాలి




ప్రజాపక్షం/యాచారం : రైతులు తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులనిచ్చే అరు తడి పంటలను సాగు చేసుకోవాలని యాచారం మండల వ్యవసాయాధికారి అర్ రవినాథ్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మంథనిగౌరేల్లి గ్రామంలో సర్పంచ్ అరవింద్‌నాయక్ అధ్యక్షతన జలసిరిపై గ్రామ సభ జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నవ్య, ఉపసర్పంచ్, వార్డుమెంబర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల నీటిమట్టం పెంచడమే ఇంకుడు గుంతల లక్ష్యం



ప్రజాపక్షం/కొందుర్గు: భూగర్భ జలాల నీటిమట్టం పెంచడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కొందుర్గు ఎంపిడిఓ శ్రీరాములు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామంలో సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో జలసిరిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అశోక్, ఉపసర్పంచ్ దామోదర్‌రెడ్డి, టిఎ మహేందర్, వార్డు సభ్యులు మరాఠీ సురేష్, కాశ యాదయ్య, గ్రామ కార్యదర్శి అరుణ, ఆశ వర్కర్ మంజులా రెడ్డి, గ్రామస్తులు మల్లేష్ గౌడ్, మీదికేరి నరసింహులు పాల్గొన్నారు.

## లోవోల్టేజీ సమస్య పరిష్కరించండి



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: విద్యుత్ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని ట్రాన్స్‌కో అధికారులను 16వ వార్డు కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి కిషోర్ కోరారు. మంగళవారం షాద్‌నగర్‌లో విద్యుత్ శాఖ డిఇ శ్యాంసుందర్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి కిషోర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో విద్యుత్ లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని, విద్యుత్ వైర్లు ఏళ్ల తరబడి ఉన్నాయని, వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు. మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో ఇంటింటి మిషన్ భగీరథ నీళ్ళు ఇవ్వాలన్నదే లక్ష్యంగా పని చేస్తున్నామని కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి కిషోర్ వివరించారు. మంగళవారం 16వ వార్డు క్రిష్టియన్ కాలనీలో మిషన్ భగీరథ పైపులైన్ పనులు ప్రారంభించారు.

## సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ



ప్రజాపక్షం/కేశంపేట: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బాధిత కుటుంబానికి పంపిణీ చేశారు. మంగళవారం కేశంపేట మండల పరిధిలోని నిర్ధవెల్లి గ్రామానికి చెందిన సయ్యద్ అంజద్‌కు మంజురైన రూ.30వేల చెక్కును అంధించారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ వాణిదేవి సహాకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన చెక్కును బాధిత కుటుంబానికి బిఆర్ఎస్ నేతలు అంధించారు. దాంతో మాజీ ఎమ్మెల్యే అంజయ్యకు, ఎమ్మెల్సీ వాణిదేవికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉమాపతి, మాజీ వైస్ ఎంపిపి పలాటి సురేందర్, మండల యూత్ అధ్యక్షుడు తోట వెంకటేష్, సీనియర్ నాయకులు గుత్తి రంగయ్య, వడ్ల జంగాచారి, చాకలి జంగయ్య, మల్లయ్య, నిరంజన్, మహేందర్, రామస్వామి, కొత్త రమేష్, ఎల్లనమోని శేఖర్, యుసూఫ్‌లు పాల్గొన్నారు.

# నగరంలో వరదల కట్టడి..
# భవిష్యత్తుకు భరోసా 'హైడ్రా'

**గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణతో సుస్థిర హైదరాబాద్ లక్ష్యం.. రెండేళ్లలో రూ.1.50 లక్షల కోట్ల విలువైన 3,325 ఎకరాల కబ్జా భూముల స్వాధీనం**

HYDRAA



ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరంలో వరదల నివారణ, జలవనరుల పరిరక్షణ, ప్రభుత్వ భూముల సంరక్షణ లక్ష్యంగా ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) రెండేళ్లలో గణనీయమైన ఫలితాలు సాధించినట్లు అధికారులు వెల్లడించారు. హైడ్రా ఏర్పాటైనప్పటి నుంచి మొత్తం 3,325 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమణల నుంచి స్వాధీనం చేసుకుని, సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రజా ఆస్తులను కాపాడింది. నగరంలో చెరువులు, కుంటలు, వాగులు, నాలాల ఆక్రమణల కారణంగా ప్రతి వర్షాకాలంలో వరదలు, వేసవిలో నీటి కొరత తీవ్ర సమస్యగా మారుతున్న నేపథ్యంలో గొలుసుకట్టు చెరువుల వ్యవస్థను పునరుద్ధరించేందుకు హైడ్రా ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. వర్షపు నీటి సహజ ప్రవాహాన్ని పునరుద్ధరించడం ద్వారా వరదలను నియంత్రించడం, భూగర్భ జలాలను పెంపొందించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడడం లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. చెరువుల అభివృద్ధిని కేవలం నీటి నిల్వకే పరిమితం చేయకుండా, వాటి పరిసరాల్లో పార్కులు, ఓపెన్‌జిమ్‌లు, వాకింగ్‌ట్రాక్‌లు, పిల్లల ఆటస్థలాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉపయోగపడే తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే తొలి విడతలో ఆరు చెరువులు పునరుద్ధరించగా, రెండో విడతలో మరో 14 చెరువుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అదనంగా నగర నాలుగు దిక్కుల్లో మినీ ట్యాంక్‌బండ్లుగా నాలుగు ప్రధాన చెరువుల అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయి. వరదల నివారణలో భాగంగా అమీర్‌పేట్, కృష్ణానగర్, ప్యాట్నీ నాలా, శ్రీరాంనగర్, మియాపూర్ తదితర ప్రాంతాల్లో నాలాల పూడిక తొలగింపు, ఆక్రమణల నివారణతో వేలాది కుటుంబాలకు వరద ముప్పు తగ్గిందని అధికారులు తెలిపారు. బతుకమ్మకుంట, నల్ల చెరువు, తమ్మిడికుంట వంటి చెరువుల అభివృద్ధితో గతంలో తరచూ ముంపునకు గురైన ప్రాంతాల్లో పరిస్థితి గణనీయంగా మెరుగుపడిందన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా అమీన్‌పూర్, గాజుల రామారం, కొండాపూర్, పీర్జాదిగూడ, సికింద్రాబాద్ కంటోన్మెంట్, బహదూర్‌గూడ, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆక్రమణలను తొలగించి భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ భూములను భవిష్యత్ ప్రజా అవసరాలకు వినియోగించేలా చర్యలు కొనసాగుతున్నాయన్నారు. స్వాధీనం చేసుకున్న మొత్తం భూమి లో 2,665 ఎకరాల ప్రభుత్వ భూములు, 454.11 ఎకరాల చెరువుల ఆక్రమణలు, 90.39 ఎకరాల పార్కుల భూములు, 25.37 ఎకరాల నాలాలు, 62.18 ఎకరాల రహదారులు, ఫుట్‌ఫాత్‌లు, 26.31 ఎకరాల ప్రజావసరాల భూములు ఉన్నట్లు అధికారులు వివరించారు. నగరాన్ని వరదల నుంచి రక్షించడంతో పాటు సుస్థిర అభివృద్ధి దిశగా హైడ్రా చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

## 'నీట్' ఆత్మహత్య విద్యార్థులకు సిపిఐ నివాళులు

ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం: నీట్ పరీక్ష పత్రం లీక్ కారణంగా తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడ్డ 28మంది విద్యార్థులకు సిపిఐ నాయకులు నివాళి అర్పించారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం రాత్రి సిపిఐ కార్యకర్తలు ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చౌరస్తా లో మరణించిన విద్యార్థులకు సంతాపం ప్రకటించి ర్యాలీ నిర్వహించి కొవ్వొత్తులతో నివాళ్ళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్య వ్యవస్థపై నిర్లక్ష్యం చేయటంతోనే విచ్చలవిడిగా నీట్ పరీక్ష పేపర్ లీక్ అవుతుందని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజ్ దోషులను కఠినంగా శిక్షించి, నీట్ పేపర్ లీక్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి సంఘటనలు పునారవృత్తం కాకుండా చర్యలు చేపట్టి పారదర్శకంగా పరిక్షలు నిర్వహించేటట్లు పూర్తి భాద్యత వహించాలని కోరారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయటం విద్యార్థుల విజయమన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పి నీలమ్మ, బండి నర్సింహ్మా, బన్నీ అజయ్, సంతోష్, బిచ్చనాయక్ పాల్గొన్నారు.








## హెపటైటిస్ కాలేయాన్ని ప్రభావితం చేసే తీవ్రమైన వ్యాధి

**రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి స్వర్ణకుమారి**

ప్రజాపక్షం/రంగారెడ్డి: హెపటైటిస్ అనేది కాలేయాన్ని ప్రభావితం చేసే తీవ్రమైన వ్యాధి అని రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి(డిఎంహెచ్ఓ) డాక్టర్ డి.స్వర్ణ కుమారి తెలిపారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా ప్రజల్లో హెపటైటిస్ వ్యాధిపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ సరైన సమయంలో పరీక్షలు చేయించుకోవడం,చికిత్స పొందడం ద్వారా దీనిని నియంత్రించవచ్చని తెలిపారు. ముఖ్యంగా హెపటైటిస్ బి వ్యాక్సిన్ తీసుకోవడం, పరిశుభ్రమైన ఆహారం, తాగునీటిని వినియోగించడం, సురక్షిత రక్త మార్పిడి, సురక్షిత ఇంజెక్షన్ల వినియోగం వంటి జాగ్రత్తలు పాటించడం ద్వారా హెపటైటిస్‌ను నివారించవచ్చనని వివరించారు. ప్రజలు హెపటైటిస్ లక్షణాలపై అప్రమత్తంగా ఉండి, ఏవైనా అనుమానాలు ఉన్నట్లయితే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా పరీక్షలు చేయించుకుని అవసరమైన వైద్య సేవలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ రాకేష్,డాక్టర్ జ్యోతిబాయి, డాక్టర్ సమీనా, వైద్య అధికారి డాక్టర్ రేఖ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**బాధితులు పథకాలు సద్వినియోగం చేసుకోవాలి**

కుష్ఠ వ్యాది బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని శాంతినగర్ కుష్ఠ కాలనీని డిఎంహెచ్ఓ స్వర్ణ కుమారి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సందర్శించారు. ఈ సందర్భంగా కుష్ఠ బాధితుల సంఘ సభ్యులతో సమావేశమై వారి ఆరోగ్య పరిస్థితులు, జీవన పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, వారికి అందుతున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ కుష్ఠ వ్యాధి పూర్తిగా నయం చేయగల వ్యాధి అని, ప్రారంభ దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే శాశ్వత వైకల్యాలను నివారించవచ్చని తెలిపారు. కుష్ఠ బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, పునరావాస సదుపాయాలు, వికలాంగుల పెన్షన్, గుర్తింపు కార్డులు, ఉపాధి మరియు ఇతర సంక్షేమ పథకాల గురించి అధికారులు అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వేను క్షేత్రస్థాయిలో నాణ్యతతో, పారదర్శకంగా పూర్తిచేసి, అర్హులైన ప్రతి కుష్ఠ బాధితుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'సర్' ప్రక్రియ పూర్తికి సహకారం

**షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి**

ప్రజాపక్షం/షాద్‌నగర్: సర్ ప్రక్రియ పూర్తికి సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని కమిషనర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సునితారెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అంధించాలని కోరారు. అర్హులై ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా అవకగాహన కల్పించాలని కోరారు. వార్డుల వారీగా రాజకీయ పార్టీల నేతలు బూత్ స్థాయి అధికారులకు సహాకరించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మెన్ అందె మోహన్, కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.





**3లోగా ఓటర్ల మ్యాపింగ్, డిజిటలైజేషన్ పూర్తి**

వచ్చే నెల ఆగస్టు 3వ తేదిలోగా ఓటర్ల మ్యాపింగ్‌తోపాటు డిజిటలైజేషన్ పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ నాగయ్య కోరారు. ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశం మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, పార్టీల నాయకులు దొడ్డి శ్రీనివాస్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తూరు మండలంలో...** సర్ ప్రక్రియలో భాగంగా కొత్తూరు మండలంలో 88.03శాతం పూర్తి చేయడం జరిగిందని తహసీల్దార్ ముంతాజ్‌భేగం వివరించారు. కొత్తూరు తహశీల్దార్ ఆఫీస్‌లో వివిధ రాజకీయపార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య, ఆర్ఐ ప్రేమ్, సినియర్ అసిస్టెంట్ కవిత పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు బ్లాక్ స్పాట్ల పరిశీలన

**చేవెళ్ల జోన్ డిసిపి యోగేష్ గౌతమ్**



ప్రజాపక్షం/కొత్తూరు: రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు బ్లాక్ స్పాట్లను పరిశీలించడం జరిగిందని చేవెళ్ల జోన్ డిసిపి యోగేష్ గౌతమ్ వివరించారు. మంగళవారం కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్, శంషాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాద స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చేవెళ్ల జోన్ డిసిపి యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ 44వ జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రాంతాలను పరిశీలించి బ్లాక్ స్పాట్లుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టి రహదారి భద్రతలను మెరుగుపరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. రహదారి భద్రతకు సంబంధించి అవసరమైన చర్యలను త్వరతగతిన చేపట్టేందుకు సంబంధిత శాఖ అధికారులతోమ సమన్వయం చేసుకుంటూ నియంత్రించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రమాద రహిత రహదారులుగా ఏర్పాటు చేయాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, ఎన్‌హెచ్‌ఏఐ ఇంజనీరింగ్ అధికారులతో సైతం చర్చిస్తున్నట్లు వివరించారు. ఇటీవల కాలంలో చోటు చేసుకున్న ప్రమాద ప్రాంతాలను సైతం పరిశీలించడమే కాకుండా ఇందుకు కావాల్సిన కారణాలు ఏమిటి అనే అంశాలను సైతం పరిగణలోకి తీసుకుంటున్నామని వివరించారు. ట్రాఫిక్ సమస్యను నియంత్రించడంతోపాటు రోడ్డు ప్రమాదాల నివారణకు చెక్ చేపట్టడం జరుగుతుందని, వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడిపించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ, కొత్తూరు సిఐ నర్సయ్య, ఎన్‌హెచ్‌ఏఐ ఇంజనీర్ భాను ప్రతాప్‌శర్మతోపాటు శంషాబాద్, నందిగామ, షాద్‌నగర్ పోలీసులు పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాలు బిఎల్‌ఒలకు అందజేయాలి

**ఆగస్టు 3వ తేదీ వరకు వేచి ఉండొద్దు**
**10న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటన**
**ఓటు హక్కుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదు**
**జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్**






ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్‌ఐఆర్2026) ప్రక్రియలో భాగంగా ఇంటింటికీ పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ఆగస్టు 3 వరకు వేచి చూడకుండా వెంటనే సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (బిఎల్‌ఒలకు) అందజేయాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు కమిషనర్ (ఎన్నికలు, రెవెన్యూ) బి.సంతోష్, జోనల్ కమిషనర్ చంద్రకళతో కలిసి ఆయన మాట్లాడారు. ఓటు హక్కుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని కర్ణన్ స్పష్టం చేశారు. ఎన్యూమరేషన్ ఫారం అందని వారు తమ బిఎల్‌ఓలను సంప్రదించాలని, లేదా 1950 హెల్ప్‌డెస్క్‌కు కాల్ చేయాలని సూచించారు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 47.36 లక్షల మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు 100 శాతం పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 25,26,014 ఫారాలను డిజిటలైజ్ చేయగా, అది మొత్తం ఫారాల్లో 53.33 శాతంగా ఉందన్నారు. ఇంకా 22.10 లక్షలకుపైగా ఫారాలు డిజిటలైజేషన్‌కు మిగిలి ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం సుమారు 10 శాతం మంది ఓటర్లను ఆబ్సెంట్, షిఫ్టెడ్ డెత్ (ఏఎస్‌డి) కేటగిరీలో గుర్తించామని, ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. చనిపోయిన వారి పేర్లతో తప్పుడు వివరాలు సమర్పిస్తే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఫారాలను తప్పుగా నింపిన వారికి నోటీసులు జారీ చేస్తామని స్పష్టంచేశారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా ఆగస్టు 3 వరకు పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ చేపడతామని తెలిపారు. ప్రస్తుతం 1,200 మందికిపైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ఒక్కో కేంద్రంలో 1,200లోపు ఓటర్లు ఉండేలా పునర్వ్యవస్థీకరిస్తామని చెప్పారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 10న ముసాయిదా ఓటరు జాబితా (డ్రాఫ్ట్ రోల్) విడుదల చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 9 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని, వాటి పరిష్కార ప్రక్రియ అక్టోబర్ 8 వరకు కొనసాగి, అక్టోబర్ 12న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని కర్ణన్ చెప్పారు. కొంతమంది రెండు చోట్ల ఓటు నమోదు చేసుకుని, హైదరాబాద్‌లో కాకుండా స్వగ్రామాల్లో ఎన్యూమరేషన్ చేయిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. రాజకీయపార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు ఓటర్లకు ఫారాలు నింపడంలో సహకరించాలని కోరామని తెలిపారు.

**ఎన్యూమరేషన్ ఫారాల సేకరణలో.. పార్టీల ప్రతినిధులు సహకరించాలి**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్‌ఐఆర్2026) ప్రక్రియలో భాగంగా ఇంటింటికీ పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాల సేకరణకు రాజకీయ పార్టీలు సహకరించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ కోరారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయం కంట్రోల్‌రూమ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. సమావేశంలో జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ బి.సంతోష్, జోనల్ కమిషనర్ చంద్రకళ పాల్గొన్నారు. ఇప్పటికే పంపిణీ చేసిన ఫారాలు సేకరణకు రాజకీయ పార్టీలకు చెందిన బుత్‌లేవల్ ఏజెంట్‌లు సహకరించాలని కోరారు.



## వాయు కాలుష్యంతో అనారోగ్య సమస్యలు : వైద్యుల హెచ్చరిక

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఎదులాబాద్ గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. త్రాగునీటి నాణ్యత లోపం వాయుకాలుష్యం వ్యవసాయ రసాయనాలు కలుషిత ఆహారం కారణంగా కిడ్నీ వాధ్యులు, సంతానలేమి సహా పలు అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని మేడ్చల్ నియోజకవర్గం భారతీయ జనతాపార్టీ ఇంచార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. మున్సిపల కార్పొరేషన్ పరిధిలోని ఎదులాబాద్ వార్డు కార్యాలయం వద్ద జిల్లా మీడియా కన్వీనర్ చలువాది ప్రవీణ్ రావు సహకారంతో ఘనపూర్ మెడిసిటీ మెడిసిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి గోనే శ్రీనివాస్, భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షుడు రాగం అర్జున్ పాల్గొ న్నారు. శిబిరంలో రక్తపోటు, కంటి, చెవి, మధుమేహం,ముక్కు గొంతు స్త్రీరోగాలు, ఎముకల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. అవసరమైన వారికి ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేష్, రాచకట్ల శ్రీశైలం, మల్లేష్ ముదిరాజ్, వైద్యులు వైద్య, సిబ్బంది గ్రామ పెద్దలు కార్యకర్తలు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులు పరిశీలన

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాప్రా సర్కిల్ కాప్రా డివిజన్ పరిధిలోని గాంధీ నగర్ కాలనీ కమ్యూనిటీ హాలు ఎదురుగా, రీడింగ్ రూమ్ వద్ద సిసి రోడ్డు 20లక్షలతో నిర్మిస్తున్న పనులను మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు విఠల్ నాయక్ పరిశీలించారు. ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి కోట్ల రూపాయ ల నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తన్నీరు శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

## పిహెచ్‌సిని పరిశీలించిన డిఎంహెచ్‌ఒ...

### కనీస వసతుల కల్పించాలని ఆదేశం



**ప్రజాపక్షం/చర్లపల్లి:**జమ్మిగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస వసతులు కల్పించాలని **ప్రజాపక్షం** జాతీయ దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. కాప్రా సర్కిల్ ఏఎస్ రావు నగర్ డివిజన్ జమ్మిగడ్డ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దుస్థితి పై ప్రచురితం కాగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆనంద్ స్పందించి ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందిపై సీరియస్ అయ్యారు. ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులు, మంచినీటి సౌకర్యం గూర్చి తెలుసుకుని కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు. దీంతో స్థానికులు, రోగులు ప్రజాపక్షం పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

**బిజెపి ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పణః** జమ్మిగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని బిజెపి నాయకులు కోరారు. జమ్మిగడ్డలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస వసతులైన టాయిలెట్లు నిర్వహణ లోపం, పారిశుద్ధ్య సమస్యలు, మంచినీటి సౌకర్యం, రోగులు కూర్చోవడానికి వసతి కల్పించాలని మందులు, సిబ్బంది కొరతపై తక్షణ చర్యలు తీసుకోవాలని డాక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమం లో నాయకులు తాడూరి శ్రీనివాస్, మోహన్ రెడ్డి, మహేష్‌కుమార్, రమేష్‌యాదవ్, సీతారాంరెడ్డి, సురేందర్‌గౌడ్, గణేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



## హెపటైటిస్ వ్యాధికి ముందస్తు జాగ్రత్తలు అవసరం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** కాలేయానికి సంబంధించి ప్రమాదకరమైన హెపటైటిస్ వ్యాధికి గాను సకాలంలో తీసుకొనే వ్యాధి నిర్ధారణ పరిక్షలు, చికిత్సల ద్వారా సమస్యలను అధిగమించవచ్చని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఆనంద్ సూచించారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవ సందర్భంగా ఆల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెపటైటిస్ వ్యాధి నివారణలో భాగంగా ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించటం, టీకాలు వేయించుకోవటం, అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి అక్కడి వైద్యులను సంప్రదించటం ద్వారా అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపించుకొని సరైన చికిత్సలు చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాలపై వైద్యారోగ్య శాఖ వైద్యులు సరైన అవగాహన కల్పించాలని ఆదేశించారు.

## సామాజిక న్యాయమే.. తెలంగాణ రక్షణ సేన ధ్యేయం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం అందించడమే టిఆర్‌ఎస్ ధ్యేయమని మేడ్చల్ మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గ టిఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ వేముల భవాని అన్నారు. తెలంగాణ రక్షణ సేన మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించిన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు. ఇసిఐఎల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మంగళవారం కాప్రా ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్టీ స్థాపించిన మూడు నెలల్లోనే ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తుందన్నారు.

# ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలి

* సేఫ్ సిటీ ప్రాజెక్ట్‌స్‌పై ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి
* ప్రత్యేక 'ట్రాఫిక్ వింగ్' ఏర్పాటుకు ప్రతిపాదనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాఖల మధ్య పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి అన్నారు. ఎంఎంసి పరిధిలో 'సేఫ్ సిటీ ప్రాజెక్ట్' ను మరింత సమర్థవంతంగా అమలు చేసేందు కు ఎంఎంసి కమిషనర్ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. జోనల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, నగరంలో వివిధ అభివృద్ధి పనుల స్థితిగతులు, మౌలిక సదుపాయాల కల్పన, శాఖల మధ్య సమన్వయంపై సమగ్రంగా చర్చించారు.

ట్రాఫిక్ సిగ్నల్ల పునరుద్ధరణ, ఆధునిక సాంకేతికత నగరంలో ట్రాఫిక్ సిగ్నల్ల పనితీరును మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కమిషనర్ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ట్రాఫిక్ నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని, సిగ్నల్ల నిర్వహణ, మరమ్మతులు, సమన్వయ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.

**ప్రత్యేక 'ట్రాఫిక్ వింగ్' ఏర్పాటు**

రహదారి భద్రతను మెరుగుపరచడం, ట్రాఫిక్ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ఎంఎంసి పరిధిలో ప్రత్యేక 'ట్రాఫిక్ వింగ్' ఏర్పాటుచేసే అంశంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. దీనికి సంబంధించి తగిన కార్యాచర ణ ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.

**పారదర్శక సేవలు – విధుల కేటాయింపు**

కార్పొరేషన్ పరిపాలనను మరింత వేగవంతం చేసేందుకు అధికారుల విధుల కేటాయింపును కమిషనర్ సమీక్షించారు. ప్రతి అధికారికి స్పష్టమైన బాధ్యతలు అప్పగించాలని, శాఖల మధ్య పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలని సూచించారు. ప్రజా భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, పట్టణ అభివృద్ధి ప్రాధాన్యతలుగా సేఫ్ సిటీ లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో జోనల్ కమిషనర్లు రాధికా గుప్తా, సంచిత్ గంగ్వార్, వికాస్ మహతోలతో పాటు ఇన్‌చార్జ్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రావు, ఇంజనీరింగ్ అధికారులు రమేష్ బాబు, వెంకటేశ్వర్లు, రోహిణి, మాధవి లత, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో నాయకత్వ లక్షణాలు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** శారీరక దృఢత్వం, మానసిక వికాసం, నాయకత్వ లక్షణాలు, ఆత్మ విశ్వాసం పెంపొందించటంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. మంగళవా రం జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి ణి కాంతమ్మతో కల్సి ఆయన ఉప్పల్, మల్కాజిగిరి ప్రాంతాల్లోని మైనారిటీస్ గురుకుల పాఠశాలలను సందర్శించి అక్కడి తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, భోజనశాల, మరుగు దొడ్లు, మంచి నీటి సౌకర్యం, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లన్నిటిని పరిశీలించారు. పాఠశాల, వసతి గృహాలను పరిశుభ్రంగా, ఆహ్లాదంగా నిర్వహిస్తున్నందుకు ఆయన సిబ్బంది, విద్యార్థినులను అభినందించారు.అనంతరం విద్యార్థినులతో ఆయన ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకొని పదవ తరగతి, ఇంటర్ మొదటి ఏడాది పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన వారికి విద్యార్థినులకు మెరిట్ అవార్డులను అందచేసారు. ప్రభుత్వం విద్యార్థినులకు యూనిఫారాలు, పాఠ్యపుస్తకా లు, నోట్‌బుక్స్, స్కూల్ కిట్‌లను పంపిణీ చేసారు. విద్యార్థినులతో అదనపు కలెక్టర్ సహపంక్తి భోజనం చేసి మెనూ ప్రకారం అన్ని పదార్థాలను నాణ్యతతో అందించాలని, వంట గదులతో పాటు స్టోర్ రూంలలో పరిశుభ్రతకు సంబంధించి అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

## జైలులో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల విస్తృత పరిశీలన



**ప్రజాపక్షం/చర్లపల్లి:** తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా చర్లపల్లి జైల్లో చేపడుతున్న పలు కీలక మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఖైదీల పునరావాసం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా పరిశీలించారు. తెలంగాణ జైళ్ల శాఖ హైడ్రా సంయుక్తంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఒసిఎల్)సిఎస్ఆర్ నిధుల సహకారంతో ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నామని, చర్లపల్లి చెరువు పునరుద్ధరణ పనులు వేగంగా, సమర్థవంతంగా కొనసాగుతున్నాయన్నారు. వాకింగ్ ట్రాక్ వెంట గుర్తించి చీకటి ప్రాంతాల్లో సందర్శకుల భద్రత, సౌలభ్యం దృష్ట్యా సౌర దీపాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పిపిసిని సందర్శించి అక్కడ జరుగుతున్న వివేకానంద వనం పనులకు పరిశీలించి బహుళ ప్రయోజనాల సమావేశ మందిరం(మల్టీపర్పస్ హాల్)నిర్మాణం కోసం స్థలం, జైలులో ఏర్పాటు చేయనున్న ఐటిఐ పనులను ఆమె పరిశీలించారు. ఖైదీల పునరావాసం, సమాజంలో విజయవంతమైన సమాజంలో తిరిగి స్థిరపడేందుకు నైపుణ్యాభివృద్ధి, ఉత్పాదక ఉపాధి అత్యంత కీలకమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక, ఉపాధి శిక్షణ, ఫ్యాక్టరీల శాఖ ప్రభుత్వ కార్యదర్శి హరిచందన దాసరి, రాష్ట్ర ఫ్యాక్టరీల డైరెక్టర్ మోహన్‌బాబు,ప రిశ్రమల శాఖ ఉప సంచాలకులు ఖలీద్ అఖ్తర్, డిఐ ఫ్యాక్టరీస్ మోహన్‌రెడ్డి, ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీధర్, ఐజి మురళీకృష్ణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ హెల్త్ వర్కర్స్ సేవలు అభినందనీయం

### వర్కర్స్‌కు సబ్బులు, నూనెలు, సామాగ్రి పంపిణీ చేసిన చైర్మన్ జాం రవి



**ప్రజాపక్షం/శామీర్‌పేటః** ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మూడుచింతలపల్లి మున్సిపల్ పబ్లిక్ హెల్త్ వర్కర్స్ మున్సిపాలిటి పరిశుభ్రత కోసం నిరంతరం కృషి చేస్తున్నారని వారి సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ జాం రవి అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటిలో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ హెల్త్ వర్కర్స్, జవాన్లకు సబ్బులు, నూనెలు ఇతర సామాగ్రిని పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్మికులు వ్యక్తిగత ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని వారికి అవసరమైన సామాగ్రిని అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ మోహన్‌సింగ్, మల్లిఖార్జున్, సుభాష్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

**రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్న చైర్మన్**

మూడుచింతలపల్లి మున్సిపల్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవంలో మున్సిపల్ చైర్మన్ జాం రవి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని



ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చైర్మన్ జాం రవిని గౌడ సంఘం కమిటి సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నీరజ్‌గౌడ్, మాజీ వార్డు సభ్యుడు రాజేంద్రప్రసాద్‌గౌడ్, అశోక్, సింగర్ రవీందర్ గౌడ్, మురళీగౌడ్, తదితరులు పాల్గొన్నారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటి లక్ష్మాపూర్ తాండలో సీత్లా పండగను పురస్కరించుకుని మున్సి పల్ చైర్మన్ జాం రవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామీణ సాంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు, యువతులు సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మ ణ్, హీరాలాల్,మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు హెచ్‌పివి వాక్సిన్ తప్పనిసరి

### మండల వైద్యాధికారి మేఘన



**ప్రజాపక్షం/కోట్‌పల్లి :** బాలకలకు హెచ్‌పీవీ వాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించాలని మండల వైద్యాధికారి మేఘన అన్నారు. ఈ సందర్భంగా అమే మాట్లాడుతూ 14సంవత్సరాలు నిండిన ప్రతి బాలికకు ఎస్వీవ్యాక్సిన్ తప్పని వేసుకోవాలని కోట్‌పల్లి మండల వైద్య వైద్యధికారి అన్నారు. నేడు కోట్‌పల్లిమండల హెచ్‌పీవీ వ్యాక్సీనేషన్ కార్యక్రమాన్ని కోట్‌పల్లి మండలంలోని 1415 సంవత్సరాల వయస్సు గలబాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సీనేషన్ కార్యక్రమాన్ని వియవంతంగా పూర్తి చేయాలని అన్నారు. మొదటి దశలో కోట్‌పల్లి కెజిబివి పాఠశాలలో 45 మంది ంవిద్యార్థులకు హెచ్‌పీవీ వాక్సీన్ అందించంగా రెండవ దశలో వ్యాక్సిన్ అందించగా రెండవగ దశలో కోట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 20మంది విద్యార్థులకు వ్యాక్సిన్ వేశారు. అనంతరం మండల విద్యాధికారి చంద్రప్ప మాట్లాడుతూ వ్యాక్సనేషన్ ద్వారా భవిష్యతుల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన విద్యార్థినులందరికి ఈ వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకోవాలని, తల్లిదండ్రులు కూడాఈ కార్యక్రమంలో పూర్తి సహకారం అందించాలని సూచించారు.

## నచ్చిన వారికి నజరానా...నచ్చని వారికి జరిమానా..

### హైడ్రా చర్యలపై ధ్వజమెత్తిన బిఆర్‌ఎస్ ఎల్పి విప్ కెపి వివేకానంద




**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నచ్చిన వారికి నజరానా నచ్చని వారికి జరిమానాలు అనే విధంగా హైడ్రా చర్యలు కొనసాగుతున్నాయని బిఆర్‌ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద ధ్వజమెత్తారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పేట్‌బషీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద మాట్లాడుతూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ తీరుపై రాష్ట్ర హై కోర్టు చేసిన వ్యాఖ్యలను స్వాగతించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని తొలగించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశం పేద ప్రజల విజయమని, అధర్మం పై ధర్మం ఎప్పటికి విజయం సాధిస్తుందని చెప్పారు. హైకోర్టు తీర్పు బిఆర్‌ఎస్ పేదల పక్షాన సాగిస్తున్న పోరాటానికి వచ్చిన ప్రతి ఫలమని అన్నారు. రేవంత్ రెడ్డి హిట్లర్ పోకడలకు ఈ తీర్పు చెంప పెట్టని దుయ్యబట్టారు. ఏ వ్యవస్థలైనా బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం పనిచేయాల్సిందేనని, ఎనుముల రేవంత్ రెడ్డి రాజ్యాంగం ప్రకారం కాదని,హైడ్రా కమిషనర్‌ని తొలగించాలని కోర్టు ఇచ్చిన తీర్పే రుజువు చేసిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మున్సిల్ శాఖ కిందే హైడ్రా పనిచేస్తుందని, హైకోర్టు తీర్పుతో రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖల మంత్రిగా కొనసాగే నైతిక అర్హతను కోల్పోయారని మండిపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలబడాల్సిన హైడ్రా ప్రజలను విపత్తుల్లోకి నెట్టివేస్తుందని విమర్శించారు. పేదల పక్షాన బిఆర్‌ఎస్ ఎల్లప్పుడు పోరాటం చేస్తూనే ఉంటుందని, పోరాట ప్రతి ఫలమే ఈ ఫలితమని, సిట్టింగ్ హైకోర్టు జడ్జితో హైడ్రా ఆగడాలు, దోపిడీ పై సత్వర విచారణ చేపట్టాలని వివేకానంద డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.




## ఆర్‌టిఏ కార్యాలయం ఎదుట ధర్నా

**ప్రజాపక్షం/ఉప్పల్ :** తామెదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలంటూ తెలంగాణా ఆటో యూనియన్ ఉప్పల్ ఆర్‌టిఒకు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణా రాష్ట్ర ఆటో, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర పిలుపు మేరకు మంగళవారం ఉప్పల్ ఆర్‌టిఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి బెజ్జల కృష్ణమూర్తి, ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు శంకర్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వంగాల శ్రీనివాసులు, నాగోల్, ఉప్పల్, మేడిపల్లి ఆటో ట్రాలీ యూనియన్లకు చెందిన సురేష్, మదర్, సత్యనారాయణ, శ్రీశైలం, భాస్కర్, మల్లేష్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.




## బిఎల్‌ఒలకు మాజీ ఎమ్మెల్యే మైనంపలిబహుమతులు అందజేత

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నిబద్ధతతో పనిచేసే ప్రతి కార్యకర్తకూ కాంగ్రెస్ పార్టీలో సముచిత గౌరవం లభించటంతోపాటు అన్ని విధాలా అండదండగా ఉంటుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తెలిపారు. మల్కాజిగిరిలో మంగళవారం బిఎల్‌ఒలకు నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు వంద శాతం మేరకు ఎన్యుమరేషన్ ప్రక్రియ లక్ష్యాన్ని సాధించిన బిఎల్‌ఒలకు బహుమతులను అందచేసి శాలువాలతో సత్కరించారు. సర్ ప్రక్రియలో ఆయా ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు బిఎల్‌ఒలకు సహకరిస్తూ ప్రతి ఒక్క ఓటరుకు సంబంధించిన ఎన్యుమరేషన్ పత్రాలు పూరించి తిరిగి ఇచ్చేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్, అబ్జర్వర్ సమీర్ కౌశిల్, పార్టీ నేతలు లక్ష్మి కాంత రెడ్డి,వెకంకటేష్ యాదవ్, బికె శ్రీనివాస్, సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, జిడి సంపత్‌గౌడ్, వైనాల ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ ఎల్లమ్మ తల్లి బోనాల మహోత్సవానికి ఘన ఏర్పాట్లు

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ తండా2లో శ్రీ యెల్లమ్మ తల్లి బోనాల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 1న అభిషేకం, ఆగస్టు 2న బోనాల మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా దుండిగల్ సీఐ బాల్‌రెడ్డి, డీఐ మరియు వివిధ ప్రజాప్రతినిధులు, ప్రముఖ నాయకులకు ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ యెల్లమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. శ్రీ యెల్లమ్మ తల్లి అనుగ్రహంతో బోనాల మహోత్సవం విజయవంతంగా జరగాలని, గ్రామ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నెహ్రూ నాయక్, ప్రేమ్‌సింగ్ నాయక్, శాంతా బాయి, హనుమంత్ నాయక్, ప్రవీణ్ నాయక్, శ్రీను నాయక్, సోను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




## రైతులకు నష్టపరిహారం అందజేత

**ప్రజాపక్షం/పరిగి :**రాష్ట ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తూ భూములు కోల్పోతున్న రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా తీసుకుంటుందని వారికి ఎలాంటి అన్యాయం .జరగకుండా మార్కెట్ విలుకుఅనుగుణంగాపూర్తి నష్టపరిహారం అందజేస్తున్నామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి ఎమ్మెల్యేకార్యాలయంలో ఆర్‌డిఓ వాసుచంద్రతో కలిసి రేడియల్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న అల్లాపూర్,గూడుర్,దొంగెంకేపల్లి, గ్రామాలకు చెందిన రైతులకు 66ఎకరాల భూమికి గాను రూ.16కోట్ల 22లక్షల 78వేల నష్టపరిహారం చెక్కులనుఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం అభివృద్ధి ,రైతు సంక్షేమం అనే రెండు లక్ష్యాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. రాష్ట అభివృద్ధి కిఅవసరమైన జాతీయ రహదారులు,రేడియల్ రోడ్లు,సాగునీటి ప్రాజేక్టులు, విద్యుత్‌సబ్‌స్టేషన్లు వంటిమౌలిక సదుపాయాల నిర్మాణం ఎంతో ముఖ్యమో వాటికోసం భూములు కోల్పోతున్న రైతుల త్యాగాన్నిగౌరవిస్తు ,చట్టబద్దంగా పాదర్శకంగా మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహరం అందజేస్తుందన్నారు.

## మహిళ అదృశ్యం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** పనిచేసి మానేసిన దుకాణంలో డబ్బులు తీసుకొని వస్తానని చెప్పి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఉదంతం నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం నేరేడ్‌మెట్ సమీపంలోని మధురానగర్ ప్రాంతంలో నివసించే యేసుదాస్ భార్య పార్శిపోగు ప్రేమలత (26) ఏఎస్‌రావు నగర్‌లోని ఓ దుకాణంలో మూడేళ్ల నుండి పనిచేస్తూ కొద్ది రోజుల క్రితం మానేసింది. తన వేతనానికి సంబంధించి రావల్సిన కొంత డబ్బు తీసుకొని వస్తానంటూ సోమవారం ఉదయం భర్తకు చెప్పి ఇంటి నుండి వెళ్లింది. సాయంత్రమైనా ఆమె తిరిగి ఇంటికి రాకపోవటంతో భర్త బంధువులు, స్నేహితుల వద్దకు వెళ్లి ఆమె జాడ కోసం వెతికినా ఫలితం లేకపోవటంతో తన భార్య ఆచూకీ లభించటం లేదంటూ యేసుదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వానికి తలనొప్పిగా లోతుకుంట భూవివాదం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** రాష్ట్ర ప్రభుత్వానికి తలనొప్పిగా హైడ్రా కమిషనర్‌నే మార్చాలంటూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలకు మూలంగా తయారైన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని లోతుకుంట భూవివాదం చర్చనీయాంశంగా మారింది. హైడ్రా ఏర్పాటైన నాటి నుండి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న ఐపిఎస్ అధికారి రంగనాథ్ ప్రభుత్వం నుండి పొందిన పూర్తి స్థాయి స్వేచ్ఛతో కూడిన అధికారాలతో భూకబ్జాదారుల వెన్నులో వణుకు పుట్టిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన బిఆర్ఎస్, బిజెపిలు పేద ప్రజల గృహాలు కూల్చేస్తూ సంపన్నులకు వత్తాసు పలుకుతోందంటూ మొదటి నుండి హైడ్రాపై విమర్శలు కొనసాగిస్తున్నరు క్రమంలోనే హైడ్రా కమిషనర్‌పై కూల్చివేతలకు సంబంధించిన వివిధ అంశాలపై హైకోర్టులో కేసులు సైతం కొనసాగుతున్నాయి. హైకోర్టులో నమోదైన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని లోతుకుంట వివాదానికి సంబంధించి హైకోర్టులో దాఖలైన కేసు విచారణ ఫలితంగానే సోమవారం హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ కమిషనర్‌నే పదవి నుండి తొలగించాలంటూ చేసిన వ్యాఖ్యలతో రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది.

**వివాద నేపథ్యమిదీ....**

లోతుకుంట గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1, 2 లోని 40 ఎకరాల పట్టా భూమిలో శాంత శ్రీరామ్ కన్స్ట్రక్షన్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ కార్యకలాపాలు కొనసాగిస్తోంది. అయితే తమ సంస్థలో హైడ్రా అధికారులు కబ్జాలతో తమఎలాంటి సంబంధం లేనప్పటికి హైడ్రా తమ ప్రాంతంలోకి వచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నారంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైడ్రా ప్రవేశించరాదంటూ కోర్టు స్పష్టంగా తీర్పిచ్చినప్పటికి తీర్పును ఉల్లంఘిస్తూ తమ ప్రాంతంలోకి ప్రవేశించి తమను ఇబ్బంది పెడుతున్నారంటూ హైడ్రాకు వ్యతిరేకంగా హైకోర్టుకు సంస్థ వెళ్లింది. కాగా శాంతా శ్రీమ్ సంస్థ తప్పుడు పత్రాలతో హైకోర్టును తప్పుదోవ పట్టిస్తోందన్న హైడ్రా వాదనే ఈ వివాదానికి కారణమైంది. కొద్ది నెలల క్రితం హైడ్రా అధికారులు అక్రమార్కులు కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని కాపాడే క్రమంలో కూల్చివేతల సందర్భంగా లోతుకుంటలోని తీసుకున్న చర్యల్లో భాగంగా హైడ్రా తమకు సంబంధించిన భూమిలోకి ప్రవేశించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారంటూ హైడ్రాపై శాంతా శ్రీరామ్ కంపెనీ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. విచారణ క్రమంలో ప్రభుత్వ రికార్డుల ప్రకారం తాము అక్రమార్కుల నుండి కాపాడిన ప్రభుత్వ భూమి కంటోన్మెంట్ పరిధిలో జనరల్ ల్యాండ్ రికార్డ్స్ 243లో 119 ఎకరాలు, 255లో 29 ఎకరాలు ఉందని హైడ్రా అధికారులు హైకోర్టుకు వివరించారు. కంటోన్మెంట్ ఏరియాలో సహజ సిద్ధమైన కొండలతో ఉన్న భూమిలో రాత్రి పూట జంతువులు తిరుగుతుంటాయని, దీనికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న శాంతా శ్రీరాం కంపెని తరచూ బాంబులు పేలుస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ సేవ్‌రాక్ సొసైటీ, స్థానికులు అందించిన ఫిర్యాదుతోనే తాము రంగంలోకి దిగి ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుండి కాపాడమంటూ హైడ్రా పేర్కొంది. కాగా శాంతా శ్రీరాం కంపెనీ లోతుకుంట గ్రామ పరిధిలో ఉన్న 1, 2 సర్వేనంబర్ల ప్రయివేట్ భూమిలో లేఅవుట్‌కు 2007లో ప్రభుత్వం నుండి అనుమతులు తెచ్చుకొంది. కాగా లేఅవుట్ సవరణకు గాను జిఎల్ఆర్ నంబర్ 243/సి. 255/పిగా ఆ సంస్థ తప్పుడు వివరాలతో హైకోర్టుకు సమర్పించిందంటూ హైడ్రా వాదిస్తోంది. రూ.10 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని , హెరిటేజి రాళ్లను శాంతా శ్రీరామ్ సంస్థ ఆక్రమించేందుకు యత్నించిందని హైడ్రా వాదించగా, తాము అనుమతులతోనే ఉన్నామని సంస్థ ప్రయివేట్ భూముల్లోనే ఉన్నామని, అయినప్పటికి తమ స్థలంలో హైడ్రా ఫెన్సింగ్ వేసి ప్రభుత్వ భూములంటూ పేర్కొని నోటీసు బోర్డు ఏర్పాటు చేయటం పట్ల చేసిన అభ్యంతరాలే ఈ వివాదానికి మూలకారణం.

## ఎసిబి చరిత్రలో కొత్త మైలురాయి

1983 తర్వాత ఎసిబికి రికార్డు కేసులు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) 2026 రెండో త్రైమాసికంలో 1983 తర్వాత ఇదే కాలంతో పోలిస్తే అత్యధిక కేసులను నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎసిబి డైరెక్టర్ జనరల్ చారు సిన్హా వెల్లడించారు. హైదరాబాద్‌లో ఎసిబి ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడిస్తూ, అవినీతిపై శాఖ మరింత దూకుడుగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. 2026 రెండో త్రైమాసికంలో నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించిన చారు సిన్హా, ఎసిబి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. 1983 నుంచి ఇదే త్రైమాసికంతో పోలిస్తే అత్యధిక కేసులు నమోదు కావడం శాఖలో పెరిగిన అప్రమత్తత, వృత్తిపరమైన నిబద్ధత, అవినీతి నిరోధంపై ఉన్న అంకితభావానికి నిదర్శనమని తెలిపారు.ఆదాయానికి మించిన కేసులు 10, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన కేసులు 34, ఆకస్మిక తనిఖీలు 23 జరిగాయని వెల్లడించారు. ఈ సందర్భంగా అన్ని యూనిట్ల అధికారులు, సిబ్బంది చేసిన కృషిని ఆమె అభినందించారు. పారదర్శక పరిపాలన, జట్టు స్ఫూర్తి, సమర్థవంతమైన పనితీరుతో శాఖ ప్రతిష్ఠను మరింత పెంచారని కొనియాడారు. రెండో త్రైమాసికంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, సిబ్బందిని సత్కరించేందుకు 'రివార్డ్ మేళా' నిర్వహించి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చారు సిన్హా మాట్లాడుతూ, 'అవినీతి దేశాన్ని లోపల నుంచి బలహీనపరుస్తుంది' అని పేర్కొన్నారు. ప్రజా విశ్వాసాన్ని నిలబెట్టేందుకు అధికారులు నిజాయితీ, నిబద్ధత, ప్రజా సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. భవిష్యత్తులో కూడా నిష్పాక్షిక, వృత్తిపరమైన, సమగ్ర దర్యాప్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని, సామర్థ్యాభివృద్ధి, దర్యాప్తు ప్రమాణాల మెరుగుదల, నిరంతర అప్రమత్తతతో అవినీతి నిర్మూలనకు ఏసీబీ మరింత కట్టుదిట్టంగా పనిచేస్తుందని ఆమె స్పష్టం చేశారు. సమావేశం ముగింపులో అవినీతి నిరోధక చర్యలను మరింత ఉధృతం చేసి, పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలన పరిరక్షణలో ముందంజలో ఉండేలా సమిష్టిగా కృషి చేయాలని ఎసిబి డైరెక్టర్ అవినాష్ మహంతి పేర్కొన్నారు.

## ఐటి కారిడార్‌లో అప్‌గ్రేడింగ్



**ప్రజాపక్షం/హైదరాబాద్‌సిటీ:** విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని గచ్చిబౌలి 132 కేవీ సబ్‌స్టేషన్‌లో సామర్థ్య విస్తరణకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం గచ్చిబౌలి 132 కేవీ సబ్‌స్టేషన్‌లో రెండు 80 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉండగా భవిష్యత్ విద్యుత్ అవసరాలు, పెరుగుతున్న లోడ్‌ను దృష్టిలో ఉంచుకుని అదనంగా 80 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు నూతన 33 కేవీ స్విచ్చింగ్ స్టేషన్ నిర్మాణ ప్రతిపాదనపై మంగళవారం అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ప్రతిపాదిత 80 ఎంవీఏ అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్, 33 కేవీ స్విచ్చింగ్ స్టేషన్ అందుబాటులోకి వస్తే గచ్చిబౌలి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ పంపిణీ వ్యవస్థ మరింత పటిష్ఠం కావడంతో పాటు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనే వీలుంటుంది. ఈ సందర్భంగా రంగారెడ్డి జోన్ సీఈ పాండ్యానాయక్, సైబర్‌సిటీ ఎస్ఈ చంద్రశేఖర్, గచ్చిబౌలి డీఈ యాదగిరి, కొండాపూర్ డీఈ శ్యాంకుమార్‌తో పాటు ట్రాన్స్‌కో ఇంజనీర్లు డీఈ మాస్టర్ ప్లాన్, సివిల్ ఈఈ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఇదిలాఉండగా.. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని 33/11కేవీ నాదర్‌గుల్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 8 ఎంవీఏ నుంచి 12.5 ఎంవీఏకు పెంచి మంగళవారం చార్జ్ చేశారు. ఈ సామర్థ్య పెంపుతో గుర్రంగూడ, నాదర్‌గుల్, ఆదిత్యనగర్ తదితర పరిసర ప్రాంతాల్లోని సుమారు 15 వేల మంది వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది. కార్యక్రమంలో డీఈ లైన్స్ వేణుగోపాల్, టీఆర్ఈ డీఈ హైమానంద్, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

## నేడు 'తెలంగాణ అర్హతగల ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్ల' ధర్నా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్ల పదోన్నతులు, సీనియారిటీ జాబితాల రూపకల్పనలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, తెలంగాణ అర్హతగల ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్ల సంఘం హైదరాబాద్ ఇందిరాపార్క్‌లోని ధర్నా చౌక్‌లో బుధవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ టి.ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. బాలయ్య తెలిపారు. నీటి/ఎస్ఎల్ఇటి అర్హత ఉన్న అభ్యర్థులు అందుబాటులో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని జూనియర్ లెక్చరర్లకు 2003, 2005, 2006 డీపీసీలలో ప్రమోషన్లు కల్పించారని, తద్వారా అర్హత ఉన్న వారు దాదాపు ఏడేళ్ల సీనియారిటీని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి బదిలీలపై వచ్చిన లెక్చరర్లకు, ఇక్కడి స్థానిక లెక్చరర్ల సీనియారిటీని తొక్కిపెట్టి, అక్రమంగా ప్రిన్సిపాల్ పదోన్నతులు కల్పించారని ఆరోపించారు. 1998, 2001, 2002, 2004 బ్యాచ్‌ల అర్హత కలిగిన లెక్చరర్ల క్రమాన్ని కాదని, 2025 ఆగస్టు 30న ప్రచురించిన సీనియారిటీ జాబితాలో నిబంధనలను ఉల్లంఘించారని మండిపడ్డారు. అర్హత లేనివారికి యూజీసీ స్కేళ్లు వర్తింపజేయడం ద్వారా సుమారు రూ.130 కోట్ల నిధులు దుర్వినియోగమయ్యాయని అన్నారు. అనుమానాస్పద పీహెచ్‌డి డిగ్రీలు, నకిలీ అర్హతలపై సమగ్ర విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకోవాలని, అవకతవకలకు బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని, అర్హత, ప్రతిభకే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ ధర్నాలో డిగ్రీ లెక్చరర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## బిసిల హక్కుల సాధనకు డిజిటల్ ప్రజా ఉద్యమం: గుజ్జ సత్యం



**ప్రజాపక్షం / హైదరాబాద్:** బిసిల రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధనకు దేశవ్యాప్తంగా జెన్‌జి తరహా డిజిటల్ ప్రజా ఉద్యమం నిర్మించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు, బిసి జెఎసి స్టేట్ కో– ఆర్డినేటర్ గుజ్జ సత్యం పిలుపునిచ్చారు. సోషల్ మీడియానే కొత్త పోరాట వేదికగా బిసి హక్కుల కోసం యువత ఏకం కావాలని కోరారు. బుధవారం హైదరాబాద్ అబిడ్స్‌లో జరిగిన మీడియా సమావేశంలో బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు విజిఆర్ నారగోని, ఎఐసిసి బిసి ఇన్‌చార్జి కత్తి వెంకటస్వామిలతో కలిసి ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా బిసిలు సమస్యల పరిష్కారానికి ఎదురుచూస్తున్నప్పటికీ అవి జాతీయ చర్చగా మారకపోవడం ఆందోళనకరమన్నారు. ఉద్యమాలు రోడ్లపైనే కాకుండా సోషల్ మీడియాలో హక్కుల సాధనకు వినియోగించాలని పిలుపునిచ్చారు. చిరంజీవులు మాట్లాడుతూ యువత రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకొని సామాజిక న్యాయం పోరాటంలో ముందుండాలని కోరారు. విజిఆర్ నారగోని మాట్లాడుతూ బిసిలు రాజకీయ శక్తిగా ఎదగాలని పేర్కొన్నారు. బిసి సంఘం నేతలు కటకం నర్సింగ్ రావు, మట్ట జయంతి గౌడ్, ధనంజయ, రఘురాం, జ్ఞానేశ్వర్, నాథ్ పాల్గొన్నారు.

## టిడిపికి పూర్వ వైభవం లక్ష్యం

తెలంగాణ తెలుగు తమ్ముళ్లు స్పష్టం



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో సత్తా చాటాలని కార్యాచరణ రూపొందించినట్లు తెలంగాణ తెలుగుతమ్ముళ్లు తెలిపారు. ఈ మేరకు వారు ఏపి ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడితో సికింద్రాబాద్ పార్లమెంట్ నాయకుల భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల చేపట్టిన తెలుగుదేశం ప్రజా పథం కార్యక్రమాల నివేదికను ఆయనకు సమర్పించారు. మే 17న విజయవంతంగా నిర్వహించిన 'మినీ మహానాడు' స్ఫూర్తితో కార్యకర్తలను సమాయత్తం చేయడమే లక్ష్యంతో సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో చేపట్టిన తెలుగుదేశం ప్రజాపథం పర్యటనల వివరాలను టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్, తెలుగుతమ్ముళ్లు అమరావతి సచివాలయంలో బాబుకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ అధినేత చంద్రబాబు సానుకూలంగా స్పందించి, నాయకులకు తగిన దిశానిర్దేశం చేసినట్లు నేతలు తెలిపారు. చంద్రబాబును కలిసిన వారిలో తెలుగుతమ్ముళ్లు నల్లెల కిషోర్, శ్రీపతి సతీష్ కుమార్,అశోక్, కాసుల సుదర్శన్‌రెడ్డి, తడక వినోద్, శ్యామ్‌సుందర్, కరణం కిరణ్, భాను ప్రకాష్, సిహెచ్.ప్రదీప్ గౌడ్ తదితరులున్నారు.

## 'జై జవాన్.. జై కిసాన్... జై యువ'ను స్వాగతిస్తున్నాం : మొగుళ్ల రాజిరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని ఐఎన్‌టియూసి ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన 'జై జవాన్–జై కిసాన్–జై యువ' నినాదాన్ని స్వాగతిస్తున్నామని, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, వారికి రాజకీయాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పిస్తే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.21 ఏళ్లకే ఐఏఎస్, ఐపిఎస్ వంటి అత్యున్నత సివిల్ సర్వీసులకు అవకాశం ఉన్నపుడు ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ చేసే అర్హత కూడా అదే వయసులో కల్పించాలని అన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేపట్టాలని, తెలంగాణ శాసనసభలో ఈ అంశంపై తీర్మానం చేయాలన్న సిఎం ప్రతిపాదనకు అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని మంగళవారం ఓ ప్రకటనలో రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

**ప్రజాపక్షం/రాంనగర్:** రాష్ట్రంలో విరివిగా వర్షాలు కురవాలని.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని బిఆర్ఎస్ నేత నగేష్‌ముదిరాజ్ ఆకాంక్షించారు. ఈ మేరకు మంగళవారం రాంనగర్ పోచమ్మ దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన మహా చండీహోమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజేశ్వరి గౌడ్, సభ్యులు ఆనంద్, రవీందర్, శ్రీధర్ సత్యనారాయణ, శ్రీనివాస్, రమేష్, అడ్వైజర్లు సునీతగౌడ్, నర్సింగ్ రావు, లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ లష్కర్ ఇంచార్జిగా మహేందర్

**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** తెలంగాణ రాష్ట్ర రక్షణ సేన సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జిగా బండారి మహేందర్ ముదిరాజును నియమించారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. మహేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.....తనపై నమ్మకంతో ఇంచార్జ్ బాధ్యతను అప్పగించిన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

**ప్రజాపక్షం/ముషీరాబాద్:** టిఆర్ఎస్ అధినేత్రి కవిత నాయకత్వంలో బిసిల హక్కుల సాధనతో పాటు పార్టీ ఉన్నతి కోసం అంకితభావంతో పనిచేస్తామని టిఆర్ఎస్ బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటి స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించే వరకు శక్తివంచన లేకుండా పాటుపడతామన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

*కస్టమర్ కేర్ 155313కి కాల్ చేయాలి*
*జలమండలి ఎండి అశోక్‌రెడ్డి సూచన*



**ప్రజాపక్షం/హదరాబాద్‌సిటీ:** ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా తాగునీటితో కలిసి కలుషిత నీరు సరఫరా అయ్యేందుకు అవకాశం ఉన్నందున ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. క్యూర్‌లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం జలమండలి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని.. అధికారులు 24 గంటలు క్షేత్ర స్థాయిలో సిబ్బందితో పర్యవేక్షించుకోవాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు అప్రమత్తంగా ఉండాలని, తరచూ సీవరేజీ ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్‌హోళ్లు గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నీరు నిలిచే ప్రాంతాలపైన ఈ బృందాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈ సమయంలో కలుషిత నీరు సరఫరా కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, తాగునీటిలో తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, డీప్ మ్యాన్‌హోళ్ల దగ్గర సీవరేజి సూపర్వైజర్లు ఉండేలా చూడాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, పోలీస్ శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్ మూతలను తెరవకూడదని.. సమస్యలు ఉత్పన్నమైతే జలమండలి కస్టమర్ కేర్ 155313కి కాల్ చేయాలని ఎండి అశోక్‌రెడ్డి కోరారు.

**జలమండలి అధికారుల స్టడీటూర్**

శుద్ధి చేసిన మురుగునీటి సమర్థ వినియోగం, స్థిరమైన నీటి వనరుల నిర్వహణ, భవిష్యత్తులో జలమండలిలో అమలు చేయదగిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై అధ్యయనం చేసేందుకు జలమండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా అధికారులు బెంగళూరు వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డును సందర్శించారు. ఈ సందర్భంగా కడుబీసనహళ్లి మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించి అమృత్ 2.0 టెక్నాలజీ సబ్ మిషన్లో భాగంగా పిచ్ పైలట్ ఇనిషియేటివ్ కింద విజయవంతంగా అమలు చేస్తున్న శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగ ప్రాజెక్టు పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు ప్రాంగణాన్ని సందర్శించి, పైలట్ ప్రాజెక్టులో అమలు చేస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, నిర్వహణ విధానం, శుద్ధి ప్రక్రియ, శుద్ధి చేసిన నీటి పంపిణీ, వినియోగ విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అలాగే, ప్రాజెక్టును అమలు చేస్తున్న సాంకేతిక బృందంతో సమావేశమై, వ్యవస్థ అమలు, నిర్వహణ, సవాళ్లు, ఉత్తమ పద్ధతులపై సమగ్రంగా చర్చించి ప్రత్యక్ష అవగాహన పొందారు.

## ప్రతి ఒక్కరూ సహకరించాలి



చాంద్రాయణగుట్ట సిఐ రాచకొండ రవీందర్

**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని చాంద్రాయణగుట్ట సిఐ రాచకొండ రవీందర్ కోరారు.ఈ మేరకు ఆయన మైత్రి కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ముందుగా సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఐ రామస్వామి, ఎంఐఎం నేత తలహా కాసేరి, స్థానికులు సమీ, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల నమోదు చేపట్టాలి

తెలంగాణ ఉద్యమకారుల జెఎసి విజ్ఞప్తి




ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ : తెలంగాణ ఉద్యమకారుల నమోదుకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించేందుకు తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యకార్యాచరణ కమిటీ (జెఎసి) చీఫ్ కన్వీనర్ సుల్తాన్ యాదగిరి, కన్వీనర్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన 250 గజాల ఇంటి స్థలం, రూ.25వేల చొప్పున పింఛన్ తదితర డిమాండ్లు నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. నకిలీ ఉద్యమకారులు తెరమీదికి వస్తున్నారని, వారి ఆటలు సాగనివ్వబోమన్నారు. సమావేశంలో జెఎసి ముఖ్య సలహాదారులు ఓరుగంటి ఆనంద్, డా.పాండు గౌడ్, కో–కన్వీనర్‌లు మల్లారి అనిల్‌కుమార్, జానకి రెడ్డి, బత్తుల సోమయ్య, బోగె పద్మ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్ మార్చవద్దు



**ప్రజాపక్షం/ఫలక్‌నుమా:** పోలింగ్ బూత్ మార్చరాదంటూ జంగంమెట్ డివిజన్ రవీంద్రనాయక్ నగర్ కాలనీ కమిటీ, స్థానికులు కోరారు. కాలనీలోని 229 నెంబర్ పోలింగ్ బూత్ మార్చకుండా స్థానిక నివాస ప్రాంతంలోని కాలనీ కమ్యూనిటీ హాల్లోనే ఏర్పాటు చేయాలని కోరుతూ సౌత్‌జోన్ డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడికి స్థానికులు వినతిపత్రం అందించారు. డిసిని కలిసినవారిలో బంజారా వెల్ఫేర్ కమిటీ ప్రెసిడెంట్ ఎ.కృష్ణనాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మ నాయక్,రాంకుమార్, కిషన్, ఎస్‌టి మోర్చా నేత వి.గోపినాయిక్ తదితరులున్నారు.

## బల్దియాలో బోనాల సందడి




**ప్రజాపక్షం/కాచిగూడ:** కాచిగూడ బల్దియా వార్డ్ కార్యాలయంలో బోనాల వేడుకలను మంగళవారం నిర్వహించారు. బల్దియా పారిశుధ్య విభాగానికి చెందిన జవాన్లు టి.రవీందర్, అశోక్, శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో పెద్ద సంఖ్యలో అధికారులు, సిబ్బంది పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## జగదాంబికకు బోనం సమర్పణ



**ప్రజాపక్షం/గోల్కొండ:** జగదాంబిక ఎల్లమ్మ అమ్మవారి బోనాల మహోత్సవం కొనసాగుతోంది. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు, బోనాల సమర్పణ, అమ్మవారికి అలంకరణలు, సాంప్రదాయ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పూజల్లో కమిటీ అధ్యక్షుడు కట్ట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మామిడి సురేష్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దొర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆనందేశి వేణుబాబు, ముఠా గోపాల్, పూస రాజు, కల్వ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీ అకడమిక్ ప్రోగ్రామ్



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** భారతదేశంలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఇంజనీరింగ్ విద్యార్థులను తీర్చిదిద్దేందుకు వీలుగా పెగా ఇన్నోవేట్ వేదికగా యూనివర్సిటీ అకడమిక్ ప్రోగ్రామ్ విస్తరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే స్మార్ట్‌బ్రిడ్జితో పాటు ఏఐ4ప్రాసెస్, ది స్కిల్ ఎన్వాన్సర్స్, టింకర్ లెర్నింగ్‌తో వర్సిటీ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం ద్వారా ఇంజనీరింగ్ పట్టాదారులకు అవసరమైన మానవ నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో పెగాసిస్టమ్స్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, హెడ్ ఆఫ్ మార్కెటింగ్ డాన్ షూర్‌మ్యాన్ హాజరయ్యారు.

## తుకారాంగేట్ సిఐగా బషీర్ అహ్మద్

ప్రజాపక్షం/సికింద్రాబాద్: తుకారాంగేట్ సిఐగా బషీర్ అహ్మద్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు మార్కెట్ పోలీస్‌స్టేషన్ డిఐగా విధులు నిర్వర్తించిన ఆయన తుకారాంగేట్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీపై వచ్చారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే సహించేది లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు సహకరించాలని కోరారు.

## 'సర్' పత్రాలను తిరిగి ఇవ్వండి



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** ఎస్ఐఆర్ గడువు త్వరలోనే ముగుస్తున్నందున ఫారాలను వెంటనే తిరిగి ఇవ్వాలని బిజెపి లష్కర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి సూచించారు. ఈ మేరకు మెట్టుగూడ డివిజన్‌లో ప్రతి పోలింగ్ బూత్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి, డివిజన్ పర్యవేక్షకుడు నెమలి నందు, మేకల సారంగపాణి పరిశీలించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఆదర్శ్ కుమార్ ముదిరాజ్, ఆర్కాట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు

# ఢిల్లీని ముంచెత్తిన వరదలు

- నిత్యం రద్దీగా ఉండే మార్కెట్లలో మోకాళ్లలోతు నిలిచిన నీరు
- వాహన రాకపోలకు తీవ్ర అంతరాయం
- రాగల 24 గంటల్లో ఢిల్లీలో ఉరుములు, మెరుపులు, వర్షాలు కురుస్తాయి ఐఎండి వెల్లడి



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీని మంగళవారం భారీ వర్షాలు ముంచెత్తాయి. నిత్యం రద్దీగా ఉండే మార్కెట్లలో మోకాళ్లలోతు నీరు నిలిచింది. రోడ్లపై వరదలు పోటెత్తడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు ఒకదానికొకటి తాకకుండా నెమ్మదిగా కదిలాయి. రానున్న 24 గంటల్లో ఉరుములు, మెరుపుల, పిడుగులతో కూడిన వర్షం పడవచ్చని వాతావారణ శాఖ కార్యాలయంలో రెడ్ అలెర్ట్‌ను జారీ చేసింది. ఉదయం నుంచి కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షం కారణంగా నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కన్నాట్ ప్లేస్, జన్‌పథ్, లూటియన్స్ ఢిల్లీలోని పలు రోడ్లు, భారత్ మండపం రోడ్, బారాఖంబా రోడ్ ఐటిఒ సమీపంలోని మధుర రోడ్ కళిందీ కుంజ్, ఇతర లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయినట్లు నివేదికలు వచ్చాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో, మింటో బ్రిడ్జిపై ట్రాఫిక్ సజావుగా సాగుతున్న వీడియోను పిడబ్ల్యుడి మంత్రి పర్వేష్ సాహిబ్ సింగ్ ఎక్స్‌లో షేర్ చేశారు. 'వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది, కానీ మింటో బ్రిడ్జిపై జనజీవనం అదే వేగంతో సాగిపోతోంది. ఈ రుతుపవనాలు కేవలం ఒక రుతుపవనంగానే ఉండాలి, ఒక సమస్యగా మారకూడదు అనేదే మా ప్రయత్నం' అని ఆయన అన్నారు. అనేక కూడళ్లలో పెద్ద పెద్ద నీటి మడుగులు ఏర్పడటంతో, ట్రాఫిక్ నెమ్మదించింది. వాహనదారులు నీట మునిగిన ప్రాంతాలలో జాగ్రత్తగా ప్రయాణించవలసి వస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సౌరభ్ భరద్వాజ్, ఢిల్లీలోని అత్యంత రద్దీగా ఉండే హోల్‌సేల్ మార్కెట్లలో ఒకటైన సదర్ బజార్ నుండి ఒక వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అక్కడ వర్షపు నీరు మధ్య వరకు చేరడంతో, పాఠశాల విద్యార్థులు, ఆఫీసుకు వెళ్లేవారు, కొనుగోలుదారులు వరద నీటితో నిండిన వీధుల్లో నడవవలసి వచ్చింది. ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 2:30 గంటల మధ్య, పూసాలో అత్యధికంగా 80 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత జనక్‌పురిలో 72 మి.మీ, లోదీ రోడ్‌లో 63.4 మి.మీ, ఛతర్‌పూర్‌లో 57.5 మి.మీ, సఫ్దర్‌జంగ్‌లో 51 మి.మీ, అయానగర్‌లో 50.1 మి.మీ, నరైనాలో 44 మి.మీ, రిడ్జ్‌లో 37.3 మి.మీ, మయూర్ విహార్‌లో 33.5 మి.మీ, పాలమ్‌లో 26 మి.మీ వర్షపాతం నమోదైంది. జాఫర్‌పూర్‌లో 8 మి.మీ వర్షపాతం నమోదు కాగా, ఈ మూడు గంటల వ్యవధిలో నజాఫ్‌గఢ్‌లో అసలు వర్షం పడలేదు. సఫ్దర్‌జంగ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 25.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది, ఇది సాధారణం కంటే 1.8 డిగ్రీలు తక్కువ. పాలమ్‌లో 25 డిగ్రీల సెల్సియస్ (సాధారణం కంటే 2.1 డిగ్రీలు తక్కువ) నమోదు కాగా, లోదీ రోడ్‌లో 25.8 డిగ్రీల సెల్సియస్ (సాధారణం కంటే 0.2 డిగ్రీలు తక్కువ) నమోదైంది. రిడ్జ్ స్టేషన్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 23.2 డిగ్రీల సెల్సియస్ (సాధారణం కంటే 2.3 డిగ్రీలు తక్కువ) నమోదు కాగా, అయానగర్‌లో 27.1 డిగ్రీల సెల్సియస్ (సాధారణం కంటే 1.1 డిగ్రీలు ఎక్కువ) నమోదైంది.

# జార్ఖండ్‌లో 16 మంది మావోయిస్టులు లొంగుబాటు

- బృందంలో ఐదుగురు మహిళా సభ్యులు
- ఆరుగురు నక్సల్స్‌పై రూ. 39 లక్షల రివార్డు
- ఆరు ఇన్సాస్, రెండు ఎకె-47 రైఫిళ్లతో పాటు 38 మ్యాగజైన్లు, 1,562 తూటాలు అప్పగింత





**రాంచీ :** జార్ఖండ్‌లో మంగళవారం 16 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో ఆరుగురిపై మొత్తం రూ. 39 లక్షల రివార్డు ఉందని ఒక సీనియర్ అధికారి తెలిపారు. లొంగిపోయిన వారిలో సంతోష్ మహతో అలియాస్ వాసుదేవ్ దా అలియాస్ దిలీప్ కూడా ఉన్నారని, ఇతనిపై 128 కేసులు నమోదై ఉండటంతో పాటు రూ. 15 లక్షల రివార్డు కూడా ఉందని ఆయన చెప్పారు. 'ఈ 16 మంది మావోయిస్టులలో ఆరుగురిపై మొత్తం రూ. 39 లక్షల రివార్డు ఉంది. ఈ బృందంలో ఐదుగురు మహిళా సభ్యులు కూడా ఉన్నారు. వీరిలో ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, ఒక జోనల్ కమిటీ సభ్యుడు కూడా ఉన్నారు' అని ఆ అధికారి పేర్కొన్నారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు సబ్‌జోనల్ కమిటీ సభ్యులు, ఇద్దరు ఏరియా కమిటీ బాధ్యులు కూడా ఉన్నారని ఆయన తెలిపారు. నిషేధిత సిపిఐ (మావోయిస్ట్) ప్రాంతీయ కమిటీ సభ్యుడైన సంతోష్ మహతో లొంగిపోవడం జార్ఖండ్ పోలీసులకు ఒక పెద్ద విజయమని ఆ అధికారి పేర్కొన్నారు. అనేక జిల్లాల్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 128 కేసుల్లో సంతోష్ నిందితుడిగా ఉన్నాడని, మార్చి 1న మనోహర్‌పూర్, చోటనగర, ఝురియాకేలా పోలీస్ స్టేషన్ల సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో జరిగిన ఐఇడి పేలుడులో ప్రమేయం కలిగి ఉన్నాడని, ఈ ఘటనలో కోబ్రా బెటాలియన్‌కు చెందిన ఒక జవాన్ గాయపడ్డాడని ఆరోపణలు ఉన్నట్లు ఆ అధికారి చెప్పారు. మావోయిస్టుల లొంగుబాటును రాష్ట్ర పోలీసులకు మరో పెద్ద విజయంగా జార్ఖండ్ డిజిపి తదాషా మిశ్రా అభివర్ణించారు. రాష్ట్రం నుండి తీవ్రవాదాన్ని, నేరాలను నిర్మూలించడానికి తాము కట్టుబడి ఉన్నామని, రాష్ట్రాన్ని నేరరహితంగా మార్చేందుకు జార్ఖండ్ పోలీసులు తమ నిబద్ధతతో పనిచేస్తున్నారని ఆమె ఈ సందర్భంగా అన్నారు. 78 కేసుల్లో నిందితుడిగా ఉండి, రూ. 10 లక్షల రివార్డు కలిగిన నిషేధిత సిపిఐ (మావోయిస్ట్) జోనల్ కమిటీ సభ్యుడు చందన్ లోహ్రా కూడా లొంగిపోయాడని ఆయన తెలిపారు. మావోయిస్టులు ఆరు ఇన్సాస్, రెండు ఎకె47 రైఫిళ్లతో పాటు 38 మ్యాగజైన్లు, 1,562 తూటాలను పోలీసులకు అప్పగించారని పోలీసులు తెలిపారు. ఆయుధాలు వదిలి లొంగిపోయిన ఇతర మావోయిస్టులలో సబ్ జోనల్ కమిటీ సభ్యులు అనిల్ తురి అలియాస్ ఉజ్వల్, సుఖ్‌లాల్ బిర్జియాన్ అలియాస్ అకేలా ఉన్నారు. వీరిద్దరిపై చెరో రూ. 5 లక్షల రివార్డు ఉంది. నిషేధిత సంస్థకు చెందిన ఏరియా కమిటీ సభ్యులు సుదేశ్ హోన్‌హగా (అలియాస్ సోనా రామ్ హోన్‌హగా), రిసివ్ — వీరిద్దరిపై చెరో రూ. 2 లక్షల రివార్డు ఉంది. జోనల్ కమిటీ సభ్యుడు సంతోష్ మాంఝీ (అలియాస్ జగబంధు) పోలీసుల ఎదుట లొంగిపోయారని ఆ అధికారి తెలిపారు. జార్ఖండ్ వ్యాప్తంగా చేపట్టిన మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాల్లో భాగంగా, మొత్తం 93 మంది మావోయిస్టులను అరెస్టు చేయగా, 45 మంది పోలీసుల ఎదుట లొంగిపోయారని, అలాగే భద్రతా దళాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో 22 మంది మరణించారని పోలీసులు పేర్కొన్నారు.

## 'మేకెదాటు'పై మంత్రి సమాధానం

# వెంటనే ఉపసంహరించుకోవాలి

- రాజ్యసభలో కేంద్రం ఇచ్చిన సమాధానం నిరాశపరిచింది
- ప్రధాని మోదీకి తమిళనాడు సిఎం విజయ్ లేఖ





**చెన్నై :** ప్రతిపాదిత మేకెదాటు డ్యామ్ విషయంలో కర్ణాటక పరీవాహక రాష్ట్రాల అనుమతి తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొనలేదని రాజ్యసభలో కేంద్రం ఇచ్చిన సమాధానం నిరాశపరిచిందని తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. అంతర్రాష్ట్ర జల సమస్యలలో స్థిరపడిన చట్టం, న్యాయ సూత్రాలను ప్రస్తావించకుండా, జలశక్తి శాఖ సహాయ మంత్రి సోమవారం ఇచ్చిన ఆ సమాధానాన్ని ఉపసంహరించుకోవాలని విజయ్ ఒక లేఖలో మోదీని కోరారు. కర్ణాటక–ఆంధ్రప్రదేశ్ అలమట్టి కేసులో దిగువ పరీవాహక రాష్ట్రం అనుమతి ఖచ్చితంగా అవసరమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని ఆయన నొక్కి చెప్పారు. కావేరీ జల వివాదాల ట్రిబ్యునల్ (సిడబ్ల్యుడిటి) అవార్డు, సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా లేని మేకెదాటు డ్యామ్ ప్రాజెక్టుకు ఎలాంటి చట్టబద్ధమైన లేదా పరిపాలనా ఆమోదం ఇవ్వకుండా చూడాలని ఆయన ప్రధానమంత్రిని కోరారు. కావేరీ నదిపై నిర్మాణం చేపట్టే ముందు కర్ణాటక దిగువ పరీవాహక రాష్ట్రాల అనుమతి తీసుకోవాలని 2018 ఫిబ్రవరి 16 నాటి సుప్రీంకోర్టు తీర్పులో స్పష్టంగా పేర్కొనలేదని మంత్రి పార్లమెంటు ఎగువ సభలో పేర్కొన్నారని ముఖ్యమంత్రి తెలిపారు. 'దిగువ పరీవాహక రాష్ట్రాల అనుమతికి సంబంధించి అమలులో ఉన్న చట్టపరమైన స్థితిని, స్థిరపడిన చట్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే జలశక్తి శాఖ సహాయ మంత్రి ఈ నిరాశాజనకమైన సమాధానం ఇచ్చినట్లు కనిపిస్తోంది' అని విజయ్ అన్నారు. పార్లమెంటులో కేంద్ర మంత్రి ఇచ్చిన సమాధానాన్ని ఉపసంహరించుకోవాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. నీటి విడుదల పరిమాణం, నియంత్రిత విధానం రెండింటికీ సంబంధించి దిగువన ఉన్న రాష్ట్రాల హక్కులు పూర్తిగా పరిరక్షించబడేలా చూడాలని ముఖ్యమంత్రి మోదీని కోరారు. దిగువన ఉన్న అన్ని రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, సమగ్రమైన సాంకేతిక, చట్టపరమైన పరిశీలన తర్వాత మాత్రమే ఈ ప్రాజెక్టుపై భవిష్యత్ పరిశీలన చేపట్టాలన్నారు. 'కావేరీ నది కేవలం నీటి వనరు మాత్రమే కాదు, దక్షిణ భారతదేశంలోని లక్షలాది మంది రైతులు, పౌరులకు జీవనాధారం. అంతర్రాష్ట్ర నదులను నియంత్రించే రాజ్యాంగ యంత్రాంగంపై విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి, ట్రిబ్యునల్ అవార్డు, సుప్రీంకోర్టు తీర్పు సమగ్రతను కాపాడటం అత్యవసరం' అని విజయ్ పేర్కొన్నారు. కావేరీ సమస్యపై తమిళనాడు ముఖ్యమంత్రి, కర్ణాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్ మధ్య సమావేశం జరుగుతుందనే అంచనాల నేపథ్యంలో కేంద్ర మంత్రి ఈ సమాధానం ఇచ్చారు. మరోవైపు, కావేరీ విషయంలో ఇటువంటి సమావేశాలు, చర్చలు ఈ అంశంపై తమిళనాడు హక్కులను నిర్ధారించడానికి సహాయపడవని వాదిస్తూ రైతు సంఘాలు, పార్టీల నాయకులు వ్యతిరేకించారు.

# మోదీ ఏ ముఖం పెట్టుకుని టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు?

- రాధాకృష్ణన్ కమిటీ నివేదిక అమలులో ఎలాంటి రాజకీయ చిత్తశుద్ధి, నిజాయితీ లేదు : జైరామ్ రమేశ్



**న్యూఢిల్లీ :** పరీక్షా విధానంలో సంస్కరణలను సూచించేందుకు గతంలో ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సులను అమలు చేయడంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరును కాంగ్రెస్ ప్రశ్నించింది. ఇప్పుడు నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఏ ముఖం ఉందని నిలదీసింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మాట్లాడుతూ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) వరుస వైఫల్యాల తర్వాత, పరీక్షా విధానంలో సంస్కరణలను సూచించేందుకు మోదీ ప్రభుత్వం కె. రాధాకృష్ణన్ నేతృత్వంలో నిపుణుల ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ఈ కమిటీ 101 సిఫార్సులను సమర్పించిందని అందులో 60 స్వల్పకాలిక, 30 మధ్యకాలిక, ఆరు ప్రభుత్వానికి సంబంధించినవని రమేశ్ ఎక్స్ వేదికగా తెలిపారు.

ఒక వార్తాపత్రిక విశ్లేషణను ప్రస్తావిస్తూ, ఆ 101 సిఫార్సులలో 27 ఇప్పటికీ అమలు కాలేదన్నారు. 'అంతేకాకుండా, మోదీ ప్రభుత్వం ప్రజలను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించింది. కమిటీ సిఫార్సుల ప్రకారం ఎన్‌టిఎ ఇకపై నియామక పరీక్షలను నిర్వహించదని అప్పటి మంత్రి ప్రధాన్ డిసెంబర్ 2024లో ప్రకటించారు. అయినప్పటికీ, ఎన్‌టిఎ 2025, 2026లో అనేక నియామక పరీక్షలను నిర్వహించింది' అని ఆయన అన్నారు. 2024, 2026 మధ్య జరిగిన ప్రశ్నపత్రాల లీకేజీల మధ్య రెండేళ్లపాటు ఎన్‌టిఎకు పూర్తి స్థాయి డైరెక్టర్ జనరల్‌ను కూడా మోదీ ప్రభుత్వం నియమించలేదని రమేశ్ ఎత్తిచూపారు. 'రాధాకృష్ణన్ కమిటీ నివేదికను అమలు చేయడంలో ఎటువంటి రాజకీయ చిత్తశుద్ధి గానీ, నిజాయితీ గానీ లేదని స్పష్టమవుతోంది. ఇప్పుడు నందన్ నీలేకని నేతృత్వంలో ఉన్నత స్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయడానికి ప్రధానమంత్రికి ఏ ముఖం ఉంది? ప్రభుత్వ గత పని తీరును చూస్తుంటే, ఈ నివేదిక కూడా మూలన పడిపోతుంది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వ్యాఖ్యానించారు. పరీక్షా విధానాన్ని లీక్‌ప్రూఫ్ (ప్రశ్నపత్రాల లీకేజీకి తావులేని విధంగా) మార్చేందుకు సంస్కరణలను సూచించేందుకు, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రకటించారు.

# ఎన్‌డిఎ పార్లమెంటరీ పార్టీ భేటీకి ఎన్‌సిపిఐ ఎంపిలు

**న్యూఢిల్లీ :** తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)ను వీడి 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా' (ఎన్‌సిపిఐ)లో చేరిన ఎంపిల బృందం, మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కీలక కేంద్ర మంత్రుల సమక్షంలో జరిగిన ఎన్‌డిఎ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి హాజరయ్యారు. దాదాపు 20 మంది లోక్‌సభ ఎంపిలు తమ సొంత పార్టీ టిఎంసిపై తిరుగుబాటు చేసి, అంతగా ప్రాచుర్యం లేని 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా' (ఎన్‌సిపిఐ)లో చేరారు. లోక్‌సభలో వీరు టిఎంసి ఎంపిలకు దూరంగా వేరుగా కూర్చుంటున్నప్పటికీ, ఎన్‌సిపిఐకి అధికారిక గుర్తింపు ఇవ్వడంపై స్పీకర్ ఓం బిర్లా ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఎన్‌సిపిఐలో చేరిన తర్వాత, ఈ ఎంపిలు బిజెపి నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ పట్ల తమ మద్దతును ప్రకటించారు. ఈ ఎన్‌డిఎ పార్లమెంటరీ పార్టీ సమావేశం పార్లమెంట్ భవన సముదాయంలో జరిగింది. నీట్ పేపర్ లీక్, ఇతర పరీక్షల అక్రమాలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన నిరసనల కారణంగా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన కొద్ది రోజులకే ఈ సమావేశం జరిగింది. సీనియర్ కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జె.పి. నడ్డా, నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, కిరణ్ రిజిజు, ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలకు చెందిన ఎంపీలు దీనికి హాజరయ్యారు. ఈ సమావేశం వాణిజ్యం, మత్స్య పరిశ్రమ అనే రెండు అంశాలపై దృష్టి సారించిందని కేంద్ర మంత్రి శాంతను ఠాకూర్ తెలిపారు.

## నీట్ పేపర్ లీక్ కేసులో సిబిఐ ఛార్జిషీట్ దాఖలు

**న్యూఢిల్లీ :** నీట్ యుజి – 2026 పేపర్ లీక్ కేసులో మంగళవారం సిబిఐ ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. దీనిపై కోర్టు బుధవారం విచారణకు తీసుకునే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ఈ కేసులో ఏజెన్సీ 13 మంది నిందితులను అరెస్టు చేసింది. వారందరూ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. అవినీతి నిరోధక చట్టం కింద నేరపూరిత దుష్ప్రవర్తన ఆరోపణలపై, పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్, 2024 కింద నేరాలకు గాను, సిబిఐ క్రిమినల్ కుట్ర, మోసం, క్రిమినల్ నమ్మకద్రోహం, సాక్ష్యాలను ధ్వంసం చేయడం వంటి అభియోగాలను బిఎన్‌ఎస్ కింద మోపింది. 'ఈ ఛార్జిషీట్‌లో సిబిఐ 360 మంది సాక్షులను, 422 పత్రాలను, 43 భౌతిక వస్తువులను పేర్కొంది. ప్రశ్నపత్రం లీక్ అయిందన్న ఆరోపణల నేపథ్యంలో, వైద్య ప్రవేశాల కోసం మే 3న జరగాల్సిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (అండర్ గ్రాడ్యుయేట్), లేదా నీట్‌యుజిని మే 12న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దు చేసింది. ఆ తర్వాత జూన్ 21న తిరిగి పరీక్ష నిర్వహించారు.

## ఢిల్లీలో అత్యధికంగా 'ఇ-జీరో ఎఫ్ఐఆర్'లు నమోదు

**న్యూఢిల్లీ :** సైబర్ ఆర్థిక మోసాల కేసులనుద్దేశించిన 'ఇ–జీరో ఎఫ్ఐఆర్'లు ఢిల్లీలో అత్యధికంగా నమోదయ్యాయి. 'ఇ–జీరో ఎఫ్ఐఆర్' విధానాన్ని 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం పార్లమెంట్‌కు తెలిపింది. లోక్‌సభలో ఒక లిఖితపూర్వక సమాధానంలో, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సైబర్ ఆర్థిక మోసాల కేసుల్లో 'ఇ–జీరో ఎఫ్ఐఆర్'లను నమోదు చేయడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఒక వేదికను కల్పించిందని పేర్కొన్నారు. ఈ విధానం కింద, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సిఆర్‌పి)లో లేదా 1930 హెల్ప్‌లైన్ ద్వారా నమోదైన ఫిర్యాదులు (సంబంధిత రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం నిర్ణయించిన ఆర్థిక నష్ట పరిమితులకు లోబడి), ఆయా ప్రాంతాల 'ఇ–క్రైమ్ పోలీస్ స్టేషన్'లో స్వయం చాలకంగా 'ఇ–జీరో ఎఫ్ఐఆర్'లుగా నమోదవుతాయి.

# ప్రధాన్‌కు స్వాగతం సిగ్గుచేటు

### బిజెపి తీరుపై ప్రియాంకాగాంధీ మండిపాటు

**న్యూఢిల్లీ :** విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంటు ఆవరణలో బిజెపి ఎంపిలు స్వాగతం పలకడం సిగ్గుచేటు అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపి ప్రియాంకాగాంధీ వాద్రా అన్నారు. ఆయన ఏదో సూపర్‌స్టార్‌లా స్వాగతం పలకడం ఏమిటని ప్రశ్నించారు. భారీ స్థాయి విద్యార్థి నిరసనల నేపథ్యంలో ఆయన రాజీనామా చేసిన రెండు రోజుల తర్వాత, పార్లమెంటు ప్రాంగణంలో కొందరు పార్టీ సహచరులు ఆయనకు సంప్రదాయ టోపీ, కండువాను బహూకరించి, 'ప్రధాన్ జిందాబాద్' అని నినాదాలు చేస్తూ స్వాగతం పలికారు. ప్రతిపక్ష ఎంపిలు కూడా 'దొంగ, దొంగ, పేపర్ దొంగ' వంటి నినాదాలు చేస్తూ, ప్రధాన్‌ను సన్మానించిన అధికార పార్టీ తీరును తీవ్రంగా విమర్శించారు. దీనిపై ప్రియాంకాగాంధీ స్పందిస్తూ 'ఇది సిగ్గుచేటు అని మీకు అనిపించడం లేదా? ధర్మేంద్ర ప్రధాన్ ఏ పరిస్థితుల్లో రాజీనామా చేశారో అందరూ చూశారు, కానీ నిన్న పార్లమెంటు ఆవరణలో ఆయనకు ఏదో సూపర్ స్టార్‌లా స్వాగతం పలికారు!. మోదీ ప్రభుత్వాన్ని ఎవరూ నమ్మలేరు, ఎందుకంటే ఇప్పటికీ విద్యార్థులు వేధింపులకు గురవుతున్నారు. మహిళల ఫోటోలతో కూడిన కొన్ని ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను నేను చూశాను, వారు ఏదో చేశారని ఆరోపిస్తూ ఆ పోస్టులు ఉన్నాయి... ఈ సమస్యను పరిష్కరించడానికి మీరు చర్చలు జరపాలనుకుంటున్నారా లేక ఇంకా విద్యార్థులపై పడి వారిని అణచివేయాలనుకుంటున్నారా? ఇది తప్పు' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అన్నారు. పార్లమెంటులో ప్రధాన్‌కు లభించిన స్వాగతాన్ని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కూడా తీవ్రంగా విమర్శించారు. 'ధర్మేంద్ర ప్రధాన్ అవినీతికి, భారతదేశంలో నాశనమైన విద్యా వ్యవస్థకు ప్రతీకగా ఉన్నారు. ఎప్పటికీ అలాగే ఉంటారు. ఆ వ్యవస్థే 26 మంది పిల్లల ప్రాణాలను బలిగొంది. లక్షలాది మంది యువతను రోడ్లపైకి వచ్చేలా చేసింది. ప్రధాన్ నైతిక బాధ్యతతో కాకుండా, యువత ఆగ్రహానికి భయపడే రాజీనామా చేయాల్సి వచ్చింది' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

## విద్యార్థి నిరసనకారులపై

# అణచివేత

- ఎఐఎస్‌ఎ ఆరోపణ, నిర్బంధంలో ఉన్న కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్

**న్యూఢిల్లీ :** శాంతియుత నిరసనకారులపై ఎలాంటి శిక్షా చర్యలు తీసుకోబోమని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, పరీక్షా పత్రాల లీకేజీకి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు దేశవ్యాప్తంగా అణచివేతను ఎదుర్కొంటున్నారని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎస్‌ఎ) ఆరోపించింది. మంగళవారం ఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఐఎస్‌ఎ నాయకులు మాట్లాడుతూ పలు రాష్ట్రాల్లో, ముఖ్యంగా బిహార్, ఢిల్లీలో అరెస్టులు, నిర్బంధాలు, పోలీసు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులపై తప్పుడు ఆరోపణలు మోపి కేసులు నమోదు చేసి, వారిని ఏకపక్ష నిర్బంధానికి గురిచేశారని మండిపడ్డారు. ఈ విలేకరుల సమావేశంలో ఎఐఎస్‌ఎ జాతీయ అధ్యక్షురాలు నేహ, ఎఐఎస్‌ఎ ఢిల్లీ యూనివర్సిటీ కార్యదర్శి అంజలి, నిరసన వలంటీర్ ఎం. జునైద్, అక్రమ నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న న్యాయ బృందానికి చెందిన న్యాయవాది మాణిక్ గుప్తా పాల్గొన్నారు. 'పత్రాల లీకేజీ ఆరోపణలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్నందుకు, ముఖ్యంగా బిహార్‌లోని విద్యార్థి, యువ కార్యకర్తలు, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ఎమ్మెల్యే సందీప్ సౌరవ్, పలువురు ఎఐఎస్‌ఎ కార్యకర్తలు జైలులోనే ఉన్నారని నేహ అన్నారు. ఢిల్లీలో నిరసనకారులను నిర్బంధించడం, వారు గాయపడటం వంటి ఆరోపణలను ఎఐఎస్‌ఎ ప్రముఖంగా ప్రస్తావించింది. అలాగే బిహార్, ఇతర రాష్ట్రాలలో అరెస్టులు, నిర్బంధాల ద్వారా పోలీసులు అణచివేతకు పాల్పడ్డారని వివరాలను వెల్లడించింది. 'శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఎలాంటి అణచివేత ఉండదని మాకు హామీ ఇచ్చారు. అయితే, దేశవ్యాప్తంగా విద్యార్థుల అరెస్టులు, ఏకపక్ష నిర్బంధాలు, బెదిరింపులు కొనసాగడాన్ని మేము చూస్తున్నాము. ప్రభుత్వం తన హామీలను నిలబెట్టుకోవాలి, నిర్బంధంలో ఉన్నవారిని విడుదల చేయాలి మరియు విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి' అని నేహ అన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, కార్యకర్తలపై పోలీసుల చర్యలను నిరోధించాలని ఎఐఎస్‌ఎ కేంద్రాన్ని కోరింది. నిరసనలకు సంబంధించి నిర్బంధంలో ఉన్నవారిని తక్షణమే విడుదల చేయాలని కూడా పిలుపునిచ్చింది.

## పోలీసుల చర్యపై చర్చించేందుకు..

# కాంగ్రెస్ ఎంపీల నోటీసులు

**న్యూఢిల్లీ :** 'నీట్' పేపర్ లీక్ అంశంపై నిరసన చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం జరిగిందన్న ఆరోపణలపై తక్షణమే చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సభ్యులు మంగళవారం పార్లమెంట్ ఉభయ సభలలో నోటీస్ సమర్పించారు. కఠినమైన శిక్షలతో పేపర్ లీక్ నిరోధక చట్టాన్ని బలోపేతం చేసేందుకు కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లు మంగళవారం చర్చకు రానున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ ఎంపీలు రణదీప్ సుర్జేవాలా, సయ్యద్ నసీర్ హుస్సేన్ రాజ్యసభలో రూల్ 267కింద నోటీసు ప్రవేశపెట్టగా, లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గౌరవ్ గొగోయ్, చండీగఢ్ ఎంపి మనీష్ తివారీ ముఖ్యమైన ఈ అంశంపై చర్చ చేపట్టేందుకు నిర్ణీత సభాకార్యలాపాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ దిగువసభలో వాయిదా నోటీసులు ప్రవేశపెట్టారు. విద్యార్థులపై పోలీసుల చర్యకు సంబంధించి హోం మంత్రి అమిత్‌షా జవాబుదారీతనం వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. నిరసన చేస్తున్న విద్యార్థులపై పెలెట్ గన్స్, లాఠీలు ఉపయోగించారన్న ఆరోపణలపై పార్లమెంట్‌లో ఒక ప్రకటన చేయాలని కూడా వారు ఆయనను కోరుతున్నారు.'2026 జులై 20న ఢిల్లీలో శాంతియుత నిరసన తెలుపుతున్న విద్యార్థులపై జరిగిన దాడి, లాఠీచార్జి, టియర్‌గ్యాస్, పెల్లెట్ గన్‌ల వాడకం, మహిళా విద్యార్థులు, జర్నలిస్టులపై జరిగినట్లు ఆరోపించబడిన దాడిపై తక్షణ చర్చ కోసం ఈ సభ జీరో అవర్‌ను, ప్రశ్నోత్తరాలకు సంబంధించిన నియమాలను, ఆనాటి ఇతర కార్యకలాపాలను నిలిపివేయాలి' అని ఆ నోటీస్‌లో పేర్కొన్నారు.'బలప్రయోగం అధికారమైనదేనా అనే విషయంపై బాధ్యులను గుర్తిస్తూ స్పష్టత ఇవ్వాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నుంచి ఒక ప్రకటన కోరడం, ప్రభుత్వ స్పందన, జవాబుదారీతనం, భవిష్యత్తు కోసం రక్షణ చర్యలపై ప్రధానమంత్రి నుంచి ఒక ప్రకటన కోరడ. ఈ తీవ్రమైన ఆందోళనల దృష్ట్యా, సభ తక్షణమే పరిశీలన జరపాల్సిన అవసరం ఉంది' అని కాంగ్రెస్ ఎంపీలు సుర్జేవాలా, హుస్సేన్ జారీ చేసిన నోటీసులో పేర్కొన్నారు. ఈ సంఘటన రక్షణకు సంబంధించిన తీవ్రమైన సమస్యలను లేవనెత్తుతుందని, ప్రజాస్వామ్య హక్కులు, శాంతి భద్రతల సంస్థల ప్రవర్తన, నిరసనకారులపై తీసుకున్న చర్యలకు జవాబుదారీతనం వంటి అంశాలను గొగోయ్ ప్రస్తావించారు. 'అధిక బలప్రయోగం జరిగినట్లు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ అంగీకరించారు. హింసాకాండ అనంతరం నిరసనకారులు, భద్రతా సిబ్బంది సహా 170మందికి పైగా ఆసుపత్రులకు తరలించబడ్డారని, సుమారు 60నుంచి 90మంది వరకు గాయపడిన నిరసనకారులకు వైద్యసహాయం అవసరమైందని నివేదికలు సూచిస్తున్నాయి' అని గొగోయ్ నోటీసులో పేర్కొన్నారు. ఢిల్లీ పోలీసులు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిపాలనా నియంత్రణలో పనిచేస్తున్నందున, అటువంటి చర్యలకు అధికారం ఇవ్వడంతో పాటు, వాటి అమలుకు బాధ్యత వహించే అధికారుల జవాబుదారీతనంతో సహా మంత్రిత్వ శాఖ బాధ్యతను పరిశీలించడం తప్పనిసరి' అని గొగోయ్ అన్నారు.

## ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డులో అగ్నిప్రమాదం..

**ఛత్తీస్‌గఢ్ :** ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మెమోరియల్ హాస్పిటల్ (మేకహారా) ఎమర్జెన్సీ విభాగంలో మంగళవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఎమర్జెన్సీ వార్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగి దట్టమైన పొగ చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించడంతో ఆసుపత్రి వర్గాలు అప్రమత్తమయ్యాయి. ముందస్తు భద్రతా చర్యగా వైద్యులు, సిబ్బంది మరియు భద్రతా సిబ్బంది రోగులను, వారి సహాయకులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సమాచారం అందుకున్న వెంటనే రెండు అగ్నిమాపక యంత్రాలు, పోలీసులు, జిల్లా అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని తక్కువ సమయంలోనే మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. ఎయిర్ కండిషనర్‌లో సాంకేతిక లోపం లేదా షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తుండగా, పూర్తి వివరాల కోసం దర్యాప్తునకు ఆదేశించారు.

## జీహాద్ ఒక్కటే మార్గం: హెజ్బొల్లాకు మొజ్తాబా ఖమేనీ పిలుపు

అమెరికాతో ఒప్పందంలో లెబనాన్ రక్షణే ప్రధాన షరతు


హెజ్బొల్లాకు రాసిన లేఖలో మొజ్తాబా ఖమేనీ ఉద్ఘాటన



**టెహ్రాన్:** అమెరికా–ఇజ్రాయెల్ దేశాలపై జీహాద్–ప్రతిఘటన పోరాటం తప్ప వేరే మార్గం లేదని ఇరాన్ సర్వోన్నత నాయకుడు మొజ్తాబా ఖమేనీ (56) హెజ్బొల్లా సైన్యాలకు రాసిన ఒక లేఖలో స్పష్టం చేశారు. ఆయన లేఖను ఇరాన్ మీడియా సోమవారం రాత్రి ప్రసారం చేసింది. హెజ్బొల్లా సెక్రటరీ జనరల్ షేక్ నయామ్ ఖాస్సెమ్, ఇతర పోరాట యోధులకు ఎక్స్ వేదికగా ఈ లేఖను మొజజ్తాబా ఖమేనీ షేర్ చేశారు. అమెరికాతో ఇరాన్ యుద్ధం ముగిసిపోవాలంటే ఎలాంటి ఒప్పందం చేసుకున్నాగానీ లెబనాన్‌నుండి ఇజ్రాయెల్ వైదొలగడమే ప్రధాన షరతుగా ఉంటుందని చెప్పారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ దురాక్రమణను అంతం చేయాలని పిలుపు ఇచ్చారు. లెబనాన్ రక్షణ ఇరాన్ ప్రధాన లక్ష్యమని ఖమేనీ ఆ లేఖలో స్పష్టం చేశారు. హెజ్బొల్లా యోధుల రక్షణను ఒక వ్యూహాత్మక ఆదేశంగా ఇరాన్ భావిస్తోందని పేర్కొన్నారు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ పట్ల హెజ్బొల్లా యోధులు అచంచలమైన విశ్వాసం,వినయ విధేయతలలు ప్రకటిస్తూ హెజ్బొల్లా రాసిన లేఖకు తిరిగి సమాధానంగా ఖమేనీ లేఖ రాస్తూ, వారి గొప్పతనాన్ని ప్రశంసించారు. లెబనాన్‌లోని ఆక్రమిత ప్రాంతాల నుండి ఇజ్రాయెల్ సైన్యాలు పూర్తిగా వైదొలగి తమ కార్యకలాపాలను నిలిపివేసినప్పుడే యుద్ధం ముగుస్తుందని ఖమేనీ వారికి భరోసా ఇచ్చారు. లెబనాన్ రక్షణలో ఎల్లప్పుడూ ఇరాన్ అండగా నిలబడుతుందని హామీ ఇచ్చారు. ఇజ్రాయెల్ తన మొండి వైఖరిని కొనసాగిస్తే, యుద్ధమే మార్గమని భావిస్తే అమెరికా–ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా జీహాద్ చేయడం తప్ప మరో మార్గం లేదని ఆ లేఖలో స్పష్టం చేశారు. అమెరికా ప్రభుత్వ నిరంకుశత్వం,దురాక్రమణతోపాటు మనుషుల ప్రాణాలు తీస్తూ తర తరాలను నాశనం చేసే నేరపూరిత జియోనిస్టులతో ప్రపంచం ఈనాడు విసిగిపోయిందని,ఈ దశలో జీహాద్–ప్రతిఘటన తప్ప ముందుకు వెళ్ళడానికి మరో మార్గం మిగలలేదని తన లేఖలో ఖమేనీ రాశారు. ఇజ్రాయెలీ దురాక్రమణను వ్యతిరేకిస్తూ హెజ్బొల్లా సైనికులు జీహాద్ పోరాటంలో ఒక శిలలా నిలబడి మార్గదర్శనం చేస్తున్నారని ప్రశంసించారు. స్వేచ్ఛకోసం దేశాలు చేస్తున్న పోరాటానికి ఇది స్ఫూర్తిగా ఉంటుందని పేర్కొన్నారు.

## జపాన్‌లో భూకంపం: కుప్పకూలిన షాపింగ్ మాల్

- శిథిలాల్లో చిక్కుకుని అనేక మంది మృతి
- 3,600 మందితో ముమ్మరంగా సహాయక చర్యలు





**టోక్యో:** జపాన్, చైనా దేశాల్లో మంగళవారం మరోసారి భూకంపం సంభవించింది. జపాన్ నైరుతీ ప్రాంతంలో 7.1 తీవ్రతతో భూకంపం సంభవించడంతో సునామీ హెచ్చరిక జారీ చేశారు. ఈ తీవ్ర భూకంపంతో రోడ్లు,మౌలిక సదుపాయాలు ధ్వంసం కావడంతోపాటు భవంతులు కూడా కూలిపోయాయి. ముఖ్యంగా కుమామోటో ప్రాంతంలో ఉన్న ఏయాన్ షాపింగ్ మాల్‌లో పై అంతస్తులు పాక్షికంగా కుప్పకూలిపోవడంతో అనేకమంది వినియోగదారులు శిథిలాల్లో చిక్కుకుపోయారు. వినియోగదారులు,సిబ్బంది శిథిలాల్లో చిక్కుకున్నారు. షాపింగ్ మాల్‌లో పేలుడు కూడా సంభవించిందని ప్రత్యక్షసాక్షులు చెప్పారు. శిథిలాల్లో చిక్కుకుని అనేకమంది మరణించి ఉంటారని భయపడుతున్నారు. ఇప్పటికే 50 మంది గాయపడినట్లు ప్రభుత్వం పేర్కొంది. 3,600 మంది సహాయ సిబ్బందిని ఆ ప్రాంతానికి తరలించారు. వారంతా మానవ ప్రాణాలు కాపాడాలనే లక్ష్యంతో సహాయ చర్యలు కొనసాగిస్తున్నారు. జపాన్ ప్రధానమంత్రి తకైచీ కూడా దీనిపై స్పందించారు. మౌలిక సదుపాయాల నష్టాన్ని ధృవీకరించారు.

ఈ భూకంప ప్రభావంతో వేలాది ఇళ్ళకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కుమామోటో ప్రాంతంలో 45,000 ఇళ్ళు, ఇతర కేంద్రాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఐతే ఈ ప్రాంతంలో ఉన్న మూడు అణు రియాక్టర్లు సాధారణస్థాయిలోనే పనిచేస్తున్నాయని సంబంధిత అధికారులు చెప్పారు. అదేవిధంగా చైనాలోని మారు మూల ఉన్న క్వింగ్ హై రాష్ట్రంలో కూడా మంగళవారం 20 నిమిషాల వ్యవధిలో రెండుసార్లు భూకంపం వచ్చింది. ఈ భూకంపం తీవ్రత ఒకసారి 5.8 గా మరోసారి 5.7గా నమోదైంది. ఈ భూకంప కేంద్రం చైనాలో కేవలం 10 కి.మీ లోతున మాత్రమే కేంద్రీకృతమై ఉందని వా తావరణశాఖ అధికారులు ప్రకటించారు. క్వింగ్ హై ప్రాంతంలో తరచు భూకంపాలు సంభవిస్తూ ఉంటా యి. భూమిక కంపించినప్పుడు కొండల మీద నుండి భారీస్థాయిలో ధూళి గాలిలోకి లేవడం సిసిటీవీలలో నమోదైంది.

క్యుషు ద్వీపంలో మొదట భూకంపం రావడంతో జపాన్‌కు చెందిన సొంత ప్రకంపనల రిక్టర్ స్కేలు షిండోపై ఈ తీవ్రత 7.1 గా నమోదైంది. దీంతో సునామీ హెచ్చరికను వాతావరణశాఖ విడుదల చేసింది. సముద్రంలో సునామీ తాలూకూ అలలు మూడు అడుగుల ఎత్తున ఎగసిపడుతున్నాయని తెలియజేసింది. అణువిద్యుత్ కేంద్రాలవల్ల ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తలేదని అణు నియంత్రణ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. భూకంపం వచ్చిన తర్వాత ఎన్‌హెచ్‌కె న్యూస్‌రూమ్ నుండి ఒక ప్రతినిధి మాట్లాడుతూ, భూమి ఇంకా కంపిస్తూనే ఉందని, తమ న్యూస్ రూమ్ కూడా తీవ్రంగా ఊగిపోయిందని, తాను నేలమీద నిలబడలేకపోయానని చెప్పారు. గత నెల 25వ తేదీన కూడా ఉత్తర జపాన్‌లో 7.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. కానీ ఎలాంటి నష్టం వాటిల్లలేదు. అంతకుముందు 2016 లో నాలుగురోజుల వ్యవధిలో రెండుసార్లు భూకంపం తీవ్రస్థాయిలో సంభవించింది. ఈ భూకంపాలవల్ల 273 మంది మరణించగా, 2,800 మంది గాయపడ్డారు. ప్రపంచంలో అత్యధికంగా భూకంపాలు వచ్చే దేశాలలో జపాన్ ఒకటి. జపాన్‌లో ఒక్క ఏడాదికి 1500 పైగా భూకంపాలు వస్తాయి. భూకంపాలు క్రియాశీలంగా వచ్చే ప్రాంతంలో జపాన్ ఉండటంవల్ల ఈ పరిస్థితి వచ్చింది. 12 కోట్లమంది జనాభా ఉన్న ఈ ప్రాంతంలో ప్రతి సంవత్సరం వందలసార్లు భూమి కంపిస్తూ ఉంటుంది. 2011లో 9.0 తీవ్రతతో సంభవించిన ఘోర భూకంపంలో 18,500మంది మరణించడం లేదా గల్లంతు కావడం జరిగింది. ఇప్పటికీ ఈ ఘోర విలయాన్ని జపనీయులు మరచిపోలేదు.

## మా వద్ద పుష్కలంగా ఆయుధాలున్నాయ్: ట్రంప్

ఒప్పందానికి రాకపోతే మళ్ళీ దాడి: ఇరాన్‌కు హెచ్చరిక



**వాషింగ్టన్:** అమెరికా వద్ద పుష్కలంగా ఆయుధాలున్నాయని ట్రంప్ చెప్పారు. ప్రపంచంలో ఎవ్వరి దగ్గరా లేనన్ని ఆయుధాలు అమెరికా వద్ద అవసరానికి మించి నన్ని ఉన్నాయని వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఇరాన్ వ్యాప్తంగా 13,000కు పైగా లక్ష్యాలపై తమ దళాలు దాడులు చేశాయని చెప్పారు. 1700కు పైగా ఇరాన్ డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులను కూల్చివేశామని.1000కు పైగా తోమాహాక్‌లను ప్రయోగించామని చెప్పారు. అమెరికాతో ఒక ఒప్పందానికి రాకపోతే మళ్ళీ దాడులు ప్రారంభిస్తామని ఇరాన్‌కు హెచ్చరిక చేశారు. ఈ కాల్పుల విరమణ ఒక మంచి అవకాశమన్నారు.ఇరాన్‌పై వరుసగా 13 రాత్రులు దాడులు చేసిన అమెరికా గడచిన శనివారం(జులై 25) ఆకస్మికంగా యుద్ధం ఆపేసింది. చర్చలకు వీలు కలిగించేలా యుద్ధం ఆపేసినట్లు ట్రంప్ చెప్పినప్పటికీ, సెంట్‌కామ్ అధిపతి డాన్ కైన్ మాత్రం ఆయుధ సామాగ్రి నిల్వలు తరిగిపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఆందోళనను ట్రంప్ తోసిపుచ్చారు. ఆ మధ్య పెన్సిల్వేనియా సదస్సుకు వెళ్ళినప్పుడు ఆయుధాలు పుష్కలంగా తయారు చేయాలని పరిశ్రమాధిపతులను ట్రంప్ కోరారు. ఈ దశలో ఎర్ర సముద్రంలో కొత్త యుద్ధ రంగానికి తెర లేచింది. ఐతే హౌతీల యుద్ధ ప్రకటనను ట్రంప్ పెద్దగా పట్టించుకోవడంలేదు.

ఇదిలా ఉండగా, ఎర్ర సముద్రంలో హోర్ముజ్ తరహా పోరాటాన్ని కొనసాగిస్తామని హౌతీ తిరుగుబాటు సైన్యాలు ప్రకటించాయి. సౌదీ అరేబియా తమపై దిగ్బంధనం ఎత్తివేసే వరకూ పోరాటం కొనసాగుతుందని ఉద్ఘాటించాయి. హోర్ముజ్ జలసంధిలో అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ సైన్యాలు చేసిన పోరాటాన్ని యథాతథంగా ఎర్ర సముద్రంలో అమలు చేస్తామని హౌతీల నాయకుడు ప్రకటించారు. ఇప్పటికే ఎర్ర సముద్రంలో రెండు సౌదీ అరేబియా చమురు నౌకలపై దాడిచేసి వాటిని దగ్ధం చేశాయి. దీంతో ఎర్ర సముద్రంలో నౌకల రాకపోకలు బాగా తగ్గిపోయాయి. సౌదీఅరేబియా వాణిజ్యానికి ఎర్ర సముద్రం ఒక కీలక మార్గం కావడంతో ఆ దేశానికి పెద్ద సమస్య ఎదురైంది.

## ఆగస్టులో లెబనాన్–ఇజ్రాయెల్ చర్చలు

**వాషింగ్టన్:** లెబనాన్–ఇజ్రాయెల్ మధ్య మరో విడత చర్చలు ఆగస్టు నాలుగో తారిఖు నుండి ఆరో తారీఖు వరకూ రోమ్ నగరంలో జరుగుతాయి. యుద్ధాన్ని శాశ్వతంగా విరమించి శాంతి స్థాపించేందుకు వీలుగా అమెరికా మధ్యవర్తిత్వంతో ఇప్పటికే పలు విడతలుగా లెబనాన్–ఇజ్రాయెల్ మధ్య చర్చలు జరిగాయి. బఫర్ జోన్లు ఖాళీచేసి లెబనాన్ సైన్యాలకు అప్పగించే ప్రక్రియ ప్రారంభం అవుతుందని ఇజ్రాయెల్ ప్రకటనలు చేస్తున్న తరుణంలో ఈ సమావేశానికి ముహూర్తం ఖరారైంది. అనేకసార్లు చర్చల తర్వాత జూన్ 26వ తేదీన లెబనాన్–ఇజ్రాయెల్–అమెరికా మధ్య ఒక నిబంధనల చట్రంపై సంతకాలు జరిగాయి. ఈ నిబంధనల ఒప్పందం ఆధారంగా ఇరు పక్షాలు చర్చలు ముందుకు తీసుకువెళతాయి. దక్షిణ లెబనాన్‌లో ఇప్పటికే ఒక పైలట్‌జోన్‌ను ఇజ్రాయెల్ స్వాధీనం చేసింది. ఆ దశలో లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్స్ అమెరికా వెళ్ళి ట్రంప్‌తో చర్చలు జరిపారు. దాని కొనసాగింపుగా రోమ్ చర్చలు ముందుకు వెళతాయి. ఈ మేరకు ఇజ్రాయెల్ సైన్యాలు ఖాళీ చేసిన ప్రాంతాలను లెబనాన్ సైన్యాలు తమ అధీనంలోకి తెచ్చుకుంటాయి. లెబనాన్ సైన్యాలు గతనెల 20 నుండి శ్రీఫా,ఔతార్ అల్–షుర్భియా,ఫ్రౌన్ అనే మూడు గ్రామాలను స్వాధీనం చేసుకునే ప్రక్రియ ప్రారంభించాయి. తమకు ఇష్టమైనంతకాలం లెబనాన్‌లో తమ సైన్యాలు ఉంటాయని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి తరచు ప్రకటనలు చేస్తున్నారు. హెజ్బొల్లాను నిరాయుధులను చేయడమే తమ లక్ష్యమని, లేకపోతే ఎలాంటి కాలపరిమితి లేకుండా తమ సరిహద్దుల నుండి లెబనాన్‌లోకి ఆరుమైళ్ళు లోపలికి వెళ్ళిన ఐడిఎఫ్ సైన్యాలు అక్కడే తిష్టవేసి ఉంటాయని నెతన్యాహూ హెచ్చరిస్తున్నారు. పశ్చిమాసియాలో యుద్ధం ఆగిపోవాలంటే లెబనాన్‌ను ఇజ్రాయెల్ పూర్తిగా ఖాళీ చేసి వెళ్ళిపోవాలని మొజ్తాబా ఖమేనీ తన తాజా లేఖలో హెజ్బొల్లాకు చెప్పారు.

## అక్టోబరు 27న ఇజ్రాయెల్ ఎన్నికలు
## నెతన్యాహూ–ఐసెన్‌కోట్ మధ్య పోటీ



**జెరూసలెం:** పీకలోతు యుద్ధాల్లో మునిగి ఉన్న ఇజ్రాయెల్‌లో ఈ ఏడాది అక్టోబరు 27వ తేదీన సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో ఈసారి ఇజ్రాయెల్ సైనిక దళాల మాజీ అధిపతి (ఐడిఎఫ్) ఐసెన్‌కోట్ ప్రధానమంత్రి అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. నెతన్యాహూతో సమ ఉజ్జీగా నువ్వా? నేనా? అనే రీతిలో పోటీ పడేందుకు ఆయన బరిలోకి దిగుతున్నారు. ఇజ్రాయెల్ పార్లమెంటు క్నెసెట్ ప్రధానమంత్రిని ఎన్నుకుంటుంది తప్ప, ప్రజలు నేరుగా ఓట్లు వేసి ప్రధానమంత్రి అభ్యర్థిని ఎన్నుకునే సంప్రదాయం ఇజ్రాయెల్‌లో లేదు. క్నెసెట్‌లో ఏ పార్టీ అయినా మెజార్టీ సంపాదించి ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే మొత్తం 120 స్థానాలకుగాను 61 స్థానాలను గెలుచుకోవాలి. నెతన్యాహూ వ్యతిరేక కూటమి 60 సీట్లు గెలుచుకుంటుందని, నెతన్యాహూ లికుడ్ పార్టీ అనుకూల పార్టీలు 50 స్థానాలు గెలుచుకుంటాయని అరబ్ పార్టీలు మరో పది స్థానాలు గెలుచుకుంటాయని ఛానెల్–12 సర్వే అంచనా వేసింది. ఐసెన్‌కోట్‌కు చెందిన యషార్ పార్టీ 23 సీట్లతో పార్లమెంటులో అతిపెద్ద పార్టీగా అవతరిస్తుందని నివేదిక తెలిపింది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినాగానీ మిత్రులను కూడదీసుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందే. దేశంలో జరిగిన తాజా సర్వేలో 38 శాతం ప్రజలు నెతన్యాహూ ప్రధానమంత్రి పదవిలో కొనసాగాలని కోరుకుంటుండగా,మరో 38 శాతం ప్రజలు అంతే బలంగా ఐసెన్ కోట్ దేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకుంటే బాగుంటుందని భావిస్తున్నారు. ఈసారి ఎన్నిల్లో ఇజ్రాయెల్ భద్రత–దేశంలో అంతర్గత సంస్కరణలే ప్రధాన ప్రచారాంశంగా తెరమీదకు రానున్నాయి. ఈనెలారంభంలో ఛానెల్–12 నిర్వహించిన సర్వేలో 43 శాతం ప్రజలు ఐసెన్ కోట్‌ను ఇష్టపడ్డారు. 34 శాతం మంది మాత్రమే నెతన్యాహూ వైపు మొగ్గుచూపారు. కానీ ఆ తర్వాత సర్వేలో ఐసెన్ కోట్ కంటే నెతన్యాహూకు ప్రజాదరణ పెరిగింది.

అన్నిటికంటే ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ ఈ యుద్ధంలో ఇజ్రాయెల్‌ను మోసం చేశారని, తన ప్రయోజనాలకు ఇజ్రాయెల్‌ను బలిపెట్టారని ఆ దేశ ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు. ట్రంప్ వ్యతిరేకత కూడా ఆ దేశంలో చాలా బలంగా కనిపిస్తోంది. 2022 డిసెంబరు 29న ఏర్పడిన ఇజ్రాయెల్ ప్రస్తుత 37వ మంత్రి వర్గం ఐదు పార్టీల కూటమితో ఏర్పడింది. ఈ కూటమికి నెతన్యాహూ సారథ్యంలోని లికుద్‌పార్టీ 32 స్థానాలతో నాయకత్వం వహిస్తోంది. ఈ పార్టీలన్నీ కలిసి 60 స్థానాలు గెలుచుకున్నాయి. ఇక ప్రతిపక్షంలో మరో 14 పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. 4,500 మంది సభ్యులున్న లికుద్ పార్టీ కేంద్ర కమిటీ మొత్త పోటీ చేసే సీట్లలో ఎనిమిది స్థానాలను నెతన్యాహూకు వదిలేశారు. ఈ స్థానాల నెతన్యాహూ స్వయంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ముఖ్యంగా ఇటీవల బయట నుండి వచ్చి పార్టీలో చేరినవారికి ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది.

## రూ.కోట్ల దందా..!

(మొదటి పేజీ తరువాయి)

చెందిన శ్రీకాంత్ అనే యువకుడికి కారుణ్య నియామకం ఇప్పిస్తానని నమ్మించి ఏకంగా రూ. 20 లక్షలు గుంజడం ఈ దందా తీవ్రతకు అద్దం పడుతోంది. పని చేయకపోగా, డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే వేధింపులకు గురిచేస్తున్నాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విశ్రాంత ఇంజనీర్ పెరుమాండ్ల రాజు వద్ద నుంచి రూ. 10 లక్షలు దండుకోగా, సూరపనేని కృష్ణ తేజ (రూ. 1,50,000), రాజు (రూ. 1,50,000), ప్రవీణ్ (రూ. 1,50,000), పెంద్రి సతీష్ రెడ్డి (రూ. 1,00,000), రాజమల్లేష్ (రూ. 1,00,000), చిలువేరు సదానందం (రూ. 1,00,000), ప్రభాకర్ (రూ. 90,000), మహేందర్ రెడ్డి (రూ. 50,000), ఎన్ సంతోష్ (రూ. 50,000), శరత్ (రూ. 50,000), చివరికి కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్ రాజేష్ (రూ. 10,000) నుంచి కూడా వసూళ్లకు తెగబడ్డాడు.

**ఆర్థిక అక్రమాలు, ఐపిలు... మళ్లీ పదవులా?**
శంకర్ రావుకు గతంలోనూ ఇటువంటి ఆర్థిక అక్రమాలకు పాల్పడిన చరిత్ర ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో శ్రీరాంపూర్ ప్రాంతంలో పలువురి వద్ద డబ్బులు వసూలు చేసి, కేసులు కావడం, దాడికి దిగడంతో పరారై ఐపీ (ఇన్సాల్వెన్సీ పిటిషన్) పెట్టిన దాఖలాలు ఉన్నాయని కార్మిక వర్గాలు గుర్తుచేస్తున్నాయి. కొన్నాళ్ల పాటు పరారీలో ఉండి, ఆ తర్వాత మళ్లీ సింగరేణిలో విధుల్లో చేరిన ఆయనకు సంఘ ంలో తిరిగి బాధ్యతలు అప్పగించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

**తిరగబడిన బాధితులు... ఆధారాలతో నిలదీత**
ఏళ్లు గడుస్తున్నా పనులు కాకపోవడం, ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు నస్పూర్ ప్రెస్ క్లబ్ వద్ద శంకర్ రావును నిలదీశారు. బాధితుల ఆగ్రహంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. శంకర్ రావు సంతకాలు చేసి ఇచ్చిన ప్రామిసరీ నోట్లు, ఖాళీ చెక్కులు, బాధిత కార్మికులు పోలీసు స్టేషన్లలో ఇచ్చిన ఫిర్యాదుల ప్రతులు ఈ అక్రమ వసూళ్లకు తిరుగులేని ఆధారాలుగా బయటపడ్డాయి.

**సార్వత్రిక, గుర్తింపు సంఘం ఎన్నికలపై తీవ్ర ప్రభావం!**
కార్మికుల హక్కుల కోసం పోరాడాల్సిన సంఘాలు కొందరి చేతుల్లో వ్యక్తిగత దందాలకు వేదికలుగా మారడంపై కార్మిక లోకం మండిపడుతోంది. ఇటువంటి వివాదాస్పద శక్తుల వల్ల రానున్న సార్వత్రిక ఎన్నికలతో పాటు గుర్తింపు సంఘం ఎన్నికల్లోనూ యూనియన్‌కు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రజాప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యేలు తక్షణమే కల్పించుకుని ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఎన్నికల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఈ దందాపై పోలీసులు, సింగరేణి యాజమాన్యం సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కార్మిక లోకం డిమాండ్ చేస్తోంది.

## నిష్పక్షపాత దర్యాప్తు

(మొదటి పేజీ తరువాయి)

స్వతంత్ర దర్యాప్తు అవసరమని తెలియజేసింది. 'ఎవరైతే దురాగతాలకు పాల్పడి చట్టాన్ని ఎవరైతే తమ చేతుల్లోకి తీసుకున్నారో, వారిపై తప్పక చర్యలు తీసుకోవాలి' అని సిజెఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది.పెల్లెట్ గన్‌లు, మేకులు ఉన్న లాఠీలు, ఎలక్ట్రిక్ లాఠీల వాడకం వల్ల పలువురు విద్యార్థులు, యువతులకు తీవ్రమైన, ప్రాణాంతకమైన గాయాలైనట్లు వచ్చిన ఆరోపణలను ధర్మాసనం పరిగణనలోనికి తీసుకుంది. అన్ని ఆరోపణలపై ఒక టాస్క్‌ఫోర్స్ ద్వారా ఒక స్వతంత్ర, పారదర్శకతతో కూడిన సమగ్ర విచారణ జరిపించాలని యోచిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. అవసరమైతే రిటర్డ్ సుప్రీంకోర్టు జడ్జి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేస్తామని జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. అంతేకాకుండా, 250మంది పోలీసులపై జరిగిన దాడులు విద్యార్థులు చేశారా? లేదా, కొందరు దుండగులు ఈ దుశ్యచర్యకు పాల్పడ్డారా? అనే విషయ నిర్ధారణకు కూడా విచారణ అవసరమని ధర్మాసనం తెలిపింది. నిరసన జరిగిన రాష్ట్రాలకు, ఆ నిరసనలకు సంబంధించిన సిసిటివి ఫుటేజ్, డ్రోన్ రికార్డింగ్‌లు, బాడీ కెమెరా ఫుటేజీ, వైర్ లెస్ కమ్యూనికేషన్ రికార్డులు, పిసిఆర్ లాగ్స్, ఇతర డిజిటల్ సాక్ష్యాలను భద్రపరచాలని ధర్మాసనం పలు మధ్యంతర ఆదేశాలను జారీ చేసింది.నిరసనకారులపై సేకరించిన డిజిటల్ డేటాను భద్రపరచాలని,అయితే, డేటాను బహిరంగంగా వెల్లడించకూడదని కూడా అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. నిరసన చేస్తున్న విద్యార్థులను బలవంతపు చర్యల నుంచి రక్షిస్తూనే, నేరచరిత్ర ఉన్న వారికి ఇది వర్తించదని ధర్మాసనం స్పష్టంచేసింది. ధర్మాసనం పిటిషన్లలో లేవనెత్తిన ఆరోపణలకు సంబంధించిన విషయమై ఢిల్లీ, మహారాష్ట్ర, బిహార్, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధానకార్యదర్శుల నుంచి కూడా స్పందనలను కోరింది. 'ప్రాథమికంగా ఈ ఆరోపణలపై నిష్పక్షపాతమైన, స్వతంత్ర దర్యాప్తు జరపాలి. ఈ దర్యాప్తులో గాయపడిన 200మందికి పైగా పోలీసు సిబ్బంది కుటుంబాల ఆందోళనలను కూడా పరిగణలోనికి తీసుకోవాలి' అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. స్వతంత్ర కమిటీ లేదా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటును పరిశీలించే ముందు కేంద్రం, సంబంధిత రాష్ట్రాలు తమ వాదనలను రికార్డులో ఉంచాలని ఆదేశించినట్లు ధర్మాసనం తెలిపింది. 'నిర్వచించిన నియమావళి ఉల్లంఘన జరిగినప్పుడు చట్టం తన పని తాను చేయాల్సి ఉంటుంది' అని సుప్రీంకోర్టు పేర్కొంది. 'సిట్' కూర్పు వివరాలను తదుపరి దశలో వెల్లడిస్తామని బెంచ్ పేర్కొంది. కాలక్రమేణా న్యాయస్థానాలు రూపొందించిన అన్ని చట్టపరమైన సూత్రాలను క్రోడీకరించి, నిరసనల పరిస్థితిని ఇకమీదట నియంత్రించే ఏకరీతి నియమావళి సమయం ఆసన్నమైందని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. బాధితుల, న్యాయవాదుల వాదనలను పరిగణనలోనికి తీసుకున్న ధర్మాసనం,నిరసన చేస్తున్న 'నీట్' విద్యార్థులపై నిష్పక్షపాత విచారణ జరగాలని పేర్కొంది. 'నిర్వచించిన నియమావళిని ఉల్లంఘించినప్పుడు, చట్టం దానిని తప్పక పర్యవేక్షించాలి' అని బెంచ్ తెలిపింది. కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తా, విద్యార్థులు పోలీసు సిబ్బందిపై హింసకు పాల్పడ్డారని, అయితే, కొందరు దుండగులు హింసాత్మక సంఘటనలకు పాల్పడ్డారని తెలిపారు. హత్య, అత్యాచారం, ఎన్‌డిపిఎస్ కేసుల్లో ప్రమేయం ఉన్న దుండగులు, విద్యార్థుల నిరసనల్లోకి చొరబడి పోలీసు సిబ్బందిపై హింసకు పాల్పడ్డారని, విద్యార్థులు శాంతియుత నిరసనల కోసమే గుమిగూడారని, నిరసన తెలిపే హక్కు వారికి ఉందని సొలిసిటర్ జనరల్ మెహ్‌తా ధర్మాసనానికి వివరించారు.

## విపక్షాలు పట్టు

(మొదటి పేజీ తరువాయి)

గందరగోళం మధ్య, కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి (సవరణ) బిల్లును ప్రవేశపెట్టారు. 2006లో చేసిన (అసలు చట్టాన్ని) మెరుగుపరచడం, సవరించడం అవసరం అని మాంఝీ అన్నారు. ప్రతిపక్ష సభ్యులు సృష్టించిన గందరగోళం కారణంగా, 'దేశ గౌరవానికి అవమానాల నివారణ చట్టం, 1971'ని సవరించడానికి ఉద్దేశించిన ఈ జాతీయ గౌరవాల బిల్లుపై సభ చర్చను చేపట్టలేకపోయింది. అంతకు ముందు నీట్ పేపర్ లీక్ నిరసనకారులపై పోలీసు సిబ్బంది బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై ప్రతిపక్ష పార్టీలు నిరసన తెలపడంతో, మధ్యాహ్న భోజనానికి ముందు జరిగిన సమావేశంలో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకుండానే రాజ్యసభను వాయిదా వేశారు. అధికారిక పత్రాల జాబితాను సభలో ప్రవేశపెట్టిన వెంటనే గందరగోళం చెలరేగింది. నీట్ పేపర్ లీక్ అంశంపై తమ వివిధ డిమాండ్లను వినిపించేందుకు ప్రతిపక్ష ఎంపిలు లేచి నిలబడ్డారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు వచ్చి పోలీసుల చర్యలపై వివరణ ఇవ్వాలని కూడా వారు డిమాండ్ చేశారు.

## సవరణలెందుకు?

(మొదటి పేజీ తరువాయి)

సవరణలు తీసుకురావడం ప్రచార ఆర్భాటం తప్ప మరేమీ కాదని, ఇలాంటి చర్యల ద్వారా ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టలేరన్నారు. విద్యారంగంలో నిజమైన సంస్కరణలు తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైందనడానికి ఈ పై పై సవరణలే ఒక తార్కాణమని విమర్శించారు.

రెండేళ్ళక్రితం చట్టాన్ని తీసుకువచ్చినప్పుడు దానిని చరిత్రాత్మకమైనదిగా అభివర్ణించారని, మరి ఈ చట్టం అంత సమర్థవంతమైనదైతే ఇంత భారీస్థాయిలో ఇలా సవరణలు తేవాల్సిన అవసరం ఏమిటని నిలదీశారు. విద్యావ్యవస్థ పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని,పట్టించుకోలేదని గౌరవ్ గొగోయ్ విమర్శించారు.పేపర్ లీకేజీలను నివారిస్తామని ఆనాడు చెప్పి విఫలమయ్యారని, ఇప్పుడు సంస్కరణలు లేని సవరణలు తెచ్చి మళ్ళీ విఫలమవుతారని హెచ్చరించారు.ప్రధానమంత్రి హైపవర్డ్ కమిటీ గురించి మాట్లాడుతున్నారని, రెండేళ్ళక్రితం ఇస్రో మాజీ ఛైర్మన్ కె.రాధాకృష్ణన్ నాయకత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ ఏమైపోయిందని ప్రశ్నించారు. నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ నుండి 47 మందిని తొలగించడం,బదిలీ చేయడం చేశామని చెప్పారని, వారు ఎవరో, వారి పేర్లు ఏమిటో చెప్పాలని నిలదీశారు. కానీ వాస్తవం ఏమిటంటే నేషనల్ టెస్టింగ్ ఏజన్సీకి కేటాయించినవారి సంఖ్య కేవలం 34 మాత్రమేననీ, మరి 47 మంది ఎక్కడి నుండి వచ్చారని ప్రశ్నించారు.

''ఒక విఫల చట్టాన్ని తెచ్చి అభాసుపాలైన మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి నేడు తిరిగి సభకు వస్తే ఆయనకు ఎదురువెళ్ళి ఘన స్వాగతం పలుకుతారా?ఆయన పాకిస్థాన్‌పై పోరాడి తిరిగి వచ్చినట్టు స్వాగతం పలికారు...మీరు సిగ్గులేదా?'' అని గౌరవ్ గొగోయ్ బిజెపి ఎంపీలను ప్రశ్నించారు. కోచింగ్ సెంటర్లు, ప్రింటింగ్ ప్రెస్ మాఫియా,పేపర్లు తయారుచేసే వారిపైన దృష్టి కేంద్రకరించే చర్చకు అవకాశం ఇవ్వకుండా ఇన్‌స్టాగ్రామ్‌పై ఎక్కువగా కేంద్రీకరించాలని తన మంత్రివర్గ సహచరులకు ప్రధానమంత్రి మోదీ సలహాలు ఇస్తున్నారని ఘాటు విమర్శలు చేశారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న విద్యార్థులపై పెల్లెట్ గన్స్,ఎలక్ట్రిక్ లాఠీలు ప్రయోగించారని, మహిళల గౌరవానికి భంగం కలిగించేవిధంగా పోలీసులు ప్రవర్తించారని, విద్యార్థుల డిమాండ్లను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని వి మర్శించారు. న్యాయంకోసం విద్యార్థులు వీధుల్లోకి వచ్చారని, వారి ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. పోలీసులను కూడా లెక్కచేయకుండా దేశంలో విద్యార్థులు,యువకులు అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారన్నారు. గుజరాత్, మహారాష్ట్ర, ఢిల్లీ సహా పలు ప్రాంతా ల నుండి విద్యార్థులు ఆందోళనకు తరలివచ్చారని, ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం ఏమిటో చెప్పిన భారతదేశ యువతకు వందనం చేస్తున్నానని గౌరవ్ గొగోయ్ అన్నారు.

నిరసన ప్రదర్శకులపై మేకులున్న లాఠీలు,ఎలక్ట్రిక్‌లాఠీలు ప్రయోగించడం ఎమర్జెన్సీ కాలాన్ని తలపింపజేసిందని సమాజ్‌వాదీపార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. ప్రభుత్వం కలవరపడి కంగారు పడినందువల్లనే విద్యార్థుల డిమాండ్లకు తలవంచిందని విమర్శించారు. దేశంలో మొదటిసారి తల్లితండ్రులు తమ హక్కులకోసం తమ పిల్లలను ఆందోళనకు పంపారని, తల్లిదండ్రుల మద్దతుతో దేశంలో జరిగిన మొదటి ఉద్యమం ఇదేనని అఖిలేశ్ యాదవ్ ప్రశంసించారు. నియామకాల్లో దళితులు,వెనుకబడిన తరగతుల హక్కులను ప్రభుత్వం లాగేసుకుందని, అదేవిధంగా ఉత్తర ప్రదేవ్‌లో కూడా విద్యారంగంలో సంబంధం ఉన్న అన్ని వర్గాలకు చెందినవారికీ ఈ బిల్లు ప్రతులను పంపిణీ చేసి డిసెంబరు ఒకటో తేదీ వరకూ దీనిపై సంప్రదింపులకు అనుమతించాలని ఆర్ఎస్‌పి ఎంపి ఎన్.కె.ప్రేమ్‌చంద్రన్ కోరారు. అంతకుముందు మొదట కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ప్రశ్నాపత్రాల లీకేజీల నివారణ బిల్లుపై చర్చ ప్రారంభిస్తూ, దేశంలో విద్యార్థులు, యువకుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, సవరణల ద్వారా చట్టాలను మరింత కఠినంగా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. పరీక్షల్లో అవకతవకలు నివారించే కార్యాన్ని అంతకుముందు ప్రభుత్వం అసంపూర్ణం గా వదిలేసిందని, మోదీ ప్రభుత్వం 2024 చట్టం ద్వారా దీనిని పూర్తిచేసిందని,ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలలో కూడా పేపర్ లీకేజీ ఘటనలు జరిగాయని జితేంద్రసింగ్ అన్నారు.

**జెన్–జెడ్ హృదయాలు గెలవాలంటే మోదీ మనసు కోణం మార్చుకోవాలి:ప్రియాంక**
ప్రధానమంత్రి నరేంద్రమోదీ మార్చుకోవాల్సింది కెమెరా కోణం కాదని, తన మనసు కోణం మార్చుకోవాలని కాంగ్రెస్‌పార్టీ ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా హితవు చెప్పారు. ప్రభుత్వ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ)సవరణ బిల్లు–2026పై చర్చ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,దేశంలో జనరేషన్–జెడ్ హృదయాలను నరేంద్ర మోదీ గెలుచుకోవాలనుకుంటే ఆయన కెమేరా యాంగిల్స్‌ను మార్చుకుని వీడియోలు చేయడంవల్ల ఉపయోగం లేదని, తన మనసుకోణాన్ని మార్చుకోవాలన్నారు. ''మీ ప్రభుత్వ హయాంలో దేశ యువతకు తీవ్ర అన్యాయం జరిగింది, వాస్తవాన్ని అంగీకరించాలి, ప్రధానమంత్రి తప్పనిసరిగా జరిగిన తప్పులకు బాధ్యత తీసుకోవాలి'' అన్నారు. జులై 20వ తేదీన నిరసన ప్రదర్శకులపై తీవ్రమైన అణచివేత చర్యలు చేపట్టడాన్ని తప్పుపడుతూ, విద్యార్థులపై పెల్లెట్ గన్స్,ఎ.కె–47 లను ఉపయోగించడానికి ఎవరు అనుమతి ఇచ్చారని ప్రశ్నిఅచారు. ఒక యువకుడు లేదా యువతి శరీరంపై పడిన ప్రతి లాఠీ దెబ్బ ఈ ప్రభుత్వ ప్రతిష్ఠను విద్యార్థుల వీపులకంటే ఎక్కువగా దెబ్బతీసిందని హెచ్చరించారు. విద్యార్థులను వీధుల్లోంచి గెంటేయగలరేమోగానీ, వారు అడిగిన ప్రశ్నల నుండి సమాధానం చెప్పకుండా తప్పించుకోలేరన్నారు.గడచిన పది సంవత్సరాలలో దేశంలో 152 ప్రశ్నాపత్రాలు ముందుగానే బహిర్గతమయ్యాయని, కానీ ఏ ఒక్క మాఫియానుగానీ, వ్యక్తినిగానీ శిక్షించలేదని విమర్శించారు.

## పేపర్ లీక్‌కు వేదికలు

(మొదటి పేజీ తరువాయి)

పెట్టి పోయిందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎలాంటి వసతులు లేకుండా, దొం గ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్ కొ ట్టేయాలనుకునే సంస్థలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని సిఎం తెలిపా రు. సక్రమంగా ఉన్న వారికి బకాయిలు చెల్లిస్తామని ఓ ప్రశ్నకు సిఎం సమాధానమిచ్చారు. కెసిఆ ర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, కాంగ్రెస్ ప్రభు త్వం కారణమన్నట్లుగా బిఆర్ఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బిజెపి వంతపాడుతోందని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు బకాయిలపై బిజెపి ఎంపి ఆర్.కృష్ణయ్య ఎందుకు మాట్లాడడం లేదని సిఎం ప్రశ్నించారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఉన్న ఎపిలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచంద్రరావు, ఆర్.కృష్ణయ్యకు సిఎం సూచించారు. గత ప్రభుత్వం బకాయిలే తమకు భారంగా మారాయని, అయినా అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని సిఎం అన్నారు. భవిష్యత్తులో ఏ సంవత్సరానికి సంబంధించిన ఫీజుల మొత్తం అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లిస్తామని, అడ్వాన్స్‌గా బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని సిఎం తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఏటా రూ.2,200 కోట్ల నుంచి రూ.2,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అవసరమవుతాయని సిఎం అన్నారు. క్రమం తప్పకుండా వాటిని చెల్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలు రచించుకుందని, భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య రాష్ట్రంలో ఉండబోదని సిఎం స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనుల విషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సిఎం తెలిపారు. తెలంగాణలో పరిస్థితుల పరిశీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు సిఎం తెలిపారు.

**'హైడ్రా'ను బలోపేతం చేస్తాం**
'హైడ్రా కార్యాచరణపైనా, హైడ్రా నిర్వహిస్తున్న బాధ్యతలపైనా ప్రభుత్వానికి స్పష్టత ఉంది. హైడ్రాపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఇంకా పరిశీలించలేదు. కోర్టు తీర్పును ప్రభుత్వపరంగా సమీక్షిస్తాం. కోర్టు ఆదేశాలను, న్యాయస్థానాన్ని గౌరవిస్తాం. కోర్టు ధిక్కరణ కింద అధికారులను మార్చాలనే నిబంధన ఉంటే, గతంలో సోమేష్ కుమార్‌పై 400 కోర్టు ధిక్కరణ కేసులున్నాయి. అప్పుడు ఎందుకు మాట్లాడలేదు. ఒక అధికారిని ఎక్కడ నియమించాలనేది ప్రభుత్వ విచక్షణాధికారం. దానిని ఎవరూ లాక్కోలేరు'' అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన గొప్ప సంస్కరణ హైడ్రా. అత్యుత్తమ సంస్థల్లో హైడ్రా ఒకటి. హైడ్రా మంచి పనులు చేస్తోంది. ప్రభుత్వ పార్కులు, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా విధి. ఆ పనిని హైడ్రా పకడ్బందీగా చేస్తోంది. హైడ్రా కొనసాగిస్తున్న పనులను భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం'' అని సిఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో చెరువులు, నాలాలు, కుంటలు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ పార్క్‌లను కబ్జాలు పెట్టుకున్నోళ్లు కోర్టులను తప్పుదోవ పట్టించి కోర్టు ధిక్కరణ అంటున్నారని సిఎం విమర్శించారు. బతుకమ్మ కుంటలాంటి దానిని బిఆర్ఎస్వాళ్లు కబ్జా పెట్టుకున్నారని, దానినిపై కూడా కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కేసు వేశారని సిఎం విమర్శించారు. ఆ కుంట పేరే బతుకమ్మ కుంట అని, దానిపై కేసు నడుస్తోందని, వాటిని ఏ విధంగా చూడాలని సిఎం ప్రశ్నించారు. హైడ్రాను పని చేయకుండా అడ్డుకోవాలనే కబ్జాకోరులకు సహకరించవద్దని మీడియాకు సిఎం విజ్ఞప్తి చేశారు. 'హైడ్రా ఎన్ కన్వెన్షన్ కూలగొట్టింది. అది పేదోళ్లదా? గండిపేట చెరువులో ఆక్రమణలు కూలగొట్టింది. అవి పేదోళ్లవా? బతుకమ్మ కుంటను ఆక్రమించుకున్నోళ్లు పేదోళ్లా?' అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కబ్జాదారులను కాపాడటానికి డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

# శ్రీలంక టూర్‌కు భారత జట్టు..బుమ్రా రీఎంట్రీ

రెండు టెస్ట్ సిరీస్ కోసం శ్రీలంక పర్యటనకు వెళ్లే భారత టెస్ట్ టీంను భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) ప్రకటించింది. 15మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను మంగళవారం సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటనలో వెల్లడించింది.వరల్ టెస్ట్ ఛాంపియన్షిప్(డబ్ల్యూటీసీ) 2027లో భాగంగా ఆగస్ట్ 15న ప్రారంభమయ్యే ఈ రెండు టెస్ట్ సిరీస్‌లో శుభ్మన్ గిల్ టీమిండియాను నడిపించనుండగా.. కేఎల్ రాహుల్ డిప్యూటిగా వ్యవహరించనున్నాడు. ఆగస్ట్ 15–19 మధ్య గాలే వేదికగా తొలి టెస్ట్ జరగనుండగా.. ఆగస్ట్ 23–27 మధ్య కొలంబో వేదికగా రెండో టెస్ట్ జరగనుంది.

## బుమ్రా, జడేజా రీఎంట్రీ..

ఐపిఎల్ తర్వాత అఫ్గాన్‌తో టీమిండియా ఏకైక టెస్ట్ మ్యాచ్ ఆడగా..ఇది డబ్ల్యూటిసిలో భాగంగా లేదు. అయితే శ్రీలంక పర్యటనకు ఎంపిక చేసిన భారత టెస్ట్ జట్టులో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. అఫ్గాన్‌తో ఏకైక టెస్ట్‌కు దూరంగా ఉన్న జస్ప్రీత్ బుమ్రా రీఎంట్రీ ఇచ్చాడు. అయితే అతను ఫిట్నెస్ టెస్ట్‌ను క్లియర్ చేయాల్సి ఉంది. ఇంగ్లండ్ పర్యటనలో బుమ్రా గాయపడిన సంగతి తెలిసిందే. అఫ్గాన్‌తో ఏకైక టెస్ట్‌తో పాటు ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు దూరంగా ఉన్న రవీంద్ర జడేజా రీఎంట్రీ ఇవ్వగా.. 33 ఏళ్ల దేశవాళీ స్పిన్ ఆల్‌రౌండర్ సరాన్ష్ జైన్‌కు తొలిసారి టీమిండియా పిలుపు దక్కింది. భారత్–ఏ తరఫున శ్రీలంక–ఏ జరిగిన అనధికారిక టెస్ట్ సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన చేయడంతో అతడికి టీమిండియా పిలుపు వరించింది.

## హర్ష్‌దూబే, నితీష్ రెడ్డి ఔట్..

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆల్‌రౌండర్ హర్శదూబేకు అవకాశం ఇవ్వకుండా సెలెక్టర్లు పక్కనపెట్టారు. అఫ్గాన్‌తో ఏకైక టెస్టు హర్ష్ దూబే ఎంపికైనా తుది జట్టులో చోటు దక్కలేదు. అతనికి బదులుగా అఫ్గాన్తో టెస్ట్ మ్యాచ్ ఆడిన మానవ్ సుతార్ను శ్రీలంక పర్యటనకు ఎంపిక చేశాడు. అఫ్గాన్తో అరంగేట్రంలోనే మానవ్ సుతార్ 7 వికెట్లతో సత్తా చాటాడు. దాంతోనే హర్ష్ దూబేను పక్కనపెట్టి మరి మానవ్ సుతార్కు అవకాశం



ఇచ్చారు. తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి కూడా ఈ పర్యటనకు ఎంపికవ్వలేదు. ఇంగ్లండ్ పర్యటనకు ముందే అతను తొంటి గాయంతో జట్టుకు దూరమైన సంగతి తెలిసిందే. అతని ఫిట్నెస్ అప్డేట్ను కూడా బీసీసీఐ ప్రస్తావించలేదు.

## శ్రీలంక పర్యటనకు భారత జట్టు:

శుభ్మన్ గిల్(కెప్టెన్), కేఎల్ రాహుల్(వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్(కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవదత్ పడిక్కల్, సరాన్ష్ జైన్.

# షాట్‌పుట్‌లో స్వర్ణం.. చరిత్ర సృష్టించిన షర్మిల

కామన్వెల్త్ క్రీడల్లో ఆరో రోజు భారత బృందం పతకాల వేట కొనసాగించింది. వెయిట్లిఫ్టర్ల స్ఫూర్తితో పారా అథ్లెట్ షర్మిలా ధన్కర్ మహిళల షాట్పుట్ విభాగంలో స్వర్ణంతో చరిత్ర సృష్టించింది. కామన్వెల్త్లో పసిడి పతకం కొల్లగొట్టిన మొట్టమొదటి పారా అథ్లెట్గా షర్మిలా రికార్డు నెలకొల్పింది. అది కూడా 40 ఏళ్ల వయసులో. పేదింటి బిడ్డగా.. అడుగడుగున కష్టాలు చవిచూసిన షర్మిల పోడియం మీద గోల్డ్మెడల్ అందుకొని.. చేతిలో మువ్వన్నెల జెండాతో యావత్ భారతం గర్వపడేలా చేసింది.

గ్లాస్గో ఆతిథ్యమిస్తున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత పారా అథ్లెట్ షర్మిలా ధన్కర్ కొత్త అధ్యాయం లిఖించింది. స్వర్ణం గెలుపొందిన ఆమె.. ఈఘనత సాధించిన తొలి పారా అథ్లెటిక్గా చరిత్ర సృష్టించింది. మంగళవారం జరిగిన మహిళల పారా షాట్పుట్ పోటీల్లో షర్మిల ఇనుపగుండును ఏకంగా 9.81 మీటర్ల దూరం విసిరింది. మరెవరూ ఆమెను అందుకోకపోవడంతో గోల్ మెడల్ ఖాయమైంది. దాంతో, కామన్వెల్త్ క్రీడల చరిత్రలో పసిడి పతకం సాధించిన మొట్టమొదటి పారా అథ్లెట్గా అవతరించింది.

## భారత్ ఖాతాలో రెండో పతకం!



గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్లో భారత్ తనరెండో పతకాన్ని గెలుచుకుంది. ఇండియాకు చెందిన 28ఏళ్ల వెయిట్లిఫ్టర్ చానబమ్ రిషికాంత్ సింగ్.. పురుషుల 60 కేజీల విభాగంలో అద్భుత ప్రదర్శనతో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ ఏడాది కామన్వెల్త్ గేమ్స్లో ఇండియాకు ఇది మొత్తంగా రెండో పతకం. అంతకు ముందు పారాపవర్లిఫ్టర్ ఝుండు కుమార్ ఇండియాకు తొలి కాంస్య పతకాన్ని సాధించిపెట్టారు. మ్యాచ్ ప్రారంభంలో రిషికాంత్ సింగ్ అద్భుతమైన ఫామ్ను కనబరిచాడు. స్నాచ్ విభాగంలో రిషికాంత్ సింగ్ తన మూడు ప్రయత్నాలను (116 కేజీలు, 119 కేజీలు, 121 కేజీలు) విజయవంతంగా పూర్తి చేశాడు. 121 కేజీలతో తన మూడో ప్రయత్నంతో రిషికాంత్ వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనను నెలకొల్పడమే కాకుండా కొత్త కామన్వెల్త్ గేమ్స్ స్నాచ్ రికార్డును కూడా నెలకొల్పాడు. స్నాచ్ రౌండ్ ముగిసేసరికి అతను మలేషియాకు చెందిన బిన్ కస్డాన్ మొహమ్మద్ అనిక్తో కలిసి మొదటి స్థానాన్ని పంచుకున్నాడు. క్లీన్ అండ్ జర్క్ రౌండ్లో రిషికాంత్ సింగ్ తన మొదటి ప్రయత్నంలో 143 కేజీలను సులభంగా ఎత్తాడు. అయితే రెండో ప్రయత్నంలో 148 కేజీలను ఎత్తడంలో విఫలమయ్యాడు. దీని తర్వాత ఈ మలేషియన్ 149 కేజీలను ఎత్తి ఆధిక్యంలోకి వచ్చాడు. స్వర్ణం గెలుచుకోవడానికి, రిషికాంత్ తన చివరి ప్రయత్నంలో 151 కేజీలను ఎత్తడానికి పెద్ద ప్రయత్నం చేశాడు. కానీ దానిని పూర్తి చేయలేకపోయాడు. రిషికాంత్ మొత్తం 264 కేజీలు (స్నాచ్ 121 కేజీలు+ క్లీన్ అండ్ జర్క్ 143 కేజీలు) ఎత్తి రజత పతకాన్ని గెలుచుకోగా.. మలేషియాకు చెందిన అనిక్ (273 కేజీలు) స్వర్ణం గెలుచుకున్నాడు.

**చరిత్ర సృష్టించిన అభిషేక్ శర్మ** ...మణిపూర్కు చెందిన 28 ఏళ్ల రిషికాంత్‌సింగ్ చిన్న వయసులోనే వెయిట్లిఫ్టింగ్ ప్రారంభించాడు. ఇంఫాల్లోని ఖుమాన్ లంపాక్ నేషనల్ స్పోర్ట్స్ అకాడమీలో ఈక్రీడలోని మెళకువలను నేర్చుకున్నాడు. అహ్మదాబాద్లో జరిగిన 2025 కామన్వెల్త్ వెయిట్లిఫ్టింగ్ ఛాంపియన్షిప్లో రిషికాంత్ సింగ్ మొత్తం 271 కేజీల బరువును ఎత్తి స్వర్ణ పతకం గెలుచుకుని కొత్త జాతీయ రికార్డును నెలకొల్పాడు.

మహిళ

# మహిళల భద్రత... సమాజం ముందున్న అతిపెద్ద సవాలు

మహిళలు ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టిన క్షణం నుంచి అనేక రకాల వేధింపులను ఎదుర్కొంటున్నారు. బస్సు, రైలు, మెట్రో, వీధి, కార్యాలయం, విద్యాసంస్థ, మార్కెట్, పార్కు వంటి ప్రజా ప్రదేశాల్లో జరిగే లైంగిక వేధింపులు ఒకవైపు ఉంటే, ఫోన్‌లు, సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ వేదికల ద్వారా జరిగే డిజిటల్ వేధింపులు మరోవైపు మహిళల జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇవి ఒక్కో సంఘటనగా కనిపించినా, వాస్తవానికి మహిళల స్వేచ్ఛను, భద్రతను, ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పరిమితం చేసే సామాజిక సమస్యగా మారాయి. ప్రజా ప్రదేశాల్లో మహిళలను వెంబడించడం, అసభ్య వ్యాఖ్యలు చేయడం, అనుమతి లేకుండా తాకడం, అసభ్య సంకేతాలు ఇవ్వడం, ఫొటోలు లేదా వీడియోలు తీయడం వంటి చర్యలు ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో సాధారణంగా కనిపిస్తున్నాయి. దీంతో చాలా మంది మహిళలు రాత్రి వేళఒంటరిగా ప్రయాణించడానికి భయపడతారు. కొందరు ఉద్యోగ అవకాశాలను, విద్యా అవకాశాలను కూడా వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ భయం మహిళల వ్యక్తిగత జీవితానికే కాదు, దేశ ఆర్థికాభివృద్ధి, సామాజిక పురోగతిపైనా ప్రభావం చూపుతుంది. డిజిటల్ ప్రపంచంలో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. సోషల్ మీడియా వేదికల్లో ట్రోలింగ్, అసభ్య సందేశాలు పంపడం, వ్యక్తిగత ఫొటోలను అనుమతి లేకుండా ప్రచారం



చేయడం, మార్ఫింగ్ చేయడం, డీప్‌ఫేక్ సాంకేతికతతో నకిలీ వీడియోలు తయారు చేయడం, ఆన్‌లైన్ బెదిరింపులు, సైబర్ స్టాకింగ్, డాక్సింగ్ వంటి నేరాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా జర్నలిస్టులు, విద్యార్థినులు, రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, కళాకారిణులు తమఅభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేసినప్పుడు లక్ష్యంగా మారే ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి. దీనివల్ల చాలామంది మహిళలు సామాజిక మాధ్యమాల్లో తమ గొంతును తగ్గించుకోవడం లేదా పూర్తిగా దూరంగా ఉండ డం జరుగుతోంది. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. ఈ పరిస్థితిని మార్చడంలో ప్రభుత్వాల పాత్ర అత్యంత కీలకమైనది. మొదటిగా, మహిళలపై జరిగే వేధింపుల కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు, సమయానికి న్యాయ విచారణ, కఠినమైన శిక్షలు అమలులోకి రావాలి. చట్టాలు ఉండడం మాత్రమే సరిపోదు.. వాటి అమలు సమర్థవంతంగా ఉండాలి. పోలీసు వ్యవస్థలో మహిళల సంఖ్యను పెంచడం, ప్రతి పోలీసుస్టేషన్‌లో లింగ స్పృహతో వ్యవహరించే ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, బాధితురాలు భయపడకుండా ఫిర్యాదు చేయగల వాతావరణం కల్పించడం అవసరం. ప్రజా రవాణా వ్యవస్థల్లో సిసి కెమెరాలు, అత్యవసర అలారం వ్యవస్థలు, తగినంత లైటింగ్, వేగంగా స్పందించే హెల్ప్‌లైన్ సేవలు అందుబాటులో ఉండాలి. పట్టణ ప్రణాళికలో కూడా మహిళల భద్రతను ఒక ప్రమాణంగా పరిగణించాలి. చీకటి ప్రాంతాలు, నిర్జన రహదారులు, సురక్షితం కాని బస్‌స్టాప్‌లు వంటి అంశాలను స్థానిక సంస్థలు గుర్తించి వెంటనే సరిచేయాలి. డిజిటల్ భద్రత విషయంలో కూడా ప్రభుత్వాలు చురుకుగా వ్యవహరించాలి. సైబర్ క్రైమ్ విభాగాలను బలోపేతం చేయడం, డీప్‌ఫేక్‌లు, మార్ఫింగ్, రివెంజ్ పోర్న్, ఆన్‌లైన్ బెదిరింపులపై వేగంగా చర్యలు తీసుకునే ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయడం అవసరం. అంతర్జాతీయ డిజిటల్ వేదికలతో సమన్వయం పెంచి, నేరపూరిత కంటెంట్‌ను త్వరగా తొలగించే విధానాలను బలోపేతం చేయాలి. విద్యాసంస్థల్లో చిన్నవయస్సు నుంచే లింగ సమానత్వం, పరస్పర గౌరవం, సమ్మతి, డిజిటల్ పౌరసత్వం, బాధ్యతాయుతమైన ఆన్‌లైన్ ప్రవర్తన వంటి అంశాలను పాఠ్యాంశాల్లో భాగం చేయాలి. మహిళల భద్రతను కేవలం పోలీసు సమస్యగా కాకుండా సామాజిక విద్యా అంశంగా కూడా చూడాలి. అయితే ప్రభుత్వ చర్యలు మాత్రమే సరిపోవు. సమాజం తనదృక్పథాన్ని మార్చుకోకపోతే సమస్య మూలాలు అలాగే ఉంటాయి. కుటుంబాల్లో అబ్బాయిలకు చిన్నప్పటి నుంచే మహిళలను గౌరవించడం వంటి విలువలను నేర్పించాలి. మహిళల భద్రతను కేవలం రక్షణ చర్యలతో కాకుండా, గౌరవం, సమానత్వం, చట్టబద్ధమైన బాధ్యత, సామాజిక చైతన్యం అనే నాలుగు స్తంభాలపై నిర్మించినప్పుడే ఈ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం సాధ్యమవుతుంది.

## అడ్డంకులను అధిగమించిన అడుగులు..

కొంతమంది జీవితాన్ని పరిస్థితులు నిర్ణయిస్తాయి. మరికొందరు తమ సంకల్పంతో పరిస్థితులనే మార్చేస్తారు. అమెరికాకు చెందిన బేబ్ డిడ్రిక్సన్ జహారియాస్ రెండో కోవకు చెందిన అసాధారణ మహిళ. పేద కుటుంబంలో జన్మించిన ఆమెకు సౌకర్యాలు లేవు. కానీ కలలు మాత్రం ఎంతో పెద్దవి. ప్రపంచంలోనే అత్యుత్తమ క్రీడాకారిణిగా నిలవాలనే లక్ష్యంతో ఆమె తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎదురైన ప్రతి అడ్డంకిని అవకాశంగా మలచుకుంది. 1932 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో హైజంప్‌లో సమాన ప్రతిభ కనబరిచినా, సాంకేతిక కారణాలతో ఆమెకు బంగారు పతకం కాకుండా రజత పతకం లభించింది. చాలా మంది అయితే అక్కడితో నిరాశ చెందేవారు. కానీ బేబ్ తన ప్రయాణాన్ని అక్కడితో ముగించలేదు. జావెలిన్ త్రో, హర్డిల్స్‌లో ప్రపంచ రికార్డులతో బంగారు పతకాలు గెలిచి తన అసాధారణ ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పింది. తర్వాత గోల్ఫ్‌లోనూ ఎన్నో విజయాలు సాధించి, మహిళల ప్రొఫెషనల్ గోల్ఫ్ అభివృద్ధికి బలమైన పునాది వేసింది. ఆమె జీవితంలో అతిపెద్ద పరీక్ష మాత్రం క్రీడా మైదానంలో కాకుండా, పెద్దపేగు క్యాన్సర్ బారినపడిన తర్వాత శస్త్రచికిత్స చేయించుకుని, కొలొస్టమీతో జీవించాల్సిన పరిస్థితి వల్ల వచ్చింది. అందరూ బేబ్ కెరీర్ ముగిసిందని భావించిన సమయంలోనే ఆమె తిరిగి మైదానంలో అడుగుపెట్టి అమెరికన్ ఉమెన్స్ ఓపెన్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. శారీరక పరిమితులు మనసును ఓడించలేవని ఆమె నిరూపించింది. ఇతరులు మన సామర్థ్యాన్ని తక్కువ అంచనా వేయవచ్చు. మన రూపాన్ని, నేపథ్యాన్ని, పరిస్థితులను చూసి విమర్శించవచ్చు. కానీ మన భవిష్యత్తును నిర్ణయించేది వారి అభిప్రాయం కాదు, మన ఆత్మవిశ్వాసం. ఓటమి అనేది అంతిమం కాదు. అది మరింత బలం గా తిరిగి లేవడానికి ఇచ్చే అవకాశం మాత్రమే. విజయాన్ని సాధించే వారు అడ్డంకులు లేని వారు కాదు, అడ్డంకులను అధిగమించడం నేర్చుకున్నవారు. ఈ జీవిత సత్యాన్ని బేబ్ జీవితం నిరూపిస్తున్నది. ఆమె జీవితం ప్రతి మహిళకు, ప్రతి యువతికి ధైర్యం, పట్టుదల, ఆత్మవిశ్వాసానికి చిరస్మరణీయమైన స్ఫూర్తిగా నిలుస్తుంది.











# 'నీట్' విద్యార్థుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్

**ప్రజాపక్షం/మంచిర్యాల :** నీట్ పరీక్షల విధానంతో విద్యార్థుల ఆత్మహత్యలు కేంద్ర ప్రభుత్వ హత్యలేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి విమర్శించారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సిపిఐ మంచిర్యాల జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మంచిర్యాల ఐబి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నీట్ పరీక్ష లీకేజీతో ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభ్యుడు కలవేణ శంకర్ మాట్లాడుతూ నీట్ రద్దు కోరుతూ కలత చెంది అమరులైన 21 మంది విద్యార్థుల ఆశయాలను సాధిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినప్పటికీ, ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం అందించాలని, దేశవ్యాప్తంగా ఉద్యమంలో పాల్గొన్న యువకులు, విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు. బీహార్, బెంగాల్, అస్సాం తదితర రాష్ట్రాల్లో విద్యార్థులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టులు చేయడం దారుణమన్నారు. కేసులను వెంటనే ఎత్తివేయకపోతే మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరించారు. విద్యా వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాసు, జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు కారుకూరి నగేష్, జిల్లా సమితి సభ్యులు దేవి పోచన్న, ఇలవేని సారంగపాణి, మేకల రాజేశం, నాయకులు మంద యాదగిరి, మాసు రజిని, తంగెళ్లపల్లి సురేష్ పాల్గొన్నారు.

**వరంగల్ :** నీట్‌ను రద్దు చేసి రాష్ట్రాలకే ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యత అప్పగించాలని, పేపర్ లీకేజీ వల్ల చనిపోయిన విద్యార్థులకు కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ వల్ల చనిపోయిన విద్యార్థులకు నివాళులర్పిస్తూ వరంగల్ హెడ్‌పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుండి వరంగల్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోనే పోరాటం ముగియలేదని, దేశ విద్యా వ్యవస్థను కాపాడేందుకు విద్య కేంద్రీకరణ విధానాలను పూర్తిగా వెనక్కి తీసుకునే వరకు, ఎన్‌టిఏను రద్దు చేసే వరకు, జాతీయ విద్యా విధానంను ఉపసంహరించుకునే వరకు ఉద్యమాన్ని మరింత విస్తృతంగా కొనసాగించాల్సిన బాధ్యత విద్యార్థుల పై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శులు పనస ప్రసాద్, దండు లక్ష్మణ్, నాయకులు సంఘి ఏలేందర్, గుండె బద్రి, ఓర్సు రాజు, జన్ను రవి, పరికరాల రమేష్, ఎండి అక్బర్ పాషా, లాదల్ల శరత్, బెజ్జంకి యాకాంబ్రమాచారి, మస్క సుధీర్, శ్వేత, డి.సాంబమూర్తి, భాశెట్టి రంజిత్,శంషాద్దీన్, చంద్రశేఖర్, ఆరోగ్యం, జగదీష్, తోట రాజు, శివ, శ్రీధర్, సంతోష్, సర్వర్ తదితరులు పాల్గొన్నారు

# పెరుగుతున్న కమ్యూనిస్టుల అవసరం

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

**ప్రజాపక్షం/కొణిజర్ల :** పాలకుల విధానాలు, పెరుగుతున్న ఆర్థిక అంతరాల నేపథ్యంలో దేశంలో కమ్యూనిస్టుల అవసరం రోజురోజుకు పెరుగుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. పెరిగిన కమ్యూనిస్టుల అవసరాలకు అనుగుణంగా పార్టీ కార్యాచరణ రూపొందించుకోవాలని ఆయన సూచించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల, వైరా మండలాల స్థాయి రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులు మంగళవారం తనికెళ్లలోని పులిపాటి ఫార్మా కళాశాలలో జరిగాయి. శిక్షణా తరగతుల్లో హేమంతరావు మాట్లాడుతూ నిరంతర ప్రజా పోరాటాల ద్వారా బలోపేతం అయ్యేందుకు గ్రామశాఖలు అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. కమ్యూనిస్టులు ప్రజాప్రతినిధులుగా ఉంటే తమకు మేలు మేలు ప్రజలు భావిస్తున్నారన్నారు. ఇందుకు అనుగుణంగా పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ప్రజల కోసం పోరాడాల్సింది పోరాడేది కమ్యూనిస్టులే కాబట్టి కమ్యూనిస్టు శాఖలను విస్తృత పర్చాలని ఇందుకు అధ్యయనం, చర్చలు, సంఘటిత నిర్ణయాలు అవసరం అన్నారు. శిక్షణా తరగతులకు ముందు సిపిఐ సీనియర్ నాయకులు వెంపటి పరశురాములు, యాకూబ్ అలీ పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. దొండపాటి రమేష్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన శిక్షణా తరగతుల్లో దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, ఏనుగు వెంకటేశ్వరరావు వివిధ అంశాలపై బోధించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, మండల కార్యదర్శులు గడల భాస్కర్‌రావు, యామాల గోపాలరావు, మునిగ కోటేశ్వరరావు, నాయకులు స్వర్ణ రమేష్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పాపగంటి సుదర్శన్, ఎ. శ్రీనివాసరావు, మద్దోజు శ్రవణ్, తనికెళ్ల శాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





# ఆటోడ్రైవర్లకు రూ.12,000 ఎప్పుడూ?

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్

**ప్రజాపక్షం/భువనగిరి :** ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12,000 ఇస్తామని చెప్పిన ఎన్నికల హామీని ఎప్పుడు అమలు చేస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండి. ఇమ్రాన్ ప్రశ్నించారు. ఎఐటియు అనుబంధ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా రవాణా శాఖ కార్యాలయం ముందు ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించిన అనంతరం జిల్లా రవాణా అధికారి నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది ఆటో డ్రైవర్లు కుటుంబాల పోషణ కోసం తీవ్ర కష్టాలు పడుతున్నారని, పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, విడిభాగాల ధరల పెరుగుదల, బ్యాంకు రుణాల భారం, రోజురోజుకూ తగ్గుతున్న ఆదాయంతో ఆటో కార్మికుల జీవనం సంక్షోభంలోకి నెట్టివేయబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేసి ఆటో కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గనబోయిన వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సామల భాస్కర్ నాయకులు అల్లంపల్లి కృష్ణ, గాయపాక వెంకటేష్, కొత్త కృష్ణ, దంతూరి జ్ఞానేశ్వర్, లింగాల నరసింహ, ప్రభాకర్, జాహేద్, చాంద్, పద్మయ్య, సురేష్, కృష్ణంరాజు, అంజయ్య, రాములు, రామాంజనేయులు, రజ్జాబ్ అలీ, వెంకటేష్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.





# సింగరేణికే మణుగూరు బ్లాక్





### సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా డిమాండ్

**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు ఒసి టు డిఎప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. సిపిఐ పినపాక నియోజకవర్గం స్థాయి సమావేశం మంగళవారం మణుగూరు పార్టీ కార్యాలయంలో జంగం మోహన్‌రావు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి సాబీర్‌పాషా హాజరై మాట్లాడుతూ ఈప్రాంత ప్రజలు తమభూములు, ఇండ్లు త్యాగం చేసి సింగరేణి అభివృద్ధికి పాటు పడ్డారన్నారు. నేడు సింగరేణిలో ఉన్నబొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ పరం చేయాలని చూస్తుందని, దీంతో సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారబోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి మీద ప్రత్యక్షంగా, పరోక్షంగా గుమస్తా లు, కోల్ ట్రాన్స్పోర్ట్, లారీ ఓనర్స్ బొగ్గు ముఠా, కార్మికులు పంచర్ షాపులు, ఇలా ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు పదివేల మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. సమావేశంలో సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, కమటం వెంకటేశ్వరరావు, ముప్పా వెంకటేశ్వరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, అశ్వాపురం, బూర్గంపాడు, పినపాక, కరకగూడెం మండల కార్యదర్శులు అనంతనేని సురేష్, సబ్కా నాగేశ్వరరావు, తోగటి కుమార్, వంగర సతీష్, నాయకులు సోందే కుటుంబరావు, వై.రాంగోపాల్, గడ్డం మనోహరాచారి పత్తిపాటి నాగేశ్వరరావు, పేరాల శ్రీనివాస్, గడ్డం వెంకటేశ్వర్లు, వేరుపుల నరేష్, తోట రమేష్, చింతల దశరథం, ఎస్కే సర్వర్, కొడిమెల రాయల బిక్షం సుజాత,ఆధార్ కొత్తపల్లి సీతారాములు ఆదరణ సురేందర్ పాల్గొన్నారు.

# శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ


**ప్రజాపక్షం/నిజామాబాద్‌అర్బన్ :** శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా, ప్రజా పోరాటాలకు మద్దతుగా కమ్యూనిస్టులు పనిచేయడానికి కమ్యూనిస్టులు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు ప్రజలకు వ్యతిరేకంగా పనిచేసినప్పుడు, తిరుగుబాటు ఉంటుందన్నారు, మతం మత్తులాంటిదని, మతోన్మాదాలు సృష్టిస్తున్న అరాచకాలను అరికట్టాల్సిన బాధ్యత మనమీద ఉందని, ఆ మత్తును వదిలించడమే కమ్యూనిస్టుల లక్ష్యం కావాలన్నారు. మంగళవారం సిపిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ శ్రద్ధానంద్ గంజ్‌లోని కిసాన్ హాల్లో సిపిఐ ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా రెండవరోజు మతం, మతతత్వం, మతోన్మాదం, లౌకికవాదం అంశంపై సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వర్‌తో కలిసి ఆమె మాట్లాడారు. సిపిఐ నాయకులు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టులు కార్మిక, కర్షక వర్గాల మధ్య ఐక్యతను సృష్టించాలని, దేశాన్ని రైతుస్వామ్యం వైపుగా కమ్యూనిజం పనిచేయాలని, రాజకీయాల నుంచి మతాన్ని వేరు చేయాలని, ఆ దిశగా కమ్యూనిస్టులు పనిచేయాలన్నారు. శిక్షణ తరగతులకు కంజర భూమయ్య ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ కామారెడ్డి జిల్లా సహాయకార్యదర్శి దుబాస్ రాములు, రెండు జిల్లాల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# శాసనసభ కమిటీలకు కీలక బాధ్యతలు

## నిష్పక్షపాతంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలి: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ శాసనసభ ప్రభుత్వ హామీల అమలు (అష్యూరెన్స్), నియమాల (రూల్స్), నైతిక విలువల (ఎథిక్స్) కమిటీల తొలి సమావేశాలు మంగళవారం శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో జరిగాయి. ఈ సమావేశాలకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. హామీల అమలు కమిటీ సమావేశంలో కమిటీ చైర్మన్ పటోళ్ల సంజీవరెడ్డి, సభ్యులు జె. అనిరుధ్ రెడ్డి, జారే ఆదినారాయణ పాల్గొన్నారు. స్పీకర్ అధ్యక్షతన జరిగిన రూల్స్ కమిటీ సమావేశంలో సభ్యులు దానం నాగేందర్, తూడి మేఘారెడ్డి, భూక్యా మురళి నాయక్ హాజరయ్యారు. ఎథిక్స్ కమిటీ చైర్మన్ రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యుడు జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. కౌన్సిల్ సెక్రటరీ డా. వి. నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి కూడా సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో శాసనసభ కమిటీల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రభుత్వం సభలో ఇచ్చిన హామీలు సకాలంలో అమలయ్యేలా పర్యవేక్షించడం హామీల అమలు కమిటీ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. రూల్స్ కమిటీ శాసనసభను సమర్థవంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేందుకు దోహదపడుతుందని తెలిపారు. శాసనసభ చట్టాల ద్వారానే కాకుండా సభ్యుల ప్రవర్తన, నిబద్ధత, వ్యవహారశైలి ద్వారా కూడా ప్రజాస్వామ్య వ్యవస్థ అంచనా వేయబడుతుందని స్పీకర్ అన్నారు. ప్రజల విశ్వాసాన్ని పరిరక్షించేందుకు, ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఎథిక్స్ కమిటీ కీలకంగా పనిచేయాలని సూచించారు. రాగద్వేషాలకు అతీతంగా, పూర్తిస్థాయి నిష్పక్షపాతంతో కమిటీలు తమ బాధ్యతలు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ కమిటీల చైర్మన్లు, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ సభ్యులకు మొదటగా అందజేసేది రూల్స్ బుక్ అని, అదే సభ నిర్వహణకు ప్రామాణిక గ్రంథమని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రూల్స్ బుక్‌లో మార్పులు జరిగాయని పేర్కొంటూ, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా కొత్త నిబంధనలతో రూల్స్ బుక్‌ను రూపొందించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల శాసనసభలను కమిటీలు అధ్యయనం చేసి అక్కడ అమలవుతున్న ఉత్తమ విధానాలను పరిశీలించాలని, అవసరమైతే స్టడీ టూర్లు నిర్వహించాలని మంత్రి సూచించారు. సభలో నియమ నిబంధనలు పాటించేలా చూడటంతో పాటు శాసనసభ హుందాతనాన్ని కాపాడడంలో ఎథిక్స్ కమిటీ కీలక పాత్ర పోషించాలని అన్నారు. కమిటీల నిర్ణయాలు పారదర్శకంగా ఉండి తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. కమిటీల చైర్మన్లు మాట్లాడుతూ తమపై శాసనసభ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నిష్పక్షపాతంగా పనిచేసి సభ గౌరవాన్ని మరింత పెంచేందుకు కట్టుబడి ఉంటామని తెలిపారు.

## సి.ఆర్. ఫౌండేషన్‌ను సందర్శించిన మాజీమంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు మంగళవారం నాడు కొండాపూర్‌లోని సి.ఆర్. ఫౌండేషన్‌ను సందర్శించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ సంక్షేమ సంస్థలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వృద్ధుల ఆశ్రమం, ఎన్.ఆర్.ఆర్. పరిశోధనా కేంద్రం, సురవరం సుధాకర్ రెడ్డి గ్రంథాలయం, చిల్డ్రన్స్ లైబ్రరీ, మహిళా నైపుణ్యాభివృద్ధి కేంద్రం మరియు సి.ఆర్. పాలీక్లినిక్ & డయాగ్నస్టిక్ సెంటర్ లను సందర్శించారు. తన స్వీయ రచనలైన పుస్తకాలను గ్రంథాలయానికి విరాళంగా అందజేశారు. సి.ఆర్. ఫౌండేషన్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించిన శోభనాదీశ్వరరావు, వృద్ధుల సంరక్షణ, విద్య, మహిళా సాధికారత మరియు ఆరోగ్య రంగాలలో ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఫౌండేషన్ యాజమాన్యాన్ని అభినందించి, భవిష్యత్ కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్శన సందర్భంగా సి.ఆర్. ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు డా. కె. నారాయణ, అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరావు, ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు కంభంపాటి అజయ్ కుమార్, కార్యదర్శులు పి.జె. చంద్రశేఖర్, పి. సంధ్య కుమారి, ఆశ్రమ డైరెక్టర్ & కోశాధికారి చెన్న కేశవరావు, సి.ఆర్. పాలీక్లినిక్ డైరెక్టర్ డా. కె. రజని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పనతో పాటు ఇతర సభ్యులు శోభనాదీశ్వరరావుకు స్వాగతం పలికి, ఫౌండేషన్‌లోని అన్ని సదుపాయాలను చూపించి, కార్యకలాపాలను వివరించారు. కార్యక్రమం చివరిలో శోభనాధీశ్వర రావు ఆశ్రమ వాసులు, లబ్ధిదారులతో ముచ్చటించారు.



## సాంకేతిక పరిశ్రమలు, స్టార్టప్‌ల ఏర్పాటు కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలు, స్టార్టప్‌ల ఏర్పాటు కోసం అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) పవన్ కుమార్ చందన, సహ వ్యవస్థాపకుడు, ముఖ్య నిర్వహణ అధికారి (సీఓఓ) నాగ భరత్ డాకా ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపైన చర్చించారు. తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, అంతరిక్ష సాంకేతిక రంగాల పురోగతి, ఆవిష్కరణలు, అధునాతన తయారీ, పరిశోధన అభివృద్ధి (ఆర్ అండ్ డీ), ప్రభుత్వం ప్రైవేటు అంతరిక్ష పరిశ్రమల మధ్య సహకార అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినంధించారు. వారు సాధించిన విజయం భారతదేశాన్ని ప్రపంచ అంతరిక్ష రంగంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళుతుందని ఆయన ప్రశంసించారు. భారతదేశంలోనే ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్‌క్లాస్ ప్రయోగ వాహనం విక్రమ్1ను విజయవంతంగా ప్రయోగించిన తీరును పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకాముఖ్యమంత్రికి వివరించారు. ఈ విజయంతో అమెరికా, చైనా తర్వాత ప్రైవేటు రంగం ద్వారా ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాన్ని సాధించిన ప్రపంచంలోని మూడో దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు.

# భూ వివాదాల్లేని తెలంగాణే లక్ష్యం

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపి, వివాదాల్లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు నిశ్చయించి, ప్రతి సర్వే నంబర్కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. సచివాలయంలోని తన కార్యాలయంలో మంగళవారం రీసర్వే పురోగతి, ప్రజల స్పందన, క్షేత్రస్థాయి సమస్యలు, పరిష్కారాలపై రెవెన్యూ, సర్వే శాఖ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలి దశలో 2,240 గ్రామాల్లో సర్వే సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీసర్వే వేగవంతంగా కొనసాగుతోందన్నారు. అలాగే నక్షా లేని 373 గ్రామాల్లోనూ సర్వే ప్రక్రియ చురుగ్గా సాగుతోందని, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని, పారదర్శకత పాటిస్తూ ప్రజలను ప్రతి దశలో భాగస్వాములను చేయాలని సూచించారు. ఆధునిక సాంకేతికతతో ఖచ్చితమైన హద్దులు భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది వారి కుటుంబ జీవనాధారమని మంత్రి వ్యాఖ్యానించారు. దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యలను తుడిచిపెట్టేందుకే డిజిపిఎస్, రోవర్స్, జిఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రీయంగా రీ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నెంబర్‌కు ప్రత్యేక భూదార్ నెంబర్ కేటాయించి, 'భూ భారతి' పోర్టల్‌లో నమోదు చేస్తామని, దీనివల్ల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు వేగవంతంగా, పారదర్శకంగా జరుగుతాయని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను మార్చే కీలక బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేయాలని అధికారులకు మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు.

**అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు..**

నోటీసులు తప్పనిసరి : సర్వే బృందాలు గ్రామానికి వెళ్లే ముందు విధిగా పట్టాదారులకు ముందస్తు నోటీసులు జారీ చేయాలి.

హద్దుల నిర్ధారణ : గ్రామంలోని ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేసి, గ్రామకంఠం హద్దులు నిర్ణయించిన తర్వాతే సర్వే ప్రారంభించాలి.

కలెక్టర్ల పర్యవేక్షణ : జిల్లాల కలెక్టర్లు స్వయంగా పనులను పర్యవేక్షిస్తూ, వారానికో సారి పురోగతిపై సమీక్షలు నిర్వహించాలి.

ప్రజా కోణంలో పని : ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, వారు సంతృప్తి చెందేలా సర్వే ప్రక్రియ సాగాలి.

# తెలంగాణ టివి అవార్డులకు పివి పేరు..?

### పారదర్శకంగా ఎంపిక

### న్యూస్ యాంకర్లకూ గుర్తింపు: మంత్రి కోమటిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ టెలివిజన్ రంగంలో ప్రతిభను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా తెలంగాణ రాష్ట్ర టెలివిజన్ అవార్డులు (టిజిఎస్‌టివి) ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర రోడ్లు–భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర టెలివిజన్ అవార్డుల కమిటీ సభ్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అవార్డుల విధివిధానాలు, లోగో, కేటగిరీలు, ప్రదానోత్సవ వేదిక తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.తెలంగాణ టివి అవార్డులకు మాజీ ప్రధాని పివి నరసింహారావు పేరు పెట్టె ఆలోచనలో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టెలివిజన్ రంగం సమాజంపై విశేష ప్రభావం చూపే శక్తివంతమైన మాధ్యమమని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు అధికంగా టివి కార్యక్రమాలను వీక్షిస్తారని పేర్కొన్నారు. సమాజానికి మంచి సందేశాన్ని అందించే ధారావాహికలు, నాన్‌ఫిక్షన్ కార్యక్రమాలు, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీలు, విద్యా, సామాజిక ప్రాధాన్యత గల కంటెంట్ రూపొందించే వారిని ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఉత్తమ దర్శకుడు, నటుడు, నటి, రచయిత, సంగీత దర్శకుడు, ఛాయాగ్రాహకుడు, ఎడిటర్, డబ్బింగ్ కళాకారుడు, ఆర్ట్ డైరెక్టర్, కాస్ట్యూమ్ డిజైనర్, మేకప్ ఆర్టిస్టుతో పాటు న్యూస్ ఛానల్ల యాంకర్లు, ప్రజెంటర్లకు కూడా ప్రత్యేక విభాగంలో అవార్డులు ఇవ్వాలని కమిటీకి సూచించారు. నాన్‌ఫిక్షన్ కార్యక్రమాలకు కనీసం 13 ఎపిసోడ్‌లు, దినసరి ధారావాహికలకు 100 ఎపిసోడ్‌లు పూర్తై ఉండాలని, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీలు, సామాజిక, విద్యా చిత్రాలు 20 నుంచి 60 నిమిషాల నిడివి కలిగి ఉండాలని మంత్రి వెల్లడించారు. అర్హత ప్రమాణాలకు అనుగుణంగా వచ్చిన ఎంట్రీలను మాత్రమే పరిశీలనకు స్వీకరిస్తామని చెప్పారు. అవార్డుల ప్రదానోత్సవానికి సంబంధించి ప్రత్యామ్నాయ వేదికలను ప్రతిపాదించాలని తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండి ముకుంద్‌రెడ్డికి సూచించారు. సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, టిఎఫ్‌డిసి ఎండి ముకుంద్‌రెడ్డి, డైరెక్టర్ కిషోర్‌బాబు, కమిటీ ఛైర్మన్ మర్రార్ శరత్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ డ్రగ్స్ కేసు దర్యాప్తు ముమ్మరం

### బెంగళూరులో ఇడి దాడులు.. మనీలాండరింగ్ కోణంలో విచారణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో వెలుగుచూసిన భారీ డ్రగ్స్ విక్రయాల కేసులో దర్యాప్తు వేగం పుంజుకుంది. ఇప్పటికే కోట్ల రూపాయల విలువైన మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించి పలువురు నిందితులను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేయగా, అదే కేసుకు అనుబంధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మనీలాండరింగ్ కోణంలో విచారణను ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో ఏడు చోట్ల, బెంగళూరులో రెండు చోట్ల ఈడీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చిన అక్రమ ఆదాయాన్ని హవాలా, బ్యాంకింగ్ లావాదేవీలు, బినామీ పెట్టుబడుల రూపంలో చలామణి చేశారా అనే కోణంలో అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. హైదరాబాద్ పోలీసులు నమోదు చేసిన ఎన్‌డిపిఎస్ కేసు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిసింది. సోదాల సందర్భంగా కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు, బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన వివరాలను అధికారులు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నట్లు సమాచారం. డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, రాష్ట్రాల మధ్య ఉన్న అనుబంధాలు, అక్రమ సంపాదనకు సంబంధించిన ఆధారాలపై ఈడీ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో అరెస్టైన నిందితులతో సంబంధాలు ఉన్న వ్యక్తుల నివాసాలు, కార్యాలయాల్లో కూడా సోదాలు నిర్వహించినట్లు సమాచారం. సోదాలు ముగిసిన అనంతరం స్వాధీనం చేసుకున్న ఆధారాలను విశ్లేషించి, అవసరమైతే మరికొందరిని విచారణకు పిలిచే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ కేసులో డ్రగ్స్ మాఫియా ఆర్థిక లావాదేవీలపై ఈడీ దర్యాప్తు మరింత విస్తరించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

## నోటీసులు లేకుండా కూల్చివేతలా?

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొండాపూర్‌లో ప్రైవేటు స్థలంలోని కాంపౌండ్, వాచ్‌మెన్ గదిని నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడంపై హైకోర్టు హైడ్రా అధికారులతో పాటు శేరిలింగం పల్లి ఎమ్మార్వోను నిలదీసింది. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రాకు సమాచారం ఏ ప్రాతిపదికన ఇచ్చారో ఈ నెల 30న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఎమ్మార్వోను ఆదేశించింది. సర్వేలో అది పట్టా భూమిగా తేలినా, గత కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా చర్యలు తీసుకోవడంపై న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది.

## 24 గంటల్లో హైడ్రా బోర్డు తొలగించాలి : హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చట్టప్రక్రియను అనుసరించకుండా ప్రైవేటు స్థలంలో ఏర్పాటు చేసిన హైడ్రా బోర్డును 24 గంటల్లో తొలగించాలని హైకోర్టు ఆదేశించింది. నోటీసులు ఇవ్వకుండా, విచారణ జరపకుండా ఏకపక్షంగా బోర్డు ఏర్పాటు చేయడాన్ని తప్పుబట్టింది. గతంలో ఇదే స్థలానికి సంబంధించిన కూల్చివేత నోటీసులను హైకోర్టు రద్దు చేసిన విషయాన్ని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైడ్రాను ఆదేశిస్తూ విచారణను ఆగస్టు 11కు వాయిదా వేసింది.



### భవన నిర్మాణ కార్మికుల సమస్యలు

# తక్షణమే పరిష్కారం

### తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భవన నిర్మాణ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ హైదరాబాద్ జిల్లాజిల్లా అధ్యక్షుడు చెట్టుకింది శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం టోలిచౌక్ అడ్డా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వివిధ సంఘాలకు చెందిన సుమారు 50 మంది భవన నిర్మాణ కార్మికులు చెట్టుకింది శ్రీనివాస్, కమతం యాదగిరిల సమక్షంలో యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ సంక్షేమ బోర్డులో అర్హులైన ప్రతి కార్మికుడిని నమోదు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను వెంటనే అందించాలని కోరారు. ప్రమాద బీమా, వైద్య సదుపాయాలు, విద్యా సహాయం, ప్రసూతి ప్రయోజనాలు, వృద్ధాప్య పెన్షన్, గృహ సౌకర్యం వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అలాగే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని, పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రమాదాల్లో మరణించిన లేదా గాయపడిన కార్మికులకు తక్షణ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు. కొత్తగా యూనియన్‌లో చేరిన కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడుతూ యూనియన్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టోలిచౌక్ అడ్డా కమిటీ సభ్యులు షరీఫ్, జావిద్, షఫీ, హర్షిత్ ఖాన్, శ్రీనివాస్, ఎల్లయ్య, కవిత, జ్యోతి, జూబ్లీహిల్స్ అడ్డా అధ్యక్షుడు ఎన్. నరసింహతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డికి మెరుగైన వైద్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్ యూనిట్‌లో క్రిటికల్ కేర్, పల్మనాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ నిపుణులతో కూడిన వైద్య బృందం బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి మెరుగైన వైద్యం అందిస్తోందని యశోధ ఆస్పత్రి వెల్లడించింది. అంతర్జాతీయ వైద్య మార్గదర్శకాల ప్రకారం 72 గంటల అనంతరం ఆయన న్యూరో స్థితిపై పూర్తిస్థాయి పునఃసమీక్షించి స్పష్టత నిస్తామని యశోద ఆస్పత్రి ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ జి. విజయ్ కుమార్ మంగళవారం హెల్త్ బులెటిన్‌లో పేర్కొన్నారు. తక్కువ మోతాదులో విఐ విలేజ్ సపోర్ట్, లంగ్ ప్రొటెక్టివ్ స్ట్రాటజీలతో ఐసీయూ నిబంధనల ప్రకారం ఆయన శ్వాసక్రియను వెంటిలేటర్ ద్వారా నిర్వహిస్తున్నారు.

## స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల ఫలితాలు విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డైరక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ (తెలంగాణ వైద్య విధాన పరిషత్) పరిధిలోని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల ఫలితాలు విడుదలయ్యాయి. జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, రేడియాలజీ విభాగాల్లోని మొత్తం 500 పోస్టులకు సంబంధించిన ఫలితాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ మంగళవారం విడుదల చేసింది. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ పరిధిలోని హాస్పిటల్స్‌లో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరతను అధిగమించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మొత్తం 1,616 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో అనెస్తీషియా,గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ విభాగాలకు సంబంధించిన 692 పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఎంపికైన అభ్యర్థులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలు అందజేయగా, అధికారులు ఇటీవలే వారికి పోస్టింగ్స్‌ను కూడా ఇచ్చారు. తాజాగా జనరల్ సర్జరీ 174, జనరల్ మెడిసిన్ 166, ఆర్థోపెడిక్స్ 89, రేడియాలజీ 71 చొప్పున మొత్తం 500 పోస్టులకు సంబంధించిన ఫలితాలను విడుదలయ్యాయి. ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల అనంతరం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి, తుది ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ పోస్టులకు ఎంపికైన డాక్టర్లకు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందనలు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నూతనంగా ఎంపికైన స్పెషలిస్ట్ డాక్టర్లు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియను కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులను మంత్రి ఆదేశించారు.

# కీచక సిఐ సస్పెన్షన్

**దర్యాప్తులో వెలుగు చూసిన లైంగిక వేధింపులు**
**సిఐ భార్య అకౌంట్లలోకి రూ.లక్షల డబ్బులు బదిలీ,**
**సిఐ సమక్షంలోనే అబార్షన్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫిర్యాదు కోసం పోలీసు స్టేషన్‌కు వచ్చిన యువతిని లోబర్చుకుని గర్భవతిని చేసి, అబార్షన్ చేయించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జూబ్లీహిల్స్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డిని సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ బిసి సజ్జనర్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు డిజిపి సి.వి.ఆనంద్ విచారణకు ఆదేశించినట్లు, ఈ కేసు విచారణను మల్టీజోన్2 ఐజి షానవాజ్ ఖాసింకు బాధ్యతలు అప్పగించినట్లు పోలీసువర్గాల ద్వారా తెలిసింది. ఈ మేరకు బాధితురాలైన యువతి సమర్పించిన సాక్ష్యాధారాలను దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే బాచుపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సిఐ స్వయంగా బాధితురాలిని తీసుకెళ్లి అబార్షన్ చేయించినట్లు అక్కడి ఆసుపత్రి రికార్డుల్లో ఉన్నట్లు దర్యాప్తులో వెలుగు చూసిందని పోలీసులు అంటున్నారు. అంతేకాకుండా లైంగిక వీడియోల పేరుతో బాధితురాలి నుంచి దండుకున్న సుమారు రూ.2 కోట్లలో రూ.50 లక్షల వరకు సిఐ తన భార్య అకౌంట్లోకి వేయించుకున్న ఆధారాలు సైతం దర్యాప్తు అధికారులకు లభించాయని, సిఐ చెప్పిన ఏ ఏ అకౌంట్లోకి ఆ బాధితురాలు ఎంతేంత డబ్బులు వేసిందనే విషయంపై అధికారులు ఆరా తీస్తున్నారని, అందులో కొంత మంది సిఐ బినామిల అకౌంట్లోకి డబ్బులు వేయించుకున్నాడని ఆధారాలు లభించినట్లు సమాచారం.

**ఆడపిల్లవు కదా జాగ్రత్త: సిఐ బెదిరింపులు**

తనపై డిజిపికి ఫిర్యాదు చేసిన విషయం తెలుసుకున్న సదరు సిఐ బాధితురాలికి ఫోన్ చేసి బెదిరించినట్లు బాధితురాలు తిరిగి పోలీసు అధికారులకు తెలియజేసినట్లు సమాచారం. సిఐ ఫోన్లో బాధితురాలితో మాట్లాడుతూ ఫోటోలు, వీడియోలతో సహా నాపై ఫిర్యాదు చేశావు. అందులో నేను ఒక్కడినే లేను. నీవు కూడా ఉన్నావు. ఆడ పిల్లవు కదా జాగ్రత్త అని పరోక్షంగా బెదిరించినట్లు సంభాషణ ఉన్నట్లు దర్యాప్తు అధికారులు చర్చించుకుంటున్నట్లు సమాచారం. అందుకు బాధితురాలు స్పదిస్తూ లిఫ్టో బట్టలు ఇప్పి నన్ను కొట్టినప్పుడు గుర్తు రాలేదా ఆడపిల్ల అని? ఆడపిల్ల డ్రెస్ చింపి కొట్టినప్పుడు గుర్తు రాలేదా? ఇప్పుడెందుకు గుర్తుకొచ్చినాను ఆడపిల్లనని? నా జీవితం బుగ్గిపాలు చేసి, ఇప్పుడెందుకు ఆడపిల్లనని గుర్తుకొచ్చినా నా? మీరు నా జీవితాన్నే నాశనం చేసేసి రోడ్డు మీద పెట్టినావు. ఇక చూసుకుందాం లే, నాకు పోతే పోనీ నా పరువు ఏమైతది? పరువు పోతే పోనీ, ఇన్ని రోజులు అదే కదా నువ్వు అన్నవు. ఏదైతే అది అవుతుందిలే, సరే ప్రాణాలు పోతాయి అంతే కదా! అని బదులిచ్చినట్లు దర్యాప్తు అధికారుల వద్ద సాక్ష్యాధారాలు ఉన్నట్లు కూడా సమాచారం.

**త్వరలో కేసు నమోదు..సిఐపై వేటుకు రంగం సిద్ధం**

ఈ కేసు దర్యాప్తు చేపట్టిన అధికారులు పక్కా సాక్ష్యాధారాలను సేకరించినట్లు పోలీసులు అంటున్నారు. దీని ఆధారంగా ఇప్పటికే బాధితురాలి వాంగ్మూలాన్ని కూడా అధికారులు రికార్డు చేసినట్లు సమాచారం. అధికారుల విచారణలో జూబ్లీహిల్స్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి పాజితరాలిపై లైంగిక దాడితోపాటు ఆమెతో తీసుకున్న రెండు కోట్ల వ్యవహారం కూడా సాక్షాదారాలతో బయటపడడంతో అతనిపై సస్పెన్షన్ వేటు వేశారు

## న్యూజెర్సీ రోడ్డు ప్రమాదంలో దీపారెడ్డి మృతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దీపారెడ్డి (44) దుర్మరణం చెందారు. ఆమె రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్ మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందినవారు. దీపారెడ్డి తన భర్త రామకృష్ణారెడ్డితో కలిసి న్యూజెర్సీలో నివాసముంటున్నారు. దంపతులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారు. వీరు ప్రయాణిస్తున్న కారు సిగ్నల్ వద్ద వేచి ఉన్న సమయంలో, వేగంగా వచ్చిన మరొక వాహనం వీరి కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దీపారెడ్డి ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. సంతోషంగా జీవిస్తున్న కుటుంబంలో ఒక్కసారిగా తీవ్ర విషాదం అలముకోవడంతో స్వగ్రామం ఆకుతోటపల్లిలోనూ, బంధువుల్లోనూ విషాదం నెలకొంది. ఈ ప్రమాదంపై న్యూజెర్సీ స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దీపారెడ్డి భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకవచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# తక్కువ నీటి పంటలకే మొగ్గు

**కంచనపల్లిలో కంది పంటలను పరిశీలించిన కలెక్టర్ చంద్రశేఖర్**



**ప్రజాపక్షం/ నల్లగొండ:** వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో సాగు చేసే పంటల వైపు జిల్లా రైతులు మొగ్గు చూపాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన నల్లగొండ మండలం కంచనపల్లి గ్రామంలో కంది పంట సాగు చేసిన రైతుల వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలు సాగు చేస్తున్నందుకు రైతులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రైతులు వ్యవసాయ అధికారుల సూచనలను పాటిస్తూ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కంది, పెసర, మినుము, నువ్వులు, జొన్న, సజ్జ వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు.దీనివల్ల నీటి వినియోగాన్ని తగ్గిస్తూ స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డ్రాగన్ ఫ్రూట్ రైతు అజేందర్ రెడ్డి, కంది రైతు దంపతులు అంజయ్య,పార్వతమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమా ర్, ఉద్యాన శాఖ డిడి శేఖర్ కలెక్టర్ వెంట ఉన్నారు.

**క్లాత్ వచ్చిన వెంటనే యూనిఫాంలు కుట్టించి పంపిణీ చేయాలి**

విద్యార్థుల యూనిఫాంల పంపిణీలో భాగంగా పాఠశాలలకు క్లాత్ వచ్చిన వెంటనే యూనిఫాంలు కుట్టించి విద్యార్థులకు అందించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు,మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ పాఠశాలలు,ఎస్‌సి,ఎస్‌టి రెసిడెన్షియల్ పాఠశాలలు,ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంల పంపిణీపై విద్యాశాఖ అధికారులు,ఏపీఎంలు, సంక్షేమ శాఖల ప్రాంతీయ సమన్వయ అధికారులు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటికే ప్రభుత్వం యూనిఫాంల కోసం అవసరమైన వస్త్రాన్ని పాఠశాలల వారీగా పంపిణీ చేసిందని తెలిపారు. అనంతరం మండల విద్యాధికారులతో మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రతిరోజూ విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు (ఎఫ్ఆర్ఎస్) 80 శాతానికి పైగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అలాగే ఉపాధ్యాయులు, సిబ్బంది ఎఫ్ఆర్ఎస్ 98 శాతానికి పైగా ఉండాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి,మున్సిపల్ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్,మండల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలతో ఆసుపత్రి నిర్మాణం

**కోదాడ ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్**



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఇందులో భాగంగానే కోదాడ 100 పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ తెలిపారు. మంగళవారం కోదాడ ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోదాడ 100 పడకల ఆసుపత్రిని నాణ్యతతో నిర్మించాలని అధికారులను అదేశించారు. నాణ్యత ప్రమాణాలతో రాజీపడొద్దని, నాణ్యతలో ఏమైనా తేడాలుంటే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రోగులకు ఇబ్బంది కలగకుండా మెట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉ ంచాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఆసుపత్రికి సరిపడా పారిశుద్ధ్య సిబ్బంది ఏ ర్పాటు చేసేందుకు కృషి చేస్తా అన్నారు. ఆసుపత్రుల్లో గర్భిణీలకు సాధారణ ప్రసవం జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, ఆసుపత్రి సూపరిండెంట్ దశరథ నాయక్, తహసిల్దార్ సంతోష్ కిరణ్, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**కోదాడ జడ్పి బాలుర ఉన్నత పాఠశాలకు రూ.30 లక్షల మంజూరు**

జిల్లాలో విద్య ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ తెలిపారు. మంగళవారం కోదాడ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన అకస్మికంగా సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న విద్యా కార్యక్రమాలు, భౌతిక వసతులు, పెండింగ్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఇంకా పూర్తి కావాల్సిన భౌతిక వనరుల కల్పన కోసం రూ.30 లక్షలను మంజూరు చేసినట్లు ప్రకటించారు. సూర్యాపేట జిల్లాలో అత్యుత్తమ విద్యా ఫలితాలు సాధించడంతో పాటు వినూత్న విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కోదాడ జడ్పి బాలుర ఉన్నత పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను వచ్చే 90 రోజుల్లోగా పూర్తి చేయాలని ఎఈవో ఓబులేష్‌కు కలెక్టర్ స్పష్టమైన అదేశాలు జారీ చేశారు.

## యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

**రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి**

**ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు డిమాండ్**



**ప్రజాపక్షం/నాంపల్లి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నూతన పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.మంగళవారం మునుగోడు నియోజకవర్గంలోని నాంపల్లి మండలంలో జరిగిన ఏఐవైఎఫ్ 16వ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ యువతకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వేలు, విమానయాన, టెలికం, రక్షణ రంగాలను ప్రైవేటుపరం చేయడం సిగ్గుచేటని అన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేస్తూ,మాజీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మతతత్వ,విభజన రాజకీయాలతో దేశంలో సామాజిక ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని అన్నారు.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మహాసభకు చెన్నోజు వెంకటాచారి అధ్యక్షత వహించారు. సిపిఐ మండల కార్యదర్శి సుందరబోయి రమేష్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జగన్,నేతాల రాజు,సైదులు, వంగూరి సాయిలు,భుష్పాక నిఖిల్,ఎస్‌కె అబ్బాస్,జిల్లెల్ల శ్రీకాంత్,లింగస్వామి,నందు,హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ‘స్త్రీ నిధి’ పక్కదారి!

**విఓఏ తొలగింపు... ఆఫీస్ బేరర్ల భర్తరఫ్**

**డిపిఎం బెనర్జీపై క్రమశిక్షణ చర్యలకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ ఆదేశం**

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** మహిళా సంఘాల సభ్యులకు అండగా ఉండాల్సిన స్త్రీ నిధి నిధులు పక్కదారి పట్టాయి. సభ్యులు కష్టపడి కట్టిన వాయిదా డబ్బులను విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ తన స్వంతానికి వాడుకున్నాడు. ఈ భారీ అవకతవకలపై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాలతో విచారణలో నిజమేనని తేలడంతో విఓఏ నుండి డబ్బులు రికవరీ చేసి అతనిని ఉద్యోగం నుండి తొలగించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... తుంగతుర్తి మండలం గానుగుబండ గ్రామ సమాఖ్యలో 2022లో స్త్రీ నిధి రుణాలు మంజూరయ్యాయి. సభ్యులు తమ నెలవారీ వాయిదాలను క్రమం తప్పకుండా విఓఏ భూపతి సైదులుకు చెల్లిస్తున్నారు. అయితే సైదులు మాత్రం ఆ డబ్బును పూర్తిగా స్త్రీ నిధి ఖాతాలో జమ చేయకుండా తన స్వంతానికి వాడుకున్నారు. సభ్యుల నుంచి ముందస్తు వాయిదాల పేరుతో భారీగా వసూలు చేసి, బ్యాంకు రికార్డుల్లో మాత్రం కనీస మొత్తమే చెల్లిస్తూ మిగతా సొమ్మును స్వాహా చేశారు. నిబంధనల ప్రకారం విఓఏలు ఎలాంటి ఆర్థిక లావాదేవీలు చేయకూడదని రూల్ ఉన్నప్పటికి, ఇక్కడ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఈ అక్రమాలపై ప్రజావాణిలో ఫిర్యాదులు రావడంతో స్త్రీ నిధి రిజినల్ మేనేజర్ శివప్రసాద్ ఈ ఏడాది మార్చిలో విచారణ చేశారు. ఈ విచారణలో విఓఏ సైదులు అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో అతను స్వాహా చేసిన రూ.14,54,000లను తిరిగి స్త్రీ నిధి ఖాతాలో రీపేమెంట్ చేయించారు. కేవలం విఓఏ మాత్రమే కాకుండా, ప్రస్తుతం ఉన్న ఆఫీస్ బేరర్లు కూడా ఈ అక్రమాలలో సహకరించినట్లు విచారణలో తేలింది. విఓఏ నిధులు దారి మళ్లిస్తున్నా పట్టించుకోకపోవడం, విచారణ సమయంలో సరిగ్గా స్పందించకపోవడంతో వారిపై కూడా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక అవకతవకలకుపాల్పడిన విఓఏ సైదులును తక్షణమే విధుల నుంచి తొలగించాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఆఫీసర్ బేరర్లను కూడా ఆ పదవుల నుంచి తీసేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ డిఆర్‌డిఓ పిడి సన్యాసయ్యను ఆదేశించారు.

## సరిహద్దు ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు కట్టడి చేస్తున్నాం

**సూర్యాపేట జిల్లా ఎస్‌పి నర్సింహా**

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** ప్రజలకు వేగంగా పోలీస్ సేవలు అందించడానికి డోర్ స్టెప్ ఎఫ్ఐఆర్ సరిహద్దు ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు కట్టడి చేస్తున్నామని, ప్రజల భద్రతలో రాత్రింబవళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తూ గస్తీ ఏర్పాటు చేశామని, ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వారిపై నిఘా, నిరంతరం తనిఖీలు చేస్తున్నామని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రసిద్ధి గాంచిన శివాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న మహాశివరాత్రి జాతరకు పోలీస్ చర్యలు, రాబోయే మహాశివరాత్రి జాతర కోసం చేయాల్సిన భద్రత ఏర్పాట్లపై ఆలయ సిబ్బందితో చర్చించారు. అనంతరం వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఆయనకు స్టేషన్ సిబ్బంది, స్థానిక డిఎస్‌పి, సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ నవీన్ గౌరవ వందనం తో స్వాగతం పలికారు. సిబ్బంది నిర్వహించిన కవాతును పోలీస్ సామాగ్రి ప్రదర్శనను పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ ఆవరణంలో పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఎల్‌నినో లాంటి విపత్కర పరిస్థితుల వల్ల వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటితో పండే పంటలు వేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో వివిధ రకాల రికార్డులను పరిశీలించి కేసులు, ప్రజా ఫిర్యాదు, పెండింగ్ లేకుండా పనిచేయాలని సూచించారు. నాణ్యమైన దర్యాప్తు చేస్తున్నాము ఇటీవల మేళ్లచెరువు పరిధిలో ఒక మర్డర్ కేసులో నేరస్తులకు జీవిత ఖైదు శిక్ష పడేలా సమర్థవంతమైన దర్యాప్తు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, సిఐ రామకృష్ణారెడ్డి, డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ మగ్దుంఅలీ, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ రాంబాబు, స్టోర్ ఆర్ ఎ స్ఐ అశో క్, ఎస్పీ సిసి సందీప్, డిసిఆర్‌బి సిబ్బంది అంజన్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు



**ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం**

**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణాభివృద్ధికి రూ.21 కోట్లతో డ్రెయినేజీ,సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 15,16,18,19,20 వార్డుల మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.పట్టణానికి 800 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించామని, త్వరలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కూడా నకిరేకల్‌కు మంజూరైందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరలు నాణ్యత లోపంతో ప్రజలకు ఉపయోగపడలేదని విమర్శించారు. నియోజకవర్గంలోని 16 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పన్నాలగూడెంలోని క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ కుమార్,తహశీల్దార్ యశ్వంత్ రాజ్,మార్కెట్ కమిటీ చైర్మన్ జి మంజుల మాధవరెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, చౌగోని రజిత శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం

**ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్**



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** కార్మికుల, కర్షకుల హక్కుల పరిరక్షణ కోసం ఎఐటియుసి నిరంతరం పోరాటం చేస్తుందని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని సివిల్ సప్లై హమాలీ కార్మికులతో కలిసి జిల్లా ఎఐటియుసి మూడవ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జడశ్రీనివాస్ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు చేస్తున్న శ్రమ దోపిడికి వ్యతిరేకంగా ఆవిర్భవించిన కార్మిక సంఘం 106 సంవత్సరాలుగా కార్మికుల సమస్యలపై నిరంతరం సమరశీల పోరాటాలు కొనసాగిస్తూ, హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పనిలో ప్రమాదం జరిగితే ప్రమాద బీమాని 20 లక్షల వరకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులక, విశ్రాంత గదులను సురక్షితమైన మంచినీటిని అందించాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సివిల్ సప్లై గోదాం ఇన్‌ఛార్జి లక్ష్మ ణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బెల్లకొండ రామ్మూర్తి, పానుగోతు గోపి, జక్కుల మల్లయ్య, బాణావత్ సైదులు, జట్టి వెంకన్న, పండగ వెంకన్న, ఎర్ర బాలాజీ, చక్రాల వెంకన్న, అంజయ్య పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



**ప్రజాపక్షం/గుండాల:** అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ గుండాల మండల 6వ మహాసభ మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లంకి మహేష్, మహేందర్‌లు హాజరై మాట్లాడారు. దేశంలో కార్పొరేట్ వ్యక్తుల చేతిలోకి విద్యా, వైద్య రంగాలు వెళ్లడం ద్వారా సామాన్య మధ్యతరగతి ప్రజలకు విద్యా వైద్యం అందుబాటులో లేకుండా పోతుందని అన్నారు. విద్యా, వైద్యం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యువత ముందుండి పోరాటం నిర్వహించాలని అన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ బారిన పడకుండా యువతలో చైతన్యం తీసుకురావాలన్నారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదిలలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో రాష్ట్ర మూడో మహాసభలు నిర్వహించడం జరుగుతుందని ఈ మహాసభల సందర్భంగా జరిగే యువ ప్రదర్శన బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం ఏఐవైఎఫ్ మండల నూతన కమిటిని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా సిరిపురం ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా గడ్డం భాను, ప్రధాన కార్యదర్శిగా బద్దుల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా వంశీ, కోశాధికారిగా అజయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కుసుమాని హరిచంద్ర, పృధ్వి, వంశీ, నరసింహా, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా హక్కుల పరిరక్షణకు ఉద్యమం

**జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి జంగమ్మ**



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మహిళల హక్కుల పరిరక్షణ, సమానత్వం, సామాజిక న్యాయం సాధన కోసం జాతీయ మహిళా సమైక్య ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బండి జంగమ్మ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో నిర్వహించిన జాతి మహిళా సమాఖ్య మండల మహాసభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న వివక్ష వేధింపులు, అరికట్టేందుకు మహిళలు సంఘటితంగా ఉద్యమించాలని అన్నారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకొని వాటి సాధన కోసం పోరాల్సిన అవసరం ఉందని అన్నారు. మహిళల ఆర్థిక సామాజిక రాజకీయ సాధికారపై సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి మహిళా సమాఖ్యను బలోపేతం చేస్తూ ప్రతి సమస్యపై ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటాలు నిర్వహించాలని ఆమె పిలుపునిచ్చారు. సర్పంచ్ కురు మిద్ద వినోద, గంగపురం లక్ష్మీ దేవి, చిలువేరు అరుణ, రాములమ్మ, వనజ, ప్రశాంతి, అనసూయ, కలకొండ పరమేశ్వరి, సువర్ణ, వినోద, కవిత పాల్గొన్నారు.

## హైవే భద్రత,సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి : ఎస్‌పి

**ప్రజాపక్షం/నకిరేకల్ (కట్టంగూర్):** పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల నుంచి ఫిర్యాదులను సున్నితంగా స్వీకరించి, సత్వర న్యాయం అందేలా చట్టపరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశించారు.కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.తనిఖీల్లో భాగంగా స్టేషన్‌లోని రికార్డులు,కేసుల దర్యాప్తు పురోగతి,పెండింగ్ కేసుల స్థితిగతులు,సీసీ కెమెరాల పనితీరు,స్టేషన్ నిర్వహణతో పాటు సిబ్బంది హాజరు వివరాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రౌడీషీటర్లు,హిస్టరీషీటర్లు,బెయిల్‌పై ఉన్న నేరస్థులపై నిరంతరం నిఘా ఉంచాలని, రాత్రివేళల్లో అనుమానాస్పద వ్యక్తులు,వాహనాలపై తరచూ నాకాబందీలు,తనిఖీలు నిర్వహించాలని సూచించారు.నేషనల్ హైవే పై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని ఆయన ఆదేశించారు.అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం,హెల్మెట్,సీటుబెల్ట్ ధరించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో శాలిగౌరారం సిఐ రాజశేఖర్ కట్టంగూర్ ఎఐఎస్ఐ రవీందర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నాలుగు లేబర్ కోడ్‌లతో అన్యాయం



**ఎఐటియుసి రాష్ట కార్యదర్శి మేకల శ్రీనివాసరావు**

**ప్రజాపక్షం/కోదాడ:** రాష్ట్రంలో సివిల్ సప్లై మార్కెటింగ్ గోదాముల్లో గ్రామాల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కోదాడ పట్టణంలోని ఎస్‌డబ్ల్యుసి సివిల్ సప్లై హమాలీలతో ఆగస్టు 1వ తేదీన జరిగే జిల్లా ఎఐటియుసి మూడవ మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు. అనంతరం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎస్ఐ ప్రావిడెంట్ ఫండ్ 20 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యంతో పాటు పని భద్రత పని ప్రదేశాల్లో విశ్రాంతి గదులను సురక్షితమైన మంచినీటిని, ఆరోగ్య కిట్లను సమకూర్చాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో నరేంద్రమోడి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ఉన్న హక్కులను కాలరాసే ప్రయత్నంలో భాగంగానే నాలుగు లేబర్‌కోడ్‌లు తీసుకవచ్చి కార్మిక లోకానికి తీవ్ర అన్యాయం చేస్తుందని, ఇలాంటి అనేక హక్కులను తీసివేస్తూ తీసుకవచ్చే జీవోలను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ మేస్త్రీలు పొలంపల్లి కొండలు, శ్రీనివాస్, గౌరినాయుడు, నాగయ్య, సైదా, పాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలి

**నిరుద్యోగ భృతి పై వెంటనే ప్రకటన చేయాలి : ఎఐవైఎఫ్**



**ప్రజాపక్షం/మోత్కూర్ :** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి వెంటనే అమలుచేయాలని అఖిల భారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కార్యదర్శి ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మోత్కూరు మండల నిర్మాణ మహాసభలో వారు మాట్లాడుతూ పోలీస్ కానిస్టేబుల్ నియామకాలలో 19 వేల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ కేవలం 5 వేల పోస్టులు భర్తీ చేస్తామనడం విడ్డూరం అన్నారు. సెప్టెంబర్ నెల 8,9,10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహా సభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా చిప్పలపల్లి ప్రశాంత్ ఉపాధ్యక్షులుగా నారబోయిన ప్రదీప్, ప్రధాన కార్యదర్శిగా మొగుళ్ళ శేఖర్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా ఊర మచ్చ గిరి, కోశాధికారిగా కొంపెల్లి అరుణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి అన్నేపు వెంకట్, అంబటి మచ్చ గిరి, గుగ్గిల చంటి, లింగస్వామి, విజయ్ పాల్గొన్నారు.

## పకడ్బందీగా జలసిరి పథకం

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జలసిరి పథకాన్ని చౌటుప్పల్ మండలంలోని గ్రామాల్లో పకడిబందీగా అమలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ సీఈవో శోభారాణి, మండల ప్రత్యేక అధికారి రవీందర్ లు అన్నారు. చౌటుప్పల్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్‌నేను ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, మ్యాజిక్ సోప్ పిట్ లు, ప్రతి గ్రామంలో ఫాంపాండ్లు, ఊట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి వర్షపు నీటిని ఒడిసి పట్టాలని సూచించారు. ఈ సమావేశంలో చౌటుప్పల్ ఎంపీడీవో కె.శ్రీలత, తహసిల్దార్ వీరా బాయిలతో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై మెరుపు దాడి



**ప్రజాపక్షం/దేవరకొండ :** నల్గొండ డిపిఈవో ఆదేశాల మేరకు, దేవరకొండ ఎస్‌హెచ్‌వో, నల్గొండ ఎస్‌హెచ్‌వో, నాంపల్లి ఎస్‌హెచ్‌వోలతో కలిసి మంగళ వారం దేవరకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని మేగ్యతండా, పన్నితండా, అంగోత్ తండా, కేశ్యతండా, మర్రిచెట్టు తండాలలో సంయుక్త ఐడి నాటు సారా దాడులు నిర్వహించినట్లు దేవరకొండ ఎక్సైజ్ అండ్ ప్రొహిబేషన్ సిఐ శ్రీనివాస్ తెలిపారు. అక్రమంగా మద్యం, గుడుంబా నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని 4 కేసులు నమోదు చేయగా, నాటుసారా 4 లీటర్లు, ధ్వంసం చేసి ఎఫ్‌జే వాష్ 600 లీటర్లు స్వాధీనం పటిక 40 కిలోలను, ముగ్గురు వ్యక్తులను బైండోవర్ చేసినట్లు సిఐ తెలిపారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
బుధవారం
29-07-2026
www.prajapaksham.in

హీరో దుల్కర్ సల్మాన్ నూతన దర్శకుడు రవి నెలకుదిటి దర్శకత్వంలో రూపొందుతున్న క్రేజీ ఎంటర్‌టైనర్ 'శ్రీ శ్రీ'. ఎస్‌ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్, నిర్మాణ సంస్థకు 10వ మైల్ స్టోన్ చిత్రంగా నిలుస్తోంది.

రీల్



## 'కింగ్ - జాకీ - క్వీన్' ట్రైలర్ రిలీజ్

సక్సెస్ ఫుల్ నిర్మాత సుధాకర్ చెరుకూరి ఎస్ ఎల్ వి సినిమాస్ బ్యానర్ పై నిర్మించిన పీరియడ్ క్రైమ్ డ్రామా కింగ్ జాకీ క్వీన్. 1990ల నాటి నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో 'దసరా', 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రాలతో గుర్తింపు పొందిన దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్నారు. వీరితో పాటు నూతన నటుడు శశి ఓదెల, యుక్తి తరేజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గత ఏడాది కన్నుమూసిన దర్శకుడు కేకేకి ఇది చివరి చిత్రం. ఆయన క్రియేటివిటీ, సినిమా పట్ల ఆయనకున్న అంకితభావానికి ఇది ఒక నివాళిగా నిలుస్తుంది. తాజాగా చిత్ర బృందం థియేట్రికల్ ట్రైలర్ను విడుదల చేసింది. దావూద్ ఇబ్రహీం, అజ్మల్ కసబ్, మదర్ థెరిసాలతో పోలుస్తూ ప్రధాన పాత్రలను పరిచయం చేసే ఆకట్టుకునే వాయిస్‌ఓవర్తో ట్రైలర్ ప్రారంభమవుతుంది. పరిస్థితులు ఒక మనిషిని క్రూర మృగంగానో, గొప్ప మహర్షిగానో లేదా సాధారణ మనిషిగానో ఎలా మారుస్తాయో ఇది సూచిస్తుంది, దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజా పోషించిన పాత్రలకు బలమైన పునాదిని వేస్తుంది. అధికారం, అహంకారం, ఉత్కంఠభరితమైన కథని ప్రజెంట్ చేస్తోంది. ఇందులో ఇద్దరు ప్రాణ స్నేహితుల మధ్య తలెత్తే తీవ్ర సంఘర్షణ కథను నడిపిస్తుంది.సినిమాటోగ్రాఫర్ నాగేశ్ బనెల్ ఆ కాలం నాటి వాతావరణాన్ని అద్భుతంగా ప్రతిబింబించే దృశ్యాలతో సినిమాకు గొప్ప అందాన్ని తీసుకురాగా, పూర్ణచంద్ర తేజస్వి అందించిన నేపథ్య సంగీతం సినిమాలోని ఉద్వేగాన్ని, ఉత్కంఠను మరింత పెంచింది.ఆగస్టు 7న రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## బొమ్మా.. నిను గీసిందెవరమ్మా!



హీరో దుల్కర్ సల్మాన్ నూతన దర్శకుడు రవి నెలకుదిటి దర్శకత్వంలో రూపొందుతున్న క్రేజీ ఎంటర్టైనర్ 'శ్రీ శ్రీ'. ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్, నిర్మాణ సంస్థకు 10వ మైల్ స్టోన్ చిత్రంగా నిలుస్తోంది. ఇషాన్ సక్సేనా ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే తొలిసారి జంటగా నటిస్తున్న ఈ సినిమా ప్రేమ, వినోదం, భావోద్వేగాలతో కూడిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందన అందుకోగా, తాజాగా ఈ సినిమా మ్యూజికల్ జర్నీని ప్రారంభిస్తూ తొలి పాట 'బొమ్మ బొమ్మ'ను విడుదల చేశారు. రైల్వే స్టేషన్‌లో బెంచిపై కూర్చున్న దుల్కర్ సల్మాన్, ప్లాట్‌ఫాంకి పూజా హెగ్డే అడుగుపెట్టిన క్షణమే ఆమెకు మెస్మరైజ్ అవుతాడు . అక్కడి నుంచి ఇద్దరి అందమైన ప్రేమ ప్రయాణాన్ని, ఆనంద క్షణాలను, వారితో పాటు ఉండే ఓ బృందాన్ని ఈ పాటలో అందంగా చూపించారు. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ మరోసారి మనసును హత్తుకునే మధురమైన మెలోడీని అందించారు. ఆహ్లాదకరమైన ట్యూన్, అందమైన ఆర్కెస్ట్రేషన్తో ఈ పాట ఆకట్టుకుంటుంది. అనంత శ్రీరామ్ తన సాహిత్యంతో ప్రేమలో మునిగిపోయిన ఓ యువకుడి భావాలను కవితాత్మకంగా ఆవిష్కరిస్తూ, కథానాయిక అందం, ఆమె ప్రత్యేకతను ఎంతో అందంగా వర్ణించారు. కపిల్ కపిలన్ తన మెలోడీ వోకల్ తో పాటకు మరింత అందం తీసుకురాగా, రామ్ మాస్టర్ అందించిన కోరియోగ్రఫీ విజువల్గా పాటను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. ఈ చిత్రానికి అనయ్ ఓం గోస్వామి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. పాన్ ఇండియా చిత్రంగా రూపొందుతున్న 'శ్రీ శ్రీ' తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.



## 'స్వర్ణ'గా శ్రీనిధి శెట్టి

విక్టరీ వెంకటేష్ పోషించిన చిట్టిబాబు పాత్ర పరిచయానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించిన నేపథ్యంలో 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' చిత్ర బృందం ఈ ఆదర్శ కుటుంబంలోని మరో కీలక సభ్యురాలిని పరిచయం చేసింది.ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి 'స్వర్ణ' పాత్రలో నటిస్తున్నారు. చిట్టిబాబుకు భార్యగా, చిరునవ్వే చిరునామాగా ఉండే ఓ ఆప్యాయమైన మధ్యతరగతి ఇల్లాలిగా ఆమె పాత్ర ప్రేక్షకుల హృదయాలను హత్తుకోనుంది. చిట్టిబాబు, స్వర్ణల మధ్య ఉండే అనుబంధం, చిలిపి సంభాషణలు, అనురాగం, కుటుంబ విలువలు సినిమాకు మరింత ఆత్మను, ఆహ్లాదాన్ని అందించనున్నాయి.విడుదలైన ఈ క్యారెక్టర్ గ్లింప్స్‌లో నివేదా పేతురాజ్, వాతావరణాన్ని మరింత ఆసక్తికరంగా మలిచారు. ఇప్పటికే విడుదలైన పాత్ర పరిచయాలు ప్రేక్షకుల్లో విశేష ఆసక్తిని రేకెత్తించగా, త్వరలోనే యువినా పార్థవిను 'సంపూర్ణ'గా, రాజా ప్రజ్వల్ ను 'సర్వ'గా చిత్ర బృందం పరిచయం చేయనుంది. ప్రఖ్యాత హారిక హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం త్రివిక్రమ్ శ్రీనివాస్ వహిస్తున్నారు. థమన్ ఎస్. సంగీతం అందిస్తుండగా, రవి.కె. చంద్రన్ ఛాయాగ్రహణం, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది.

## 'సిత్తరాల నవ్వు' పాట ఆవిష్కరణ



హీరో తిరువీర్ నటిస్తున్న కొత్త సినిమా 'భగవంతుడు'. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ నటుడు రిషి ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను ఏషియన్ ఫిలిమ్స్ నారాయణ దాస్ నారంగ్, పనస శంకరయ్య గౌడ్ సమర్పణలో రవి పనస ఫిలిం కార్పొరేషన్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెంబర్ 1గా నిర్మిస్తున్నారు సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రవి పనస. ఈ సినిమాతో జి.జి. విహారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న 'భగవంతుడు' సినిమా త్వరలోనే రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ పాటను మ్యూజిక్ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్ బ్యూటిఫుల్ గా కంపోజ్ చేయగా, డైరెక్టర్ జి జి విహారి ఆకట్టుకునే లిరిక్స్ అందించారు. ప్రముఖ సింగర్ జావెద్ అలీ రిపీటెడ్ గా వినేలా పాడారు. 'సిత్తరాల నవ్వు' పాట ఎలా ఉందో చూస్తే 'సిత్తరాల నవ్వు, అరే సిలకల్లే నువ్వు, చేమంతి పువ్వు, నీలాల కళ్లు, అరే పారే సెలయేళ్లు, ఒంపు పరవళ్లు..అంటూ సాగుతూ ఏరువాక పున్నమి లాంటి అమ్మాయి, కొండ గాలి దేవర వంటి అబ్బాయి మధ్య ప్రేమను చూపిస్తూ రూపొందించిన చిత్రమిది. ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్ ఆయేషా మరియం, యాక్షన్ రామ్ కిషన్, రాబిన్ సుబ్బు, లిరిక్స్ చంద్రబోస్, గోరెటి వెంకన్న, కాసర్ల శ్యామ్,కొరియోగ్రఫీ ఈశ్వర్ పెంటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రవితేజ పూదారి, సినిమాటోగ్రఫీ రాజ్ తోట, మ్యూజిక్ కె.పి, ప్రొడక్షన్ డిజైనర్ గాంధీ నడికుడికర్, ఎడిటర్ ప్రవీణ్ పూడి,సమర్పణ ఏషియన్ ఫిలిమ్స్ నారాయణ దాస్ నారంగ్, పనస శంకరయ్య గౌడ్.

## నాది మోడరన్ క్యారెక్టర్

'కొరియన్ కనకరాజు' హీరోయిన్ రితిక నాయక్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు'తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హారర్ కామెడీ 'కొరియన్ కనకరాజు' ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 7న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ రితిక నాయక్ మీడియా తో చిట్ చాట్ నిర్వహించారు. కొరియా వెళ్ళడం నన్ను మొదట ఆకట్టుకుంది. ఎందుకంటే నాకు కొరియన్ కల్చర్, అక్కడి సినిమాలు, కొరియన్ డ్రామాలు అంటే చాలా ఇష్టం. ఇందులో నేను చేసిన పాత్రకు, నా వ్యక్తిత్వానికి కూడా కొన్ని పోలికలు ఉన్నాయి. ఇది కేవలం కమర్షియల్ పాత్ర మాత్రమే కాదు. చాలా డిఫరెంగా ఉంటుంది. మంచి స్క్రిప్ట్ కోసం ఎంతకాలమైనా ఎదురుచూడగలను. ఒక పాత్రకు నేను 100 శాతం న్యాయం చేయగలనని అనిపిస్తేనే అంగీకరిస్తాను. ఇప్పటివరకు నేను చేసిన పాత్రలన్నింటికంటే ఇది చాలా మోడరన్ క్యారెక్టర్. వరుణ్ తేజ్ చాలా హార్డ్వర్కింగ్ పర్సన్. తన వృత్తి పట్ల ఎంతో డెడికేషన్ ఉంటుంది. హారర్ కామెడీలు చాలా వచ్చినప్పటికీ, ఇందులోని కథ, ఇండియన్‌కొరియన్ కల్చర్స్ అంశాలు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయి.అనంతపురంలో కొంత భాగం షూటింగ్ చేశాం. అలాగే కజకిస్థాన్, కొరియాలో షూటింగ్ చేశాం. యూవీ క్రియేషన్స్తో పనిచేయడం చాలా మంచి ఎక్స్ పీరియన్స్. అవకాశం వస్తే తప్పకుండా అన్ని భాషల్లో పనిచేయాలని ఉంది. కానీ తెలుగుకే నా మొదటి ప్రాధాన్యత. ఎందుకంటే ఇది నా మదర్ ఇండస్ట్రీ. 'అశోకవనంలో అర్జున కళ్యాణం', మిరాయ్, 'హాయ్ నాన్న' నేను చేసిన ప్రతి సినిమాను ప్రేక్షకులు ఎంతో ఆదరించారు.మంచి కథ, పాత్రకు ప్రాధాన్యం ఉన్న అన్ని రకాల సినిమాలు చేయాలని ఉంది.సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. చూస్తున్నంతసేపూ నేను నవ్వుతూనే ఉన్నాను. ప్రేక్షకులు కూడా అదే స్థాయిలో ఎంటర్టైన్ అవుతారని నమ్ముతున్నాను.'మిరాయ్ 2' ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. దాని గురించి చెప్పడానికి ఇంకా సమయం ఉంది. ప్రస్తుతం ఒక తెలుగు ప్రాజెక్ట్ చేస్తున్నాను.

## సినినటి పావలా శ్యామల కన్నుమూత



తెలుగు సినీ పరిశ్రమలో తనదైన నటనతో ఎంతోమందిని నవ్వించిన ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్, సీనియర్ నటి పావలా శ్యామల ఇక లేరు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత 1:52 గంటల సమయంలో ఆమెకు తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించినట్లు ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు ప్రకటించారు. ప్రస్తుతం ఆమె భౌతికకాయాన్ని ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. పావలా శయమాల కూతురు కూడా అనారోగ్యంతో ఇదే గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పావలా శ్యామల గత కొన్నేళ్లుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, వృద్ధాప్య సమస్యలతో జీవన పోరాటం సాగిస్తున్నారు. ఆమెతో పాటే ఉన్న ఆమె కుమార్తె కూడా ప్రస్తుతం తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కొద్ది రోజుల పాటు పావలా శ్యామల , ఆమె కూతురు ఒక వృద్ధాశ్రమంలో ఉన్నారు. ఈ క్రమంలోనే అనారోగ్యం మరింతగా క్షీణించడంతో తెలంగాణ ఎఫ్ డీ సి చైర్మన్ , ప్రభుత్వ అధికారులు ఆమె ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అయితే జూనియర్ ఎన్టీఆర్ నటించిన ఆంధ్రావాలా సినిమాతో క్యారెక్టర్ నటిగా ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఆమె మరణం పట్ల నటి కరాటే కళ్యాణి సంతాపం ప్రకటింరు ప్రకటించారు.

# పిఎంఎవై–జి కింద 11.56 లక్షల ఇండ్లను కేటాయించండి

**కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన(గ్రామీణ్ (పిఎంఎవై–జి )కింద 11.56 లక్షల ఇండ్లను కేటాయించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గారికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కేంద్ర మంత్రి కి సిఎం తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి పలువురు ఎంపిలతో కలిసి కృషి భవన్‌లో కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వివరించారు. గత ప్రభుత్వం పిఎంఎవై–జి ని వినియోగించుకోకపోవడంతో రాష్ట్రంలో గత పదేళ్ల పేదలు సొంత ఇళ్లు నిర్మించుకోలేకపోయారని, ఇప్పుడు తీవ్ర డిమాండ్ నెలకొందని తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ రూపొందించిన ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు సిఎం వివరించారు. సాధ్యమైనంత త్వరగా తెలంగాణకు ఇళ్లు కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఎల్‌నినో, తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ)లో (విబి జీ రామ్ జీ) అదనపు పనులను చేర్చాలని, వర్షాభావంతో పనులు లేనందున ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, రైతు కూలీలకు జీవనోపాధిని మెరుగుపర్చేందుకు, పంటల వైవిధ్యీకరణ ప్రోత్సాహానికి అదనపు పనులను చట్టంలో చేర్చాలని సిఎం విజ్ఞప్తి చేశారు. రైతులు తమ భూముల్లో కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల అభివృద్ధి, మల్బరీ తోటల సాగు, పట్టు పురుగుల పెంపకం షెడ్లు, ఇళ్ల సమీపంలో ఆకు కూరలు, కూరగాయల తోటలు, వెదురు వనాలు పెంచుకునే పనులను విబి జీ రామ్ జీలో చేర్చాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. కొండ ప్రాంతాలతో పాటు కొండ వాలుల్లో నీటి నిల్వ చేసుకునే కందకాలు, ఇప్పటికే ఉన్న ప్లాంటేషన్లు, పండ్ల తోటల్లో తేమ రక్షణకు కందకాల నిర్మాణం, వరదలు, ఇసుక మేటలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణకు అవసరమైన పనులు విబి జీ రామ్ జీలో చేపట్టాలని కోరారు. ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఈజిఎస్) కింద ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ సమయంలో 90 రోజుల వరకు పనులు చేసే అవకాశం ఉండేదని, విబి జీ రామ్ జీ లోనూ అందుకు అనుమతి ఇప్పించాలని సిఎం కోరారు. స్థానిక అవసరాలకు తగినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించే ఇతర పనులను విబి జీ రామ్ జీలో చేర్చాలన్నారు. ముఖ్యమంత్రి వెంట ఎంపిలు ఎం ఎం.అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, పోరిక బలరాం నాయక్, సురేష్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రామసహాయం రఘురామ్ రెడ్డి, గడ్డం వంశీ కృష్ణ, ఎక్స్‌అఫిషియో స్పెషల్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

## పోలీసు అదుపులో ట్రైనీ ఐపిఎస్ అధికారి

**ప్రజాపక్షం/హైదరాబాద్:**జాతీయ పోలీసు అకాడమీలో శిక్షణలో ఉన్న మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిపై లైంగిక దాడికి పాల్పడిన ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ క్రిష్ణారెడ్డిని ఉమెన్‌సేఫ్టీవింగ్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఉదయ్ కృష్ణారెడ్డిపై ఈ నెల 18న అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఇదిలావుండగా లైంగిక వేధింపులకు గురైన ట్రైనీ మహిళా ఐపిఎస్ అధికారిని వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలో ఆమెపై పలుచోట్ల గాయాలు ఉన్నట్లు నిర్ధారణ అయినట్లు తేలింది. ఉదయ్‌క్రిష్ణారెడ్డిని విచారించేందుకు దర్యాప్తు అధికారులు పలుమార్లు ప్రయత్నించినా అతని ఆచూకీ లభించలేదు. నోటీసులు తీసుకోకపోవడంతో అతని ఇంటికి నోటీసులను అతికించారు. ఈ క్రమంలోనే అతని ఆచూకీ లభించడంతో చాకచక్యంగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

## 15 ఏళ్లుగా విడిగా ఉంటే.. విడాకుల మంజూరు సబబే

**హైకోర్టు తీర్పు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత15 ఏళ్లుగా భార్యాభర్తలు విడివిడిగా జీవిస్తున్నారంటే వివాహ బంధం పూర్తిగా విచ్ఛిన్నమైనట్లేనని హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో కుటుంబ న్యాయస్థానం మంజూరు చేసిన విడాకుల డిక్రీని సమర్థిస్తూ భార్య దాఖలు చేసిన అప్పీలును కొట్టివేసింది. శాశ్వత భరణం కోరాలంటే హిందూ వివాహ చట్టం సెక్షన్ –25 ప్రకారం కింది కోర్టును ఆశ్రయించాలని సూచించింది. దాంపత్య హక్కుల పునరుద్ధరణకు భార్య ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, రాజీ ప్రయత్నాలు ఫలించకపోవడం వంటి అంశాలను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

## ఇరాన్ దౌత్య చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

స్థిరత్వం సాధించాలని, అందుకు సహకారాన్ని బలోపేతం చేసుకోవాల్సి ఉందని అన్నారు. అమెరికాతో పెరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయన ఈ ఫోన్ సంభాషణలు చేశారు. అమెరికా చర్చలబల్ల వద్ద ఒక మాఫియా ముఠా తరహాలో ప్రవర్తిస్తోందని, నీతి నియమాలు లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించిన ఇరాన్ ఆ దేశంతో 13 రోజుల పోరాటాన్ని నిలిపివేసినప్పటికీ చర్చల ప్రక్రియకు తాము దూరంగా ఉన్నామని ప్రకటించింది. ప్రాంతీయస్థాయిలో మిత్రులను అక్కునజేర్చుకుని ఐక్యత సాధించే ప్రయత్నాలు ప్రారంభించింది. మరోవైపు ఇరాన్ సర్వోన్నత అధిపతి మొజ్తాబా ఖమేనీ సోమవారం రాత్రి విడుదల చేసిన ఒక లేఖలో ఒకవేళ అమెరికాతో చర్చలు జరిగితే ఈ ఎంఓయులో లెబనాన్ దేశమే తమకు అత్యంత ముఖ్యమైన అంశంగా ఉంటుందని స్పష్టం చేశారు. లెబనాన్‌లో అన్ని రకాల సైనిక కార్యకలాపాలను ఇజ్రాయెల్ నిలిపివేయాలని మొజ్తాబా ఖమేనీ డిమాండ్ చేశారు. అదేవిధంగా హెజ్బొలా ఉగ్రవాద సైన్యాలకు ఆయన తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఇదిలా ఉండగా,నౌకలు స్వచ్ఛందంగా రుసుములు చెల్లించడం ద్వారా హోర్ముజ్ జలసంధి నిర్వహణకు ఒక ఉమ్మడి ప్రాంతీయ యంత్రాంగం ఏర్పాటు చేసేందుకు ఒమన్ ప్రభుత్వం ఇరాన్‌కు ఒక ప్రతిపాదన చేసినట్లు గల్ఫ్‌లోని ఒకవర్గం రాయిటర్స్ వార్తాసంస్థకు తెలియజేసింది. ఈ సమాచారం ప్రకారం హోర్ముజ్ జలసంధిపై కేవలం ఇరాన్ పెత్తనం మాత్రమే ఏకపక్షంగా కొనసాగే అవకాశం ఉండదు. ఈ జలసంధిని ఉపయోగించుకునేవారంతా జలసంధి నిర్వహణ,పర్యావరణ పరిరక్షణ,భద్రత, పరిశోధన,రక్షణ కార్యకలాపాల నిమిత్తం విరాళాలను స్వచ్ఛందంగా సమకూరుస్తారు. మలక్కా జలసంధి తరహాలో ఈ ప్రతిపాదనను ఒమన్ చేసింది.



## వేధింపులు ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

సంఘ్–బిజెపి దాడులను ప్రతిఘటించడం, ఆర్థిక ఉపశమనం కోసం, లోక్‌సభ, శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల తక్షణ అమలు కోసం ఉమ్మడి పోరాటాలను ఉధృతం చేసేందుకు, కార్మిక సంఘాలు, రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళా రంగాలలో మరింత సన్నిహిత సహకారాన్ని పెంపొందించుకునేందుకు మూడు వామపక్ష పార్టీలు అంగీకరించాయి. ఈ మేరకు మూడు పార్టీలు ఉమ్మడి ప్రకటన చేశాయి.

**సిపిఐ నేతలతో లోక్ తాంత్రిక్ జనతాదళ్ భేటీ**

సిపిఐ జాతీయ నాయకులతో కేంద్ర మాజీ మంత్రి శరద్ యాదవ్ స్థాపించిన లోక్‌తాంత్రిక్ జనతా దళ్ అధ్యక్షుడు జావేద్ రజా మంగళవారం సమావేశమయ్యారు. న్యూఢిల్లీలోని అజయ్‌భవన్‌లోను ఆయన సందర్శించి, దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితిపై చర్చించేందుకు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బాల్‌చంద్ర కాంగో, డాక్టర్ గిరీశ్‌లతో సమావేశమయ్యారు. జాతీయ రాజకీయ ముఖచిత్రంపై గణనీయమైన ప్రభావాన్ని చూపిన ఇటీవలవిద్యార్థి ఉద్యమం అనంతరం మారుతున్న రాజకీయ పరిస్థితులపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. వివిధ రాష్ట్రాల్లో జరగబోయే శాసనసభ ఎన్నికలపై కూడా పరస్పరం నాయకులు అభిప్రాయాలను పంచుకున్నారు. లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను వారు నొక్కి చెప్పారు. రాబోయే రాజకీయ సవాళ్లపై విస్తృత అవగాహన పెంచుకోవడానికి, ఐక్య ప్రజాస్వామ్య, లౌకిక ప్రత్యామ్నాయం దిశగా కృషి చేయడానికి, భావసారూప్యత కలిగిన ఇతర లౌకిక పార్టీలతో వీలైనంత త్వరగా సంప్రదింపులు ప్రారంభించాలని నిర్ణయించారు.



## చర్యలు తప్పవ్

(మొదటి పేజీ తరువాయి)

స్పెషల్ ఫీజు, కెరీర్ డెవలప్‌మెంట్ ఫీజు, క్యాంపస్ రిక్రూటమెంట్ ట్రైనింగ్, యూనిఫాం ఫీజు ఇలా రకరకాల పేర్లతో విద్యార్థుల నుంచి కళాశాల యాజమాన్యాలు అదనపు ఫీజులను వసూలు చేస్తున్నట్టు తెలిసిందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుములు మినహా, ఇతర పేర్లతో అదనపు మొత్తాలను వసూలు చేయడం పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని కమిటీ స్పష్టం చేసింది. ఇలా చిన్న మొత్తంలో ఫీజులను వసూలు చేసినప్పటికీ 'క్యాపిటేషన్ ఫీజు' (డొనేషన్) కిందకే వస్తుందని, ఇలా వసూలు చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులనే వసూలు చేయాలని, యాజమాన్యాలు నిబంధనలకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే రూ.2 లక్షల జరిమానాతో పాటు సంబంధిత చట్టాల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కళాశాలలు అదనపు ఫీజులను డిమాండ్ చేస్తే తల్లిదండ్రులు ఆధారాలతో సహా తమకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించింది. , ఈ ఫిర్యాదుల పైన విచారణ చేపట్టి, సదరు విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని టిఎఎఫ్ఆర్‌సి వెల్లడించింది.

## కేంద్రం సమన్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆకట్టుకోవడం, పేపర్ లీక్‌లపై కఠిన చర్చ తీసుకుంటామన్న ప్రభుత్వ నిబద్ధతను నొక్కిచెప్పడం లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ జులై 23న తన ఇన్‌స్టాగ్రామ్‌లో తొలిసారిగా సెల్ఫీ తీసుకుని పోస్ట్ చేసిన వీడియోను ఫేస్ బుక్‌లో షేర్ చేశారు. అయితే, ఆ తర్వాత ఫేస్‌బుక్‌లోని ఆ వీడియోను 'మెటా' నిరోధించింది. దీంతో బిజెపి కార్యకర్త ప్రీతిగాంధీ ఆ ప్లాట్‌ఫారమ్ చర్యలను ప్రశ్నించారు.ఫేస్‌బుక్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సెల్ఫీ వీడియోపై ఆంక్షలు విధించారనే ఆరోపణపై ఆమె 'ఎక్స్'లోని ఒక పోస్ట్‌లో విమర్శించారు. ఈ చర్య కంపెనీ రాజకీయ పక్షపాతం, పారదర్శకత, జవాబుదారీతనంపై ప్రశ్నలను లేవనెత్తుతోందని ఆమె పేర్కొన్నారు. 'ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమైన ప్రధానమంత్రి భారత యువతతో మమేకం అవ్వడానికి తన తొలి సెల్ఫీ వీడియోను అప్‌లోడ్ చేస్తే,ఫేస్‌బుక్ దానిని నిరోధిస్తుందా?' అని మండిపడ్డారు. 'లక్షలాదిమంది భారతీయులు ఏమి చూడాలి? ఏమి చూడకూడదు? అనే అని నిర్ణయించే అధికారం మెటా'కు ఎవరు ఇచ్చారు' అని ఆమె ఘాటుగా ప్రశ్నించారు. ఇది కేవలం కంటెంట్ నియంత్రణ మాత్రమే కాదని, తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుందని ధ్వజమెత్తారు. 'మెటా' క్షమాపణ చెప్పి, ఆ కంటెంట్ పొరపాటున తొలగించబడిందని అంగీకరించింది. అప్పటినుంచి ఆ ప్లాట్‌ఫారమ్‌ను పునరుద్ధరించింది. కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన విద్యార్థి నిరసనల మధ్య జులై 23న పోస్ట్ చేసిన వీడియో , ప్రధానమంత్రి నరేంద్రమోదీ యువతను ఆకట్టుకునే ప్రయత్నంగాఉంది. పేపర్ లీక్‌లపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలుకల్పించే నిబంధనలతో కూడిన ఆ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నట్లు ప్రధాని మోదీ తన సెల్ఫీ వీడియోలో ప్రకటించారు. అంతేకాకుండా ఆ బిల్లు రూపురేఖలను కూడా ప్రధాని ఆ వీడియోలో వివరించారు. దీనిపై మరుసటి రోజు (శుక్రవారం ) జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించారు. గత కొన్ని వారాలుగా 'మెటా' అనేక అంశాలపై నియంత్రణ పరిశీలనలను ఎదుర్కొంటుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com